సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 334
శుక్రవారం 24-2-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'


తిరుపతి పుట్టినరోజు నేడు
1130 ఫిబ్రవరి 24న తిరుపతి నగరానికి శంకుస్థాపన జరిగింది. - 16లో


హరిత ప్రగతి బాట
గ్రీన్ ఎనర్జీ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్న మోదీ. - 6లో


ప్రపంచబ్యాంకు అధ్యక్షుడిగా బంగా!
ప్రపంచబ్యాంకు సారథిగా భారత-అమెరికన్ అజయ్ బంగా పేరును నామినేట్ చేసిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.
- వివరాలు 6లో▶


అమెరికాలో మంచు తుపాను
అమెరికాను భీకర మంచు తుపాను వణికిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో చాలా చోట్ల స్కూళ్లు, కార్యాలయాలు మూతబడ్డాయి.
- వివరాలు 6లో▶


కాంగ్రెస్ నేత పవన్ ఖేడా అరెస్ట్
ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అస్సాం పోలీసులు కాంగ్రెస్ నేత పవన్ ఖేడాను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేశారు.
- వివరాలు 6లో▶


భూమికి ఐదో పొర
ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు జరిపిన ప్రయోగంలో భూమికి ఐదో పొర కూడా ఉన్నట్లుగా తేలింది.
- వివరాలు 6లో▶

ఏది నిజం?
పచ్చ పైత్యం ముదిరిపోయింది!

- వివేకా హత్య కేసులో సీబీఐ పేరు చెబుతూ మరో దుర్మార్గపు వంటకం
- సునీల్ యాదవ్ కదలికలపైనా సీబీఐ పరస్పర విరుద్ధ నివేదికలు
- ఫోన్ లోకేషన్ ద్వారా కనుగొన్నామని 2021, డిసెంబర్‌లో చెప్పిందొకటి..
- 14 నెలల తరువాత ఇప్పుడు చెబుతున్న లోకేషన్ వేరొకటి
- దస్తగిరి, ఎర్ర గంగిరెడ్డి సహా నిందితులు వివేకాకు అత్యంత సన్నిహితులు.. ఆయన కుమార్తెకు, అల్లుడికి, పెద్ద బావమరిదికి కూడా సన్నిహితులే
- ఈ కోణాన్ని ఎంతమాత్రం పట్టించుకోకుండా వెళ్తున్న సీబీఐ
- సాక్షులు చెప్పని విషయాలు సైతం చెప్పినట్టుగా వాంగ్మూలాలు నమోదు
- పచ్చ పత్రికల్లో పతాక శీర్షికల్లో కథనాలుగా అవే వాంగ్మూలాలు
- అవినాశ్ కోసం తన తండ్రి ప్రచారం చేశారని చెప్పిన సునీత
- రూ.40కోట్ల సుపారీ అంటూ ఊహాజనిత కథనాలతో ప్రజల్ని మోసపుచ్చే కుట్ర
- కేసు దర్యాప్తును ప్రభావితం చేస్తున్న బీజేపీలోని చంద్రబాబు కోవర్టులు
- వాటి ఆధారంగా విషం కక్కుతున్న ఈనాడు, ఎల్లో మీడియా

4 లో

నేటి నుంచి కాంగ్రెస్ మేధోమథనం

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనుంది. బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా భావసారూప్యత ఉన్న పార్టీలతో పొత్తుల పై మేధోమథనంలో చర్చించనున్నారు. - 6లో▶

ఇదండీ సంగతి


మా మీద కాస్త దయతలచి మాకూ రుణాలిప్పించండి సార్!

నేటి నుంచి బయో ఆసియా-2023 సదస్సు

జీవశాస్త్రాలకు నైపుణ్యాల రెక్కలు

BIOASIA 2023 ADVANCING FOR ONE
FEBRUARY 24th - 26th, HYDERABAD

50కి పైగా దేశాలు..	800 కార్పొరేట్ సంస్థలు..	2,500 మందికి పైగా ప్రతినిధులు..
70 మందికి పైగా వివిధ రంగాల ప్రముఖులు..	1,000కి పైగా భాగస్వామ్య సమావేశాలు..	

హైదరాబాద్ వేదికగా అతిపెద్ద సదస్సు

- హెచ్ఐసీసీ ప్రాంగణంలో ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- 20వ సదస్సు భాగస్వామిగా బ్రిటన్
- తొలిసారిగా పాల్గొననున్న 'ఆపిల్'సంస్థ
- కీలకోపన్యాసం చేయనున్న నోవార్టిస్ సీఈఓ వాస్ నరసింహన్
- రాబర్ట్ లాంగర్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ పురస్కారం
- 2028 నాటికి వంద బిలియన్ డాలర్ల పరిశ్రమగా లైఫ్ సైన్సెస్
- 4 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం
- యువతకు నైపుణ్య శిక్షణపై సర్కారు కీలక ప్రకటన!

సాక్షి, హైదరాబాద్: జీవశాస్త్ర, ఆరోగ్య రక్షణ రంగాలకు సంబంధించి ఆసియాలోనే అతిపెద్ద వేదిక.. 'బయో ఆసియా'20వ వార్షిక సదస్సుకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. 'బయో ఆసియా 2023'పేరిట, నాణ్యమైన వైద్యం..అందరికీ ఆరోగ్యం లక్ష్యంగా.. శుక్రవారం నుంచి మూడురోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) ప్రాంగణంలో ఉదయం 10.30కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు దీనిని ప్రారంభిస్తారు. 'అడ్వాన్సింగ్ ఫర్ వన్.. షేపింగ్ ది నెక్ట్స్ జనరేషన్ హ్యూమనైజ్డ్ హెల్త్‌కేర్'అనే నినాదంతో నిర్వహిస్తున్న సదస్సులో ఆరోగ్య రంగాన్ని మరింత మానవీయంగా మార్చడం అనే అంశంపై సుదీర్ఘ చర్చలు, ఉపన్యాసాలు, ప్రదర్శనలు, ప్రజెంటేషన్లు చోటు చేసుకోనున్నాయి. ఆయా రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన ప్రముఖులు 70 మందికి పైగా ప్రసంగించనున్నారు. 50కి పైగా దేశాల నుంచి సుమారు 2,500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సులో సుమారు 800 కార్పొరేట్ సంస్థలు పాల్గొంటున్నాయి. వివిధ దేశాల ప్రతినిధుల మధ్య వేయికి పైగా భాగస్వామ్య సమావేశాలు జరిగేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా ఇస్తున్న 'జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్'పురస్కారాన్ని ఈసారి ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీపై కృషి చేసిన ప్రొఫెసర్ రాబర్ట్ లాంగర్‌కు అందజేయనున్నారు. సదస్సు నిర్వహణలో బ్రిటన్ భాగస్వామ్యం వహిస్తుండగా, స్థానిక పార్ట్‌నర్‌గా ఫ్లాండర్స్

మిగతా 2వ పేజీలో ▶

ఐదేళ్లలో రెట్టింపు పురోగతి

- లైఫ్ సైన్సెస్‌లో లక్ష్య సాధనకు సర్కారు కృషి: మంత్రి కేటీఆర్ వెల్లడి
- బీఎంఎస్ సంస్థతో ఒప్పందం

- వివరాలు 2లో▶

శత్రుదేశంపై దండయాత్రలాగా..

కేంద్ర సంస్థలను వేటకుక్కల్లా ఉసిగొల్పుతున్నారు: మోదీపై మంత్రి కేటీఆర్ ధ్వజం


భూపాలపల్లిలోని ఓ డబుల్‌బెడ్‌రూం ఇంట్లో పాలు పొంగించేందుకు స్టౌ వెలిగిస్తున్న మంత్రి కేటీఆర్

- 75 ఏళ్లలో కాంగ్రెస్‌ను పదిసార్లు గెలిపిస్తే చేసిందేముంది?
- ఎన్నికల యుద్ధానికి యువత సిద్ధం కావాలి
- భూపాలపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు

భూపాలపల్లి: 'శత్రుదేశం మీద కక్ష గట్టి దండయాత్రకు దిగినట్లుగా.. ప్రధాని నరేంద్ర మోదీ వేటకుక్కల్లాంటి కేంద్ర సంస్థలను తెలంగాణపైకి ఉసిగొల్పుతున్నారు. పీఎం మోదీ దేవుడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అంటాడు. అదా నీకి దేవుడా? లేక ఆయనకు దేవుడా? ఒక్క చాన్స్ ఇవ్వాలని అడుగుతున్న కాంగ్రెస్ పార్టీకి 75 ఏళ్లలో పదిసార్లు అవకాశం ఇస్తే అభివృద్ధి జరిగిందా?..' అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు ప్రశ్నించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో రూ.276 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు గురువారం ఆయన ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు.

పదిసార్లు గెలిపిస్తే సోయి లేదా?

'టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో ఒక్క చాన్స్ ఇవ్వండి అంటూ అడుక్కుంటున్నాడు. 75 ఏళ్లలో పదిసార్లు గెలిపిస్తే సోయి లేదా.. గుడ్డి గుర్రాల పళ్లు తోమారా?.. ఇవ్వాళ మళ్లీ మొరుగుతున్నారు. కాంగ్రెస్ హయాంలో అర్ధరాత్రి కరెంట్,

మిగతా 7వ పేజీలో ▶

విషమంగానే ప్రీతి ఆరోగ్యం

నిమ్స్‌లో ఎక్మోపై చికిత్స అందిస్తున్న వైద్యులు

- పోలీసుల అదుపులో డాక్టర్ సైఫ్!
- ప్రీతి, సైఫ్ సెల్‌ఫోన్‌ల సీజ్.. కాల్‌డేటా ఆధారంగా విచారణ

సాక్షి ప్రతినిధి, వరంగల్/హైదరాబాద్: వరంగల్ ఎంజీఎంలో ఆత్మహత్యకు యత్నించిన పీజీ వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. అంతర్గత అవయవాలు ఫెయిలైన స్థితిలో ఆమెను నిమ్స్‌కు తెచ్చారని, గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపరిచేందుకు ఎక్మో, సీఆర్ఆర్టీలతో ప్రయత్నం మిగతా 7వ పేజీలో ▶


ప్రీతి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న గవర్నర్ తమిళిసై

విద్యార్థులూ... ఆత్మహత్యలు వద్దు: గవర్నర్ - 7లో


గురువారం విజయవాడలో 'ఈనాడు' ప్రతులను దహనం చేస్తున్న ప్రజలు

కట్టుకథలు రాస్తున్న ఈనాడుపై జనాగ్రహం

- రాష్ట్ర వ్యాప్తంగా 'ఈనాడు' ప్రతులు దహనం.. ఉవ్వెత్తున ఎగిసిన నిరసనలు
- పట్టాభిని కొట్టారంటూ పాత ఫొటోలతో తప్పుడు కథనం.. సోషల్ మీడియాలో బట్టబయలు కావడంతో లోపలి పేజీలో సవరణ
- రామోజీ తీరుపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల మండిపాటు.. ఈ పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికని నినాదాలు
- చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతో దిగజారిన పాత్రికేయం.. చంద్రబాబు మేలే లక్ష్యంగా రామోజీరావు కుట్ర సిద్ధాంతం

12 లో

క్షమాపణ చెప్పాల్సిందే



- బహిరంగ క్షమాపణ కోరకుంటే నేరపూరిత పరువు నష్టం దావా వేస్తాం
- పట్టాభి ఘటనపై రామోజీకి మంత్రి అంబటి అల్టిమేటం
- నేటి సాయంత్రం వరకు గడువు ఇస్తున్నాం

- వివరాలు 12లో▶

'ధరణి' దంగల్!

భూసమస్యల పరిష్కార ఉత్తర్వుల విషయంలో తహసీల్దార్లలో ఆందోళన

- ఎలాంటి సంతకాలు, ప్రొసీడింగ్స్ లేకుండానే భూములపై నిర్ణయాలు తీసుకుంటున్న కలెక్టర్లు
- విచారణ నివేదికలు పంపడానికి మాత్రమే తహసీల్దార్లు పరిమితం
- సుమారు 20శాతం దరఖాస్తులపై తహసీల్దార్ల అభిప్రాయాలకు భిన్నంగా కలెక్టర్ల నిర్ణయాలు
- ఈ నిర్ణయాల ఉత్తర్వులపై డిజిటల్ సంతకాలు మాత్రం తహసీల్దార్లవే... భవిష్యత్తులో ఏదైనా సమస్య వస్తే తమ ఉద్యోగాలకు ముప్పు అనే ఆందోళన
- ధరణి దరఖాస్తుల క్లియరెన్స్‌లపై కలెక్టర్ల సంతకాలే ఉండాలని డిమాండ్... దీనిపై హైకోర్టును ఆశ్రయించే ఆలోచనలో తహసీల్దార్లు.. ఆందోళన చేసేందుకూ సిద్ధం!

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ కారణంగా రాష్ట్రంలోని రెవెన్యూ యంత్రాంగం, కలెక్టర్ల మధ్య 'కోల్డ్ వార్'నడుస్తోంది. పోర్టల్ అందుబాటులో వచ్చినప్పటి నుంచి భూసమస్యల తుది పరిష్కార అధికారాన్ని ప్రభుత్వం కలెక్టర్లకు కట్టబెట్టినా.. సదరు పరిష్కార ఉత్తర్వులను మాత్రం తహసీల్దార్ల డిజిటల్ సంతకాలతో జారీ చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్లు విచక్షణ మేరకు తీసుకునే నిర్ణయాలకు తమ డిజిటల్ సంతకాలు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా ఇబ్బంది తలెత్తితే తాము బాధ్యులం కావాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని రెవెన్యూ సంఘాలు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రంగారెడ్డి, హైదరాబాద్, మిగతా 7వ పేజీలో ▶



ఇది మీ అంతరాత్మను కదిలించలేదా?

వీధి కుక్కల దాడితో బాలుడి మృతిపై అధికారులను ప్రశ్నించిన హైకోర్టు

సుమోటోగా విచారణ.. ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని అధికారులకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ''నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి చంపాయి. అధికారులు ఏం చేస్తున్నారు? ఇది మీ అంతరాత్మలను కదిలించలేదా? ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వీధి కుక్కల నియంత్రణకు మీ వద్ద ఏదైనా ప్రణాళిక ఉందా?'' అని జీహెచ్ఎంసీ అధికారులను హైకోర్టు నిలదీసింది. ఈ ఘటనకు సంబంధించి బాలుడి తల్లిదండ్రులు పరిహారం పొందేందుకు అర్హులేనని స్పష్టం చేసింది. అధికారులు తీసుకున్న చర్యలేమిటో కోర్టుకు తెలియజేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 16కు వాయిదా వేసింది.

సుమోటోగా విచారణ

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలానికి చెందిన గంగాధర్ హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఓ కారు సర్వీసింగ్ సెంటర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం గంగాధర్‌తోపాటు సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లిన నాలుగేళ్ల కుమారుడు ప్రదీప్‌పై వీధికుక్కలు దాడి చేయడంతో మృతి చెందాడు. ఈ ఘటనపై ఓ పత్రికలో ప్రచురితమైన వార్తను హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం గురువారం దీనిపై విచారణ నిర్వహించింది. బాలుడి మరణం దురదృష్టకరమని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ కోర్టుకు చెప్పారు. ఈ సందర్భంగా వీధికుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటో తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఇలాంటివి మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది.

వీధి కుక్కలన్నింటికీ 'స్టెరిలైజేషన్'

పట్టణాల్లో వాటి బెడద నివారణకు సర్కారు యాక్షన్ ప్లాన్

- కుక్కలను పట్టుకునే బృందాలు, వాహనాల సంఖ్య పెంపు... ఈ విషయంలో వచ్చే ఫిర్యాదులపై తప్పనిసరిగా స్పందించేలా చర్యలు
- వీధి కుక్కల విషయంలో జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన... జీహెచ్ఎంసీ సహా 142 పురపాలికల్లో అమలుకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో వీధికుక్కల నియంత్రణ కోసం పకడ్బందీ కార్యాచరణ చేపట్టాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో వీధి కుక్కల దాడిలో చిన్నారి ప్రాణం కోల్పోయిన ఘటన కలకలం రేపడం, దీనితోపాటు రాష్ట్రవ్యాప్తంగా కుక్కకాటు ఘటనలు జరుగుతుండటంతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ రాష్ట్రవ్యాప్తంగా మిగతా 16వ పేజీలో ▶

నేడు ఎంసెట్ నోటిఫికేషన్

ప్రొఫెసర్ లింబాద్రి

సాక్షి, హైదరాబాద్: ఎంసెట్ నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేస్తున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి గురువారం వెల్లడించారు. దరఖాస్తు చేసేందుకు అవసరమైన అన్ని వివరాలు, ఎంసెట్ నిబంధనావళిని ఇందులో పేర్కొంటామని చెప్పారు. ఎంసెట్ తేదీలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇప్పటికే ప్రకటించినట్టు ఆయన గుర్తు చేశారు. మే 7 నుంచి మొదలయ్యే ఎంసెట్‌లో ఈసారి ఇంటర్ వెయిటేజ్ ఉండబోదని, ఇందుకు సంబంధించిన ప్రభుత్వ జీవో వెలువడాల్సి ఉందన్నారు. ఈసారి ఎంసెట్‌ను జేఎన్‌టీయూహెచ్ నిర్వహిస్తోందని ఆయన వెల్లడించారు. వీలైనంత వరకు విద్యార్థులకు అనువైన కేంద్రాల్లో పరీక్ష రాసేందుకు వీలు కల్పిస్తామని, నోటిఫికేషన్ వెలువడిన వెంటనే సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని లింబాద్రి సూచించారు. రాష్ట్రంలో ఎంసెట్ రాసేవారి సంఖ్య పెరుగుతోందని ఆయన తెలిపారు.

క్లుప్తంగా...

పొత్తుల కోసం వెంపర్లాడం



కరీంనగర్: కమ్యూనిజం అజేయమైందని, వందేళ్లుగా పేద ప్రజల పక్షాన పోరాడుతున్న ఎర్ర జెండాకు పదవులు, అధికారం ఓ లెక్క కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిస్టులను విమర్శించే నైతిక అర్హత ఏ పార్టీకీ లేదని పేర్కొన్నారు. గురువారం కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా సీపీఐ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో పరస్పర అవగాహన, మిత్ర లాభం ఉంటేనే కలసి పోటీ చేస్తామని, పొత్తుల కోసం వెంపర్లాడేది లేదని, అవసరమైతే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలసి పోటీ చేస్తాయని స్పష్టం చేశారు. తాము గెలవకున్నా గెలుపోటములను ప్రభావితం చేసే శక్తి కమ్యూనిస్టులకు ఉందన్న విషయాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు. పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన వారు కమ్యూనిస్టులైతే, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే రాబందుల పార్టీ బీజేపీ అని విమర్శించారు. కమ్యూనిజానికి కాలం చెల్లిందని విమర్శలు చేస్తున్నవారు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ పాల్గొన్నారు.

తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారు



కామారెడ్డి రూరల్/రామారెడ్డి: దేశంలో అత్యధికంగా మద్యం తాగే రాష్ట్రం తెలంగాణ అని.. గ్రామగ్రామాన బెల్టు షాపులు ఏర్పాటు చేసి తాగుబోతుల తెలంగాణగా మార్చారని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. గురువారం కామారెడ్డి జిల్లాలో పర్యటించిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసనసభలో ప్రజా సమస్యలను చర్చిద్దామంటే ప్రభుత్వం మైకును కట్ చేసి తమ గొంతు నొక్కుతోందన్నారు. తెలంగాణ వస్తే విదేశాలకు వలసలు ఆగుతాయని ఉద్యమ సమయంలో కేసీఆర్ చెప్పారని, అయితే అధికారంలోకి వచ్చాక గల్ఫ్ వలసలను ఆపలేకపోయారన్నారు.

బీఆర్ఎస్‌కు శ్రావణి రాజీనామా



జగిత్యాల: 'నాకు పదవులకన్నా ఆత్మాభిమానమే ముఖ్యం.. అందుకే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నా.. మున్సిపల్ కౌన్సిలర్ పదవినీ త్యజిస్తున్నా' అని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి వెల్లడించారు. కొందరి స్వార్థపూరిత కుట్రలకు బలయ్యాయనని ఆవేదన చెందారు. గురువారం ఆమె జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే తీరుతో విసిగి వేసారి గతనెల 25న చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశానని చెప్పిన శ్రావణి.. తాను నమ్మిన పార్టీ నుంచి ఇప్పటికీ ఓదార్పు లేదని, భరోసా కలిగించలేదని విచారం వ్యక్తంచేశారు. అందుకే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, కౌన్సిలర్ పదవికీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 27మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని కోరుతూ గతనెల 23న ఎమ్మెల్యే సంజయ్‌కు ఒక లేఖ ఇచ్చారని, అందుకు ప్రతిగా ముందుగానే తాను చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు.

పొత్తుపై చర్చించలేదు

సాక్షి, మహబూబాబాద్: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో సీపీఎం పొత్తు విషయమై ఇప్పటి వరకు ఎలాంటి చర్చ జరగలేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. చర్చల తరువాత నిర్ణయం ప్రకటిస్తామని ఆయన చెప్పారు. మహబూబాబాద్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మతతత్వ బీజేపీని గద్దె దింపడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

రేవంత్‌పై దావా వేస్తా

మణుగూరు టౌన్: పినపాక నియోజకవర్గంలో ఇటీవల పర్యటించిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తనపై చేసిన తప్పుడు ఆరోపణలపై పరువు నష్టం దావా వేయనున్నట్లు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు వెల్లడించారు. నియోజకవర్గవ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్లలో పార్టీ కార్యకర్తలు రేవంత్‌పై ఫిర్యాదు చేయనున్నారని తెలిపారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో కాంగ్రెస్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తనను.. ప్రజలు 2018లోనూ భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. అనంతరం రాజ్యాంగబద్ధంగా టీఆర్ఎస్‌లో విలీనమయ్యానే తప్ప ఎవరికీ అమ్ముడుపోలేదన్నారు.

వైఎస్సార్‌టీపీ పరిశీలకులు

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌టీపీ వివిధ జిల్లాలకు పరిశీలకులను నియమించింది. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు గట్టు రామచంద్రరావు, నల్లగొండ, కరీంనగర్ జిల్లాలకు గడిపల్లి కవిత, హైదరాబాద్ జిల్లాకు తూడి దేవేందర్ రెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు పిట్ట రాంరెడ్డి, మెదక్ జిల్లాకు బెజ్జంకి అనిల్‌కుమార్, మహబూబ్‌నగర్ జిల్లాకు బీరెల్లి శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తూ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు.

వాటి జోలికెళ్తే.. ఐదేళ్లు జైలుకే..!

- చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు, ఫొటోల పోస్టింగ్, షేరింగ్‌తోపాటు చూడటమూ నేరమే
- దీనిపై ప్రపంచవ్యాప్తంగా నిషేధం.. వెబ్‌పై కన్నేసి ఉంచుతున్న ఎన్‌సీఎంఈసీ
- ఆధునిక సాఫ్ట్‌వేర్లతో నిందితులను గుర్తిస్తున్న బృందాలు
- ఎన్‌సీఆర్‌బీ సమన్వయంతో కేసులకు సిఫార్సులు
- కఠిన చర్యలు తీసుకుంటున్న స్థానిక సైబర్ క్రైమ్ పోలీసులు
- కోవిడ్ తర్వాతి పరిణామాల్లో భారీగా పెరిగిన పోర్నోగ్రఫీ కేసులు



సాక్షి, హైదరాబాద్: చిన్నారులపై లైంగిక దాడులు జరగడానికి, పెరగడానికి దారితీస్తున్న చైల్డ్ పోర్నోగ్రఫీ జోలికి వెళ్తే జైలుకు వెళ్లడం ఖాయం. చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించి వీడియోలు, ఫొటోలను పోస్టు చేసినా, షేర్ చేసినా, చివరికి వీక్షించినా కూడా నేరమే. ఐదేళ్ల పాటు ఊచలు లెక్కబెట్టాల్సిందే. ఇంటర్‌నెట్‌తోపాటు సోషల్ మీడియాలో చైల్డ్ పోర్నోగ్రఫీపై కన్నేసి ఉంచడానికి 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ (ఎన్‌సీఎంఈసీ)' పనిచేస్తోంది. పిల్లలపై లైంగిక నేరాలకు సంబంధించి వీడియోలు, ఫొటోల (చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్– సీఎస్ఏఎం)ను, వాటి గురించి సెర్చ్ చేస్తున్నవారు, వీక్షిస్తున్నవారిని కనిపెట్టడానికి అత్యాధునిక సాఫ్ట్‌వేర్స్ వినియోగిస్తోంది. వారు గుర్తించిన వివరాల ఆధారంగానే గత వారం హైదరాబాద్‌లో ఐదుగురిపై కేసులు నమోదయ్యాయి. మైనర్లకు సంబంధించిన అసభ్య, అశ్లీల చిత్రాలన్నీ చైల్డ్ పోర్నోగ్రఫీ కిందికి వస్తాయి. వీటికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు, సాహిత్యం తదితరాలను సీఎస్ఏఎంగా పరిగణిస్తారు.

ఎన్‌సీఎంఈసీ ఆధ్వర్యంలో..

అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ 1984 జూన్ 13న ఎన్‌సీఎంఈసీ ఏర్పాటు చేసింది. వర్జీనియాలోని అలెగ్జాండ్రియాలో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ స్వచ్ఛంద సంస్థ.. ప్రపంచవ్యాప్తంగా తమ కార్యకలాపాలను విస్తరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రపంచవ్యాప్తంగా నిషేధించిన తర్వాత ఎన్‌సీఎంఈసీ చర్యలు ముమ్మరమయ్యాయి. ఆన్‌లైన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ వేగంగా పెరుగుతోందని ఎన్‌సీఎంఈసీ గుర్తించింది. ఒక్క భారతదేశంలోనే ప్రతి 40 సెకన్లకు ఈ తరహా వీడియో ఒకటి క్యాప్చర్ అవుతోందని అంచనా వేసింది. జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం.. 2021లో భారత్ నుంచే 25 వేలకుపైగా చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలు, చిత్రాలు ఇంటర్‌నెట్‌లో అప్‌లోడ్ అయ్యాయి.

ఆధునిక టెక్నాలజీతో పటిష్ట నిఘా..

చైల్డ్ పోర్నోగ్రఫీ కంటెంట్‌ను గుర్తించడానికి ఎన్‌సీఎంఈసీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లు వాడుతూ ఆయా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ కంటెంట్‌ను, సెర్చింగ్‌ను గుర్తించడానికి కొన్ని కీవర్డ్స్‌ను రూపొందించింది. ఫలితంగా ప్రపంచంలో ఎవరైనా ఇంటర్‌నెట్‌లో, సోషల్ మీడియాలో చైల్డ్ పోర్నోగ్రఫీ కంటెంట్ గురించి సెర్చ్ చేసినా, వీక్షించినా, డౌన్‌లోడ్ చేసినా, అప్‌లోడ్ చేసినా.. వారు వినియోగించిన కంప్యూటర్/ల్యాప్‌టాప్/ఫోన్‌ల ఐపీ అడ్రస్‌లను సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. ఈ వివరాలను ఎన్‌సీఎంఈసీ క్రోడీకరించి ఆయా దేశాలకు చెందిన నోడల్ ఏజెన్సీలకు అందిస్తుంది. మనదేశంలో జాతీయస్థాయిలో హోంశాఖ అధీనంలోని ఎన్‌సీఆర్‌బీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. దీనికి అందిన వివరాలను రాష్ట్ర స్థాయి దర్యాప్తు సంస్థలకు పంపిస్తుంది. రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులు ఈ వివరాలను సంబంధిత బాధ్యులు నివసించే ప్రాంత సైబర్ క్రైమ్ పోలీసులకు పంపిస్తారు. వారు కేసులు నమోదు చేసి, ఐపీ అడ్రస్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి.. అరెస్టు చేయడం/ నోటీసులివ్వడం వంటి చర్యలు చేపడతారు.

స్మార్ట్‌ఫోన్లతో పెరిగి.. కోవిడ్‌తో విజృంభించి..

విస్తృతమైన ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి పోర్న్ సైట్లను చూసే అవకాశం పెరగడంతో చాలా మంది బానిసగా మారుతున్నారు. కోవిడ్ లాక్‌డౌన్, ఆ తర్వాతి సమయంలో ఈ ధోరణి మరింత పెరిగిందని నిపుణులు చెప్తున్నారు. చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించి దేశంలో 2018లో 44 కేసులు, 2019లో 103 కేసులు నమోదుకాగా.. 2020 నాటికి ఈ సంఖ్య 738కి, 2021లో 969కి పెరగడం గమనార్హం. జరుగుతున్న ఉదంతాల్లో కనీసం ఒక శాతం కూడా పోలీసు రికార్డుల్లోకి ఎక్కి కేసులుగా మారట్లేదని నిపుణులు పేర్కొంటున్నారు.



విదేశాల్లో సర్వర్ల కారణంగా..

అశ్లీల వెబ్‌సైట్లపై ఫిర్యాదులు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం వాటిని నిషేధించి బ్లాక్ చేయిస్తోంది. కానీ వాటి నిర్వాహకులు వెబ్‌సైట్ పేరులో స్వల్ప మార్పులు చేసి మరో వెబ్‌సైట్‌గా అందుబాటులోకి తెస్తున్నారు. వాటిపై ఫిర్యాదులు వచ్చి చర్యలు తీసుకునేవరకు ఇంటర్‌నెట్‌లో ఉంటున్నాయి. ఈ తరహా వెబ్‌సైట్లను హోస్ట్ చేస్తున్న సర్వర్లన్నీ విదేశాల్లో ఉన్నవే. వాటిపై ఫిర్యాదులు వచ్చినా నిర్వాహకుల వివరాలు తెలుసుకోవడానికి, చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండటం లేదు.

బాగా చదువుకున్న వారూ నిందితుల్లో..

చైల్డ్ పోర్నోగ్రఫీ ఆరోపణలపై గత ఏడాది హైదరాబాద్‌లో 23 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరిలో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ఉన్నారు. పోలీసులు నిందితులతోపాటు కుటుంబ సభ్యులకూ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక ఈ కేసుల్లో ఇటీవల నోటీసులు అందుకున్న వారిలో వ్యాపారులు, చిరుద్యోగులు కూడా ఉన్నారు.

అన్ని రకాలా నష్టం

పోర్నోగ్రఫీకి బానిస అవుతున్నవారు అన్నిరకాలా నష్టపోతున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. ఇంటర్‌నెట్‌లో ఉండే పోర్న్ మెటీరియల్‌తో పాటే వైరస్‌లు ఉంటాయని.. ఆయా వెబ్‌సైట్ల ద్వారా వైరస్‌లను పంపే హ్యాకర్లు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను హ్యాక్ చేసి తమ ఆధీనంలోకి తీసుకుంటారని వివరిస్తున్నారు. ఇలా వ్యక్తిగత సమాచారం, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్‌కార్డులు, ఇతర వివరాలూ హ్యాకర్లకు చేరి నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

నేరం నిరూపితమైతే ఐదేళ్ల జైలు

చైల్డ్ పోర్నోగ్రఫీ అత్యంత హేయమైన నేరం. దీన్ని ప్రపంచవ్యాప్తంగా నిషేధించారు. దీని కోసం ఎవరు సెర్చ్ చేసినా, వీడియోలు, ఫొటోలను చూసినా నేరమే. దీన్ని బ్రౌజ్ చేసిన వారి సమాచారం ఎప్పటికప్పుడు మాకు అందుతుంది. వారిపై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్‌లోని 67–బీ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తాం. ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ వేస్తాం. కోర్టులో నేరం నిరూపితమైతే మొదటిసారి నేరం చేసిన వారికి గరిష్టంగా ఐదేళ్లు, రెండోసారి అయితే ఏడేళ్ల వరకు శిక్ష పడుతుంది. ఒకవేళ బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే.. పోక్సో యాక్ట్ కింద కూడా కేసులు నమోదవుతాయి. దోషిగా తేలితే జీవిత ఖైదు పడే ఆస్కారం ఉంది.

–గజరావ్ భూపాల్, సంయుక్త పోలీసు కమిషనర్, సీసీఎస్, హైదరాబాద్



జీవశాస్త్రాలకు నైపుణ్యపు రెక్కలు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవహరిస్తోంది. ప్రముఖ సంస్థ 'ఆపిల్' తొలిసారిగా బయో ఆసియా సదస్సులో పాల్గొంటోంది. నోవార్టిస్ సీఈఓ వాస్ నరసింహన్ కీలకోపన్యాసం చేస్తారు. ప్లీనరీ టాక్‌లో యూకేకి చెందిన డా.రిచర్డ్ హాచెట్ ప్రసంగిస్తారు. లైఫ్ సైన్సెస్ రంగంలో యువతకు నైపుణ్య శిక్షణ, మౌలిక వసతుల కల్పన, ఫార్మా సిటీలో లైఫ్ సైన్సెస్ వర్సిటీ ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశముంది.

5 ఆవిష్కరణలు వివరించనున్న స్టార్టప్‌లు

జీవ శాస్త్ర (లైఫ్ సైన్సెస్) రంగం విలువ, ఉద్యోగాల సంఖ్యను వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బయో ఆసియా సదస్సును నిర్వహిస్తోంది. 2021 నాటికి హైదరాబాద్ సహా తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగంలో పనిచేస్తున్న కంపెనీల నికర విలువ రూ.50 బిలియన్ డాలర్లు కాగా.. 2028 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ రంగంలో ప్రస్తుతం 4 లక్షలుగా ఉన్న ఉద్యోగుల సంఖ్యను వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేసి 8 లక్షలకు చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కాగా ఈ సదస్సులో బయోటెక్, లైఫ్‌సైన్సెస్ విభాగంలో స్టార్టప్‌లకు పోటీలు నిర్వహిస్తున్నారు. సుమారు 400 స్టార్టప్‌లు బయో ఆసియాలో తమ ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు దరఖాస్తు చేసుకోగా ఇందులో 75 స్టార్టప్‌లను ఎంపిక చేశారు. వీటి నుంచి ఐదింటిని ఎంపిక చేసి నగదు పురస్కారం ఇవ్వడంతో పాటు వాటి ఆవిష్కరణలను వివరించేందుకు అవకాశం ఇస్తారు.

ఇప్పటివరకు 25 వేల కోట్ల పెట్టుబడులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 19 ఏళ్ల క్రితం ప్రారంభమైన బయో ఆసియా సదస్సు రాష్ట్ర విభజన తర్వాత కూడా కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో జరిగిన బయో ఆసియా సదస్సుల్లో సత్య నాదెళ్ల వంటి ప్రముఖ కంపెనీల సీఈఓలు, శాస్త్రవేత్తలు, నోబెల్ గ్రహీతలు ప్రసంగించగా, 20 వేలకు పైగా భాగస్వామ్య సమావేశాలు జరిగాయి. 250కి పైగా ద్వైపాక్షిక ఒప్పందాలు కుదరగా, రూ.25 వేల కోట్ల పెట్టుబడులు లైఫ్ సైన్సెస్, అనుబంధ రంగాల్లోకి వచ్చాయి. 20వ సదస్సులోనూ ప్రాధాన్యత కలిగిన ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరే అవకాశముందని భావిస్తున్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ దూరం

సాక్షి, హైదరాబాద్

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీకి బీజేపీ మొగ్గు చూపలేదు. గురువారం నామినేషన్ల దాఖలుకు చివరిరోజు అయినప్పటికీ.. పోటీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సంఖ్యాపరంగా తగిన బలం లేనందున ఓటమి తప్పనిసరి కావడంతో.. పోటీచేసి ఓడిపోయామనే భావన రాకూడదనే తప్పుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుత బీజేపీ కార్పొరేటర్ల నుంచే ఒకరిని బీజేపీ అభ్యర్థిగా నిలపాలని చివరిదాకా ప్రయత్నాలు జరిగాయి. ఈ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఎంఐఎం అభ్యర్థికి మద్దతుగా అధికార బీఆర్ఎస్ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో.. పోటీ చేయకపోతే ఏకగ్రీవం కానున్నందున దానికి అవకాశం ఇవ్వొద్దనే అభిప్రాయం తొలుత వ్యక్తమైంది. ఈ ఎమ్మెల్సీ స్థానం నుంచి గెలిచేంత బలం బీజేపీకి లేకపోయినా ఏకగ్రీవం కాకూడదనే ఉద్దేశంతో పోటీ చేయాలని భావించినా చివరకు అది ఫలించలేదు. నగరానికి చెందిన పార్టీ ముఖ్యనేతలు దీనికి మొగ్గు చూపకపోవడంతో రాష్ట్ర నాయకత్వం కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయింది.

ఐదేళ్లలో రెట్టింపు పురోగతి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్

జీవ సాంకేతికత, జీవ శాస్త్ర (లైఫ్ సైన్స్)రంగాల్లో హైదరాబాద్ బలీయంగా ఎదుగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. 2028 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో రెట్టింపు పురోగతి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. జీవ శాస్త్ర రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రముఖ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచంలోని ప్రముఖ ఔషధ కంపెనీల్లో ఒకటైన బీఎంఎస్ (బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్), రాష్ట్ర ప్రభుత్వం మధ్య గురువారం మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా బీఎంఎస్ రాష్ట్రంలో వంద మిలియన్ డాలర్లు (రూ.825 కోట్లు) పెట్టుబడిగా పెట్టడంతో పాటు వచ్చే మూడేళ్లలో 1,500 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. ఔషధ అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఒప్పందం కుదిరిన సందర్భంగా మంత్రి మాట్లాడారు.



ఎంవోయూ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్, జయేష్ రంజన్, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ సంస్థ ప్రతినిధులు తదితరులు

యువతకు గొప్ప అవకాశం

లైఫ్ సైన్సెస్ రంగంలో ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ యువతకు ప్రస్తుత ఒప్పందం గొప్ప అవకాశమని కేటీఆర్ చెప్పారు. బయో టెక్నాలజీ, ఐటీ రంగాలకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో ప్రతిభా పాటవాలు కలిగిన యువ టాలెంట్ పూల్ అందుబాటులో ఉందన్నారు. హైదరాబాద్ ఫార్మా సిటీలో పెట్టుబడులకున్న అవకాశాలను వివరిస్తూ తెలంగాణలో ఔషధ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని బీఎంఎస్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఇలావుండగా తమ కంపెనీ ఔషధ, జీవ సాంకేతికత, వైద్య రంగాల్లో సేవలతో పాటు పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుందని బీఎంఎస్ అంతర్జాతీయ ఔషధ అభివృద్ధి విభాగం ఎండీ సమ్మిత్ హిరావత్ తెలిపారు.



నాంపల్లి బీజేపీ కార్యాలయంలో బూత్ స్వశక్తీకరణ్ అభియాన్ వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్, చిత్రంలో తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, ఇంద్రసేనా రెడ్డి, విజయశాంతి తదితరులు

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే..

- బీజేపీకి అభ్యర్థులే లేరనేది కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల దుష్ప్రచారమే
- బూత్ సశక్తీరణ్ అభియాన్ వర్క్‌షాప్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని ప్రజలు భావిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఇందులో భాగంగానే పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టామని, సంస్థాగత నిర్మాణంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కంటే బీజేపీ బలంగా ఉందన్నారు. రాష్ట్రంలో 34 వేల పోలింగ్‌బూత్ కమిటీలకుగాను తాము 80 శాతం పూర్తి చేసినా బీఆర్ఎస్, కాంగ్రెస్ కావాలనే బీజేపీకి అభ్యర్థుల్లేరని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను వ్యతిరేకిస్తున్న ప్రజలు గత రెండు ఉపఎన్నికలు, స్థానిక ఎన్నికల్లో గెలిపించి బీజేపీనే ప్రత్యామ్నాయమని తేల్చి చెప్పారన్నా రు. గురువారం ఇక్కడ జరిగిన 'బూత్ సశక్తీకరణ్ అభియాన్'వర్క్‌షాప్‌లో సంజయ్ మాట్లాడుతూ బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉన్నందునే 18 రాష్ట్రాల్లో అధికారంలో ఉందని, కేంద్రంలో మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లతో పార్టీకి మంచి వాతావరణం ఏర్పడిందని, ప్రజల నుంచి స్పందన బాగా వస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచాక ఉచిత విద్య, వైద్యం, అందరికీ ఇళ్లు, రైతులకు ఫసల్ బీమాను అమలు చేస్తామని చెబుతున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడంలేదో సమాధానం చెప్పలేక సెంటిమెంట్ రగిలించేందుకు ప్రధాని మోదీ, బీజేపీ నేతలపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు.

28 వరకు 'స్ట్రీట్ కార్నర్లు'పొడిగింపు: బన్సల్

ఈ నెల 28 వరకు 'ప్రజాగోస– బీజేపీ భరోసా' స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్‌ను పొడిగించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 వరకు 11 వేల మీటింగ్స్ జరపాల్సి ఉండగా, ఆరు వేలే కావడంతో నాయకుల విజ్ఞప్తిపై మూడురోజుల పొడిగింపునకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్‌బన్సల్ అంగీకరించారు. అయితే 28న వీటి ముగింపునకు సూచికగా 119 నియోజకవర్గాల్లో ఒక్కోచోట 5 వేలకు తగ్గకుండా ప్రజలతో బహిరంగసభలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇంతవరకు సాగిన 'స్ట్రీట్ కార్నర్ మీటింగ్'లు జరిగిన తీరుపట్ల సంజయ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్ సంతృప్తి వ్యక్తం చేశారు. తక్కువ మందితో జరిగిన చోట మళ్లీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలని నిర్ణయించినట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి మీడియాకు తెలిపారు. 28న కార్నర్ మీటింగ్ ముగింపు సభలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్, పార్టీనేతలు ఇంద్రసేనారెడ్డి, మురళీధర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, విజయశాంతి, ఏపీ జితేందర్ రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, జి.ప్రేమేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికల దాకా సంజయే: తరుణ్‌చుగ్

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది సంస్థాగత ఎన్నికలు జరిగే దాకా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ కొనసాగుతారని ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్ వెల్లడించారు. గురువారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ 2024లో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాల్లో 'ప్రజాగోస– బీజేపీ భరోసా'పేరిట నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఈ మీటింగ్‌ల ద్వారా కేసీఆర్ సర్కార్‌కు చివరి మేకు దించేందుకు బీజేపీ సిద్ధమవుతోందన్నారు. వచ్చే నెల 11వ తేదీ నాటికి సంజయ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తవుతుండటంతో ఆయన పదవీకాలం ముగియనుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 2024 జూన్ వరకు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డాను కొనసాగిస్తూ జాతీయ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది చివర్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సంజయ్ పదవీకాలాన్ని పొడిగిస్తారనే చర్చ కొంతకాలంగా సాగుతున్న విషయం తెలిసిందే. వచ్చేనెల మొదటివారంలో అధ్యక్షుడిగా సంజయ్ పదవీకాలం పొడిగింపునకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల సమాచారం.

అంతిమ విజయం మాదే: పీఆర్‌టీయూ

- గుర్రం చెన్నకేశవరెడ్డి ఆత్మీయ సభలో నేతలు
- టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి చెన్నకేశవరెడ్డి నామినేషన్



నామినేషన్ వేస్తున్న చెన్నకేశవరెడ్డి

సాక్షి, హైదరాబాద్: అతి పెద్ద ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూటీఎస్ సహా తెలంగాణ టీచర్స్ జేఏసీ బలపరుస్తున్న అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి మద్దతుగా వివిధ ప్రాంతాల టీచర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పీఆర్‌టీయూ నేతృత్వంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ నుంచి జరిగిన ర్యాలీలో అభ్యర్థి విజయాన్ని ఆకాంక్షిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ర్యాలీతో ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ కొద్దిసేపు నిలిచిపోయింది. అంతకు ముందు జరిగిన ఆత్మీయ సభలో టీటీజేఏసీ చైర్మన్ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఎన్నిక ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి పరీక్ష అని, కార్పొరేట్ శక్తులతో జరిగే పోరాటమని తెలిపారు. స్కూళ్లు, కాలేజీల్లో పనిచేసే అధ్యాపక వర్గం సమస్యల పరిష్కారంలో అర్ధరాత్రయినా స్పందించే తత్వం పీఆర్‌టీయూటీఎస్‌కే సొంతమని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు అన్నారు. టీచర్ల బాధలు ఆలకించే బాధ్యతను ఏనాడూ విస్మరించని పీఆర్‌టీయూటీఎస్ బలపరిచిన చెన్నకేశవరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, అధ్యాపక సంఘ నేతలు రాఘవరెడ్డి, విద్యాసాగర్, కనకచంద్రం, జగదీశ్, దయాకర్, కుత్బుద్దీన్, దిలీప్ రెడ్డి, రిషికేశ్ కుమార్, స్వరూప, మాలతి, ఫాతిమా, శ్రీనివాస్, ఫారూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ, లెక్చరర్స్, కాంట్రాక్ట్ లెక్చరర్స్, ఎయిడెడ్, మోడల్ స్కూళ్లు, కె.జి.బి.వి., సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, గురుకుల పాఠశాలలకు సంబంధించిన 29 సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ అభ్యర్థికి మద్దతు తెలిపారు.

ముగిసిన నామినేషన్లు...





నామినేషన్లు వేస్తున్న ఏవీఎన్ రెడ్డి, మీర్జా రహ్మత్ బేగ్

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. గడువులోగా మొత్తం 21 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ఏవీఎన్ రెడ్డి (అయ్యలపు వెంకట నారాయణరెడ్డి) బీజేపీ తరఫున నామినేషన్‌వేయగా మిగతా వారంతా స్వతంత్రులుగానే నామినేషన్లు వేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రహ్మత్ బేగ్, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ రహీంఖాన్ నామినేషన్లు వేశారు. ఈ నెల 24న నామినేషన్ పత్రాల స్క్రూటినీ జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27 వరకు గడువుంది. మార్చి 13న ఎన్నికలు నిర్వహించి 16న ఫలితాలను ప్రకటిస్తారు.

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం మేమే: డీకే అరుణ

బీజేపీ అభ్యర్థి నామినేషన్ సమర్పణ అనంతరం ఆ పార్టీ నేతలు డీకే అరుణ, వివేక్ వెంకటస్వామి, మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ఈ ఎన్నికల్లో బీజేపీ బలపరుస్తున్న ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కాగా, హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎంఐఎం ఎమ్మెల్సీ అభ్యర్థి మీర్జా రహ్మత్‌బేగ్ మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి కృతజ్ఞతలు తెలిపారు.

మీలో ఎవరు మంచి పనులు చేస్తారో (మరెవరు చెడ్డపనులు చేస్తారో) పరీక్షించడానికి ఆయన జీవన్మరణాలు సృష్టించాడు. ఆయన మహా శక్తిమంతుడు, గొప్ప క్షమాశీలి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 24

ఈ యుద్ధం ఇంకెన్నాళ్లు?

పోరుగునున్న బలహీన దేశం ఉక్రెయిన్‌ను లొంగదీసుకునేందుకు రష్యా మొదలెట్టిన దురాక్రమణ యుద్ధం ఏడాదయ్యేసరికి మరింత జటిలంగా మారింది. నిరుడు ఫిబ్రవరి 24న రెండు లక్షలమంది సైన్యాన్ని ఉక్రెయిన్ వైపు నడిపించిన రష్యా ఇప్పుడు ఆ సంఖ్యను అయిదు లక్షలకు పెంచింది. ఏడాదైన సందర్భంగా ఉక్రెయిన్ నైతిక స్థైర్యాన్ని పెంచడానికంటూ ఆ గడ్డపై అడుగుపెట్టిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చేసిన ప్రసంగం, ఆ తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడిన తీరు చూస్తే ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతుందన్న అభిప్రాయం ఏర్పడుతోంది. నిజానికి ఇప్పటికే వైరి వర్గాల మోహరింపు మొదలైంది. ఏడాది క్రితం యుద్ధంలో ప్రధాన పాత్రధారులు రష్యా–ఉక్రెయిన్‌లే. ప్రస్తుతం అమెరికా మద్దతుతో యూరోప్ దేశాలు అందులో పీకల్లోతు కూరుకుపోయాయి. రష్యాకు మారణాయుధాలిస్తే ఖబడ్దార్ అంటూ అమెరికా చేసిన హెచ్చరికకు జవాబన్నట్టు చైనా కమ్యూనిస్టు పార్టీ విదేశాంగ విధాన నిపుణుడు వాంగ్ యీ బుధవారం మాస్కో సందర్శించి రష్యాతో తమ బంధం మరింత దృఢమవుతుందని ప్రకటించారు. పేరుకు చిన్న దేశమే అయినా అమెరికా పుణ్యమా అని ప్రస్తుతం ఉక్రెయిన్ దగ్గర మారణాయుధాలు, యుద్ధ ట్యాంకులు, గురిచూసి లక్ష్యాన్ని ఛేదించే బాంబులు, అత్యాధునిక యుద్ధ సామగ్రి, కోట్లాది డాలర్ల నిధులు పుష్కలంగా ఉన్నాయి. దేశం మరుభూమిగా మారినా రష్యాను చావుదెబ్బ తీయటంలో అవన్నీ ఉక్రెయిన్‌కు తోడ్పడుతున్నాయి.

నిజానికి అమెరికా మొదట్లో చాలానే ఆశించింది. రష్యాపై ప్రపంచవ్యాప్తంగా ఏహ్యభావం వస్తుందని, అది ఏకాకవుతుందని భావించింది. కానీ అలాంటి ఛాయలు కనబడటం లేదు. తమ దేశంపై 2001లో వేలాదిమంది మరణానికి కారణమైన సెప్టెంబర్ 11 ఉగ్రదాడి అనంతరం 'వాళ్లెందుకు మమ్మల్ని ద్వేషిస్తున్నార'ంటూ అల్‌ఖైదా ఉగ్రవాదుల గురించి ప్రశ్నించిన అమెరికా ఇప్పుడు ఆ ప్రశ్నను కాస్త తిరగేసి అడుగుతోంది. 'వాళ్లెందుకు ద్వేషించటం లేద'న్నది ఆ ప్రశ్న సారాంశం. ఇక్కడ 'వాళ్లు' అంటే రష్యన్లు. నిజమే, అమెరికా ఒత్తిడికి తలొగ్గి అయిష్టంగానైనా ఉక్రెయిన్‌కు మారణాయుధాలు అందజేస్తున్న యూరోప్ దేశాలు రష్యా నుంచి దిగుమతులు మాత్రం ఆపలేదు. తనకు సాగిలపడలేదన్న కక్షతో ఇరాన్‌పై గతంలో తీవ్ర ఆంక్షలు విధించి ఆ దేశాన్ని ఆర్థిక దిగ్బంధం చేసిన అమెరికా ఇప్పుడు రష్యాపై ఆ స్థాయిలో విరుచుకుపడటం లేదు. రష్యా చమురు, సహజ వాయువుల ఎగుమతిలో ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉండటం మాత్రమే కాదు... నికెల్, అల్యూమినియం, టైటానియం వంటి లోహాలూ, రసాయన వాయువులూ, సెమీ కండక్టర్లూ, గోధుమలూ, ఎరువుల ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉంది. కఠిన ఆంక్షలతో ఇవన్నీ ఆగిపోతాయన్న భయాందోళనలు అమెరికా, యూరోప్ దేశాల్లో ఉన్నాయి. ఇక ముడి చమురును రష్యా చాలా చవగ్గా మనకూ, చైనాకూ విక్రయిస్తోంది. మన దేశం అక్కడినుంచి రోజూ 12 లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఏడాదిక్రితంతో పోలిస్తే ఇది 33 రెట్లు ఎక్కువ. ఇలా అనేకానేక కారణాలవల్ల రష్యాపై ప్రపంచ దేశాల్లో ఏహ్యభావం లేదు. పైపెచ్చు ఉక్రెయిన్‌కు అత్యుత్సాహంతో అమెరికా, యూరోప్ దేశాలు మారణాయుధాలు అందిస్తున్న తీరువెనక వారికి వేరే ప్రయోజనాలున్నాయని ప్రపంచం విశ్వసిస్తోంది. అది పాశ్చాత్య దేశాల చేతిలో కీలుబొమ్మ అని రష్యా చేస్తున్న ప్రచారం నిజం కావొచ్చన్న అభిప్రాయం కలుగుతోంది. ఒక సర్వే ప్రకారం భారత్, చైనా, తుర్కియే దేశాల్లో అత్యధికులు రష్యాకు అనుకూలంగానే ఉన్నారని వెల్లడైంది. సోవియెట్ యూనియన్ ఉనికిలో ఉన్నప్పుడు దాన్ని అగ్రరాజ్యంగా, ప్రమాదకరమైన శక్తిగా భావించేవారు. ఇప్పుడు రష్యాపై ఆ ముద్ర లేదు.

ప్రచ్ఛన్న యుద్ధ దశ ముగిశాక అమెరికా, రష్యాల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగిన పర్యవసానంగా 2010లో అణ్వాయుధాల నియంత్రణ ఒప్పందం(స్టార్ట్) కుదిరింది. దాని కాలపరిమితి 2026 ఫిబ్రవరిలో ముగియబోతోంది. కొత్త ఒప్పందంపై మొదలైన చర్చలను నిలిపేస్తున్నట్టు ప్రకటించి పుతిన్ అందరినీ ఆందోళనలో పడేశారు. ఏ పక్షమూ మొదటగా అణ్వాయుధాలు ఉపయోగించకుండా నియంత్రించే ఆ ఒప్పందం ఒక్కటే రెండు దేశాల మధ్యా మిగిలింది. దాన్ని కాస్తా పునరుద్ధరించటానికి చర్యలు తీసుకోకపోతే ప్రపంచ మనుగడ ప్రమాదంలో పడుతుంది. ఇక రెండు దేశాలూ తమ అణ్వాయుధాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే వ్యవస్థేమీ మిగలదు. పుతిన్ మరో మాట కూడా అన్నారు. అమెరికా గనుక అణు పరీక్షలు మొదలుపెడితే తాము కూడా సర్వసన్నద్ధంగా ఉన్నామని ప్రకటించారు. యుద్ధం ఆగనంతకాలమూ ఇలా సవాళ్లు, ప్రతి సవాళ్లతో పరిస్థితి నానాటికీ దిగజారుతుంది. యూరోప్ భద్రత ప్రమాదంలో పడుతుంది. యుద్ధాన్ని విరమించి శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోమని మన దేశం ఇరుపక్షాలకూ చెబుతోంది. కానీ ముున్ముందు ఇలా మధ్యవర్తిత్వం వహించే అవకాశాలు కూడా ఉండవు. ఇప్పటికే 80 లక్షలమంది ఉక్రెయిన్ పౌరులు కొంపా గోడూ వదిలి వలసపోయారు. వేలాదిమంది మరణించారు. అనేకులు వికలాంగులయ్యారు. అటు రష్యా సైతం భారీగా నష్టపోయింది. బలహీన ఆర్థిక వ్యవస్థలున్న దేశాలు ఈ యుద్ధంతో సంక్షోభంలో పడ్డాయి. అందుకే మతిమాలిన ఈ యుద్ధాన్ని విరమించేలా రష్యాపై ప్రపంచం ఒత్తిడి తేవాలి. ఉక్రెయిన్‌కు సాయం పేరిట పరిస్థితి మరింత విషమించే చర్యలకు స్వస్తి పలకాలని అమెరికాను కోరాలి. యుద్ధంతో అంతిమంగా మిగిలేది విషాదమేనని గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.పంచమి తె.5.31 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి షష్ఠి, నక్షత్రం: రేవతి ఉ.8.24 వరకు, తదుపరి అశ్విని, వర్జ్యం: తె.4.10 నుండి 5.45 వరకు (తెల్లవారితే శనివారం), దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.32 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, అమృతఘడియలు: ఉ.6.02 నుండి 7.28 వరకు.

సూర్యోదయం : 6.27
సూర్యాస్తమయం: 6.00
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

పచ్చ పైత్యం ముదిరిపోయింది!

వివేకా హత్య కేసులో సీబీఐ పేరు చెబుతూ మరో దుర్మార్గపు వంటకం

చనిపోయిన మనిషి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం శ్మశానానికి తీసుకువెళ్తూ... ఏమో బతుకుతాడేమోననే దింపుడు కళ్లెం ఆశతో మధ్యలో పాడెను ఓసారి కిందకు దించి మరీ చూస్తారు!!. రాష్ట్రంలో రాజకీయంగా టీడీపీ అంతిమయాత్ర కొనసాగుతున్న తరుణంలో... ఎల్లో మీడియాలో ఇదే దింపుడు కళ్లెం ఆశ మిణుకు మిణుకుమంటోంది. అందుకే ఆ పార్టీని బతికించేందుకు రోజుకో రీతిలో రాజకీయ కుట్రకు తెరతీస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిత్యం విషం చిమ్ముతోంది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ వార్తలు, కథనాల పేరిట అభూతకల్పనలు, అవాస్తవాలను ప్రతిరోజూ అచ్చేస్తూ... పాత్రికేయ విలువలకు పాతరవేస్తోంది. సీబీఐ న్యాయస్థానంలో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ పేరిట ఈనాడు, దాని తోక మీడియా మరోసారి అదే పచ్చ పైత్యాన్ని ప్రదర్శించాయి. అసలు ఆ అఫిడవిట్‌లో ఏముందనే దానితో పని లేకుండా.... చంద్రబాబు పోసిన 'పచ్చ' సిరాను తమ పెన్నుల్లో నింపేసుకుని విచ్చలవిడి రాతలకు దిగాయి. 2019లో టీడీపీ ఘోర పరాజయం పాలవ్వగానే చంద్రబాబు బీజేపీలోకి పంపిన తన కోవర్టుల ద్వారా ఈ కేసు దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. అందుకే దర్యాప్తు దారితప్పిందన్నది సుస్పష్టం. తమకు అదే కావాలన్న రీతిలో అటు చంద్రబాబు ఇటు పచ్చ మీడియా వైఎస్సార్ కుటుంబంపై నిస్సిగ్గుగా బురద జల్లుతున్నాయి.



ఈనాడు ప్రచురించిన కథనం

సునీల్ యాదవ్‌పై విరుద్ధ వాదనలేల?

ఈ కేసులో నిందితుడు సునీల్ యాదవ్ కదలికలు అత్యంత కీలకమని సీబీఐ చెబుతోంది. ప్రధానంగా వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజున సునీల్‌యాదవ్ ఎక్కడెక్కడ తిరిగారన్నది దర్యాప్తులో తాము కనుగొన్న అతి ముఖ్యమైన విషయంగా పేర్కొంది. మరి అంత ముఖ్యమైన అంశంపై సీబీఐ 2021లో న్యాయస్థానానికి చెప్పిన మాటకు... ఇప్పుడు సీబీఐ కోర్టుకు చెప్పిన మాటకు పొంతన లేదెందుకు? సునీల్ యాదవ్‌ను 2021, ఆగస్టులో సీబీఐ అరెస్టు చేసింది. 2021, డిసెంబర్‌లో చార్జిషీట్ వేసింది. అందులో వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజున... వివేకా ఇంటి పరిసరాల్లోనే సునీల్ యాదవ్ తిరిగినట్టు సీబీఐ పేర్కొంది. సునీల్ మొబైల్ ఫోన్ లొకేషన్‌ను గూగుల్ టేకౌట్ విధానం ద్వారా నిర్ధారించి ఈ విషయాన్ని కనుగొన్నట్టు తెలిపింది. కేసులో ఇదే అత్యంత కీలకమైన సాక్ష్యమని కూడా న్యాయస్థానానికి నివేదించింది. మరి సీబీఐ వద్ద అంత పక్కా సమాచారం ఉంటే దాని ఆధారంగా కేసు దర్యాప్తును ఎందుకు వేగవంతం చేయలేదు?. నేరుగా చర్యలు తీసుకోవచ్చు కదా? వెంటనే కేసు దర్యాప్తును కొలిక్కి తేవచ్చు కదా? కానీ అలా చేయలేదు. హత్య జరిగిన నాడు వైఎస్ భాస్కర్ రెడ్డి ఇంట్లో సునీల్ యాదవ్ ఉన్నారని నాటి చార్జిషీట్లో చెప్పనే లేదు.

ఇప్పుడు 14 నెలల తరువాత... హఠాత్తుగా సునీల్ యాదవ్ ఆ రోజు వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసంలో ఉన్నట్టు న్యాయస్థానానికి సీబీఐ చెప్పడం వెనుక మతలబేంటి? బోడిగుండుకు మోకాలికి ముడి పెట్టాలని ఎందుకు ప్రయత్నిస్తోంది? సునీల్ యాదవ్ కదలికలను గుర్తించి ఉంటే 2021 నాటి చార్జిషీట్లోనే ఎందుకు చెప్పలేదు...!? ఇప్పుడెందుకు కొత్తగా చెబుతున్నారు? న్యాయస్థానానికి రెండు వేర్వేరు సందర్భాల్లో రెండు వేర్వేరు వాదనలు వినిపించడమేంటి? ఇదంతా యాదృచ్ఛికం కాదని... ఓ స్కెచ్ ప్రకారమే జరుగుతోందని అర్థం కావటం లేదూ?

ఏది నిజం?

వారు వివేకాకు సన్నిహితులు కాదా!?

వివేకా హత్య కేసులో మోకాలికి– బోడి గుండుకు ముడిపెట్టేందుకు పచ్చ మీడియా యత్నిస్తోంది. వివేకానందరెడ్డి, వైఎస్ అవినాశ్ రెడ్డి మధ్య విభేదాలున్నాయని ఈనాడు పతాక శీర్షికల్లో రాసింది. వారి మధ్య కడప ఎంపీ టికెట్ కోసం విభేదాలున్నాయని సీబీఐ అధికారులు చెబుతున్నట్లు కూడా పేర్కొంది. పోనీ ఆ మాటకే కట్టుబడి ఉన్నారా అంటే... అదీ లేదు. ఈ కేసులో అరెస్టయిన నిందితులు ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, దస్తగిరి వివేకానందరెడ్డికి సన్నిహితులని చెప్పేదీ ఈనాడే. ఆ నలుగురే మళ్లీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిలతో కలసి వివేకా హత్యకు కుట్రపన్నారని రాసేదీ ఈనాడే. సీబీఐ అధికారులు కూడా ఇదే మాటలు వల్లె వేస్తున్నారు. ఇది కుట్ర కాదా రామోజీ? ఎర్రగంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరిలు వైఎస్ వివేకానందరెడ్డికి ఎన్నో ఏళ్లుగా సన్నిహితులని సీబీఐ చెబుతోంది. అది నిజం కూడా. వివేకాకు సన్నిహితులు కనక వారికి సహజంగానే వివేకా కుటుంబీకులతో కూడా సన్నిహిత సంబంధాలుంటాయి. అంటే వివేకానందరెడ్డి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలకు కూడా ఆ నలుగురు సన్నిహితులేనన్నది అందరికీ తెలిసిన విషయమే. నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి హైదరాబాద్‌లో తన మనవరాలి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తూ పులివెందుల నుంచి ఒక్క ఎర్ర గంగిరెడ్డినే ఆహ్వానించారు. అంటే వారంతా సన్నిహితులేనన్నది సుస్పష్టం. ఇక వైఎస్ వివేకానంద రెడ్డిని ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరిలు హత్య చేశారని సీబీఐ ఎఫ్ఐఆర్‌లో కూడా పేర్కొంది.

ఇక్కడ గమనించాల్సిందేంటంటే... ఎవరైనా చెబితే ఆ హత్య చేశారా? వ్యక్తిగత, ఆర్థిక విభేదాలతోనే హత్యకు పాల్పడ్డారా? అనేది. వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడంతో ఆయన కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయన్నది రహస్యమేమీ కాదు. తన రెండో భార్యకు ఆస్తిలో వాటా ఇవ్వాలని... ఆమెకు, తనకు పుట్టిన కొడుకును వారసుడిగా ప్రకటించాలని వైఎస్ వివేకా భావించారు. దీన్ని ఆయన కుటుంబం వ్యతిరేకించింది. ఆయన భార్య హైదరాబాద్‌లో ఉన్న కుమార్తె సునీత వద్దకు వెళ్లిపోయారు. ఇదంతా పులివెందులలో ప్రతి ఒక్కరికీ తెలుసు. ఈ వ్యవహారంలోనే వివేకా రెండో భార్యను సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్ రెడ్డి బెదిరించారన్నది కూడా కాదనలేని నిజం. ఈ నేపథ్యంలో వైఎస్ వివేకానందరెడ్డిని సునీల్ యాదవ్, దస్తగిరి, ఉమాశంకర్‌రెడ్డి హత్య చేస్తే...అందుకు ఎర్రగంగిరెడ్డి దగ్గరుండి సహకరిస్తే... దాని వెనుక నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డిల ప్రమేయం ఉండే అవకాశాలూ ఉంటాయి కదా? పైగా వివేకా మరణించిన విషయం మొదటగా ఆయన కుమార్తె సునీత, భార్య సౌభాగ్యమ్మ, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డిలకే తెలిసింది. ఉదయాన్నే జమ్మలమడుగులో ఎన్నికల ప్రచారానికి బయలుదేరిన వైఎస్ అవినాశ్ రెడ్డికి... నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి చెబితేనే ఈ మృతి విషయం తెలిసింది. ఆ ఫోన్‌కాల్‌తోనే ఆయన వెనక్కి తిరిగి పులివెందుల వచ్చారు.

ఫోన్లో మెసేజీలు డిలీట్ చేయలేదా?

పైపెచ్చు వివేకా రాసిన లేఖను, ఆయన సెల్‌ఫోన్‌ను తామొచ్చే వరకూ ఎవరికీ ఇవ్వొద్దని పీఏ కృష్ణారెడ్డికి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. వారు వచ్చిన తరువాత, ఆ ఫోన్లోని కొన్ని మెసేజీలను డిలీట్ చేశాకే దాన్ని పోలీసులకు ఇచ్చారు. ఈ పరిణామాలన్నీ వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డిల పాత్రపైనా సందేహాలను లేవనెత్తుతున్నాయి కదా? మరి వాళ్లనెందుకు సీబీఐ విచారించటం లేదు? ఆ దిశగా దర్యాప్తు ఎందుకు చేయటం లేదు? అంతేకాదు వైఎస్ వివేకా హత్య జరిగినప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పుడు వేసిన సిట్ దర్యాప్తు నివేదికగానీ...అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నివేదికనుగానీ సీబీఐ ఏమాత్రం పట్టించుకోలేదు. వాటిని పక్కన పడేసి సీబీఐలో కిందిస్థాయి అధికారులు కొందరు... దర్యాప్తును కావాలనుకున్న దిశగా నడిపిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పోనీ టీడీపీ, ఈనాడు ఆరోపిస్తున్నట్టుగా వైఎస్ వివేకా, వైఎస్ అవినాశ్ మధ్య విభేదాలు ఉండటమే నిజమైతే... వివేకా సన్నిహితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరిలు సహజంగానే అవినాశ్‌కు దూరంగా ఉంటారు. తమకు ఆప్తుడైన వివేకా అంటే సరిపడని అవినాశ్ రెడ్డితో వారెందుకు సన్నిహితంగా ఉంటారు? మరి ఆ నలుగురే హత్య చేశారు అనుకుంటే దాంతో అవినాశ్‌కి గానీ ఆయన కుటుంబ సభ్యులకుగానీ ఎటువంటి సంబంధం ఉండదు కదా?. ఈ చిన్న లాజిక్‌ను సీబీఐ, టీడీపీ, పచ్చ మీడియా ఎందుకు మిస్ అవుతున్నాయి? కేవలం ముఖ్యమంత్రి కుటుంబంపై బురదజల్లేందుకేనని అర్థం కావటం లేదా?

సాక్షులు చెప్పని మాటలు కూడా...

సీబీఐ దర్యాప్తు తీరులో విస్మయం కలిగించే అంశమేంటంటే... ఈ కేసులో సాక్షులు చెప్పని విషయాలనూ వారి వాంగ్మూలాలుగా నమోదు చేయడం!!. బహుశా గతంలో ఎప్పుడూ పోలీసుల విచారణలో గానీ, సీబీఐ దర్యాప్తులో గానీ ఇలాంటి ఆరోపణలు రాలేదు. కానీ వివేకా హత్య కేసులో ఎంతోమంది సాక్షులు తాము చెప్పని మాటలను సీబీఐ అధికారులు ఏకపక్షంగా నమోదు చేసేసి... మీడియాకు లీకులిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా సీబీఐ అధికారులు పేర్కొన్న శశికళ అనే మహిళ వాంగ్మూలం కూడా అదే రీతిలో ఉంది. వివేకా గుండెపోటుతో మరణించినట్లుగా ఎంపీ అవినాశ్ రెడ్డి తనతో చెప్పారని శశికళ వాంగ్మూలమిచ్చినట్లుగా సీబీఐ పేర్కొంది. కానీ ఈ విషయాన్ని శశికళ ఖండించారు. అవినాశ్ రెడ్డి తనతో ఏమీ చెప్పనే లేదని... తాను అసలు అవినాశ్‌తో ఈ విషయంపై మాట్లాడనే లేదని ఆమె స్పష్టం చేశారు. అదే మాటను ఆమె గతంలో సిట్ విచారణలోనూ, ప్రస్తుత సీబీఐ దర్యాప్తులోనూ చెప్పారు. కానీ తాను చెప్పని మాటలను చెప్పినట్టుగా సీబీఐ అధికారులు ఎందుకు వాంగ్మూలంగా రాసుకున్నారో తెలియడం లేదని శశికళ వాపోయారు. ఈ విషయాన్ని తనతో కనీసం నిర్ధారించుకోకుండా ఈనాడు, ఇతర మీడియా ఏకపక్షంగా రాసేసినట్లు ఆమె తెలియజేశారు. రామోజీరావు నీతిమాలిన పాత్రికేయంపై ఆమె మండిపడ్డారు. గతంలోనూ పలువురి విషయంలో ఇలాంటివి జరగటం ఇక్కడ గమనార్హం. వైఎస్సార్ కుటుంబ సభ్యుడు వైఎస్ అభిషేక్ రెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వెల్లపు వర ప్రసాద్, రఘునాథ రెడ్డి, అనంతపురం జిల్లాకు చెందిన గంగాధర్‌రెడ్డిలతోపాటు 71 ఏళ్ల ప్రభావతమ్మ అనే మహిళ కూడా ఇలాగే చెప్పారు. తాము చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ అధికారులు వాంగ్మూలం నమోదు చేశారని వారు తెలియజేశారు. దీనిపై అధికారికంగా ఫిర్యాదు కూడా చేశారు. ఎందుకిలా జరుగుతోంది? ఈ తరహా సీబీఐ వాంగ్మూలాలు ఎల్లో మీడియాకు మాత్రమే ఎలా చేరుతున్నాయి? దీనివెనక ఉన్న అదృశ్య శక్తులేంటి? అన్నివేళ్లూ చూపిస్తున్నది చంద్రబాబు వైపే!!. వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక ఇలా దొడ్డిదారి పోరాటానికి బాబు దిగారన్నది తేలిగ్గానే అర్థమవుతుంది. 2019 ఎన్నికల్లో ఓడిపోయాక బీజేపీలోకి పంపిన కోవర్టులు చంద్రబాబుకు ఈ వ్యవహారంలో సహకరిస్తున్నారన్నది రహస్యమేమీ కాదు.

ఫ్లెక్సీలో ఫొటో ఉంటే ప్రభావితం చేయడమా..!?

సీబీఐ పేరు చెబుతూ 'ఈనాడు' రాసిన మరో దుర్మార్గపు రాత ఇది. ఈ కేసులో అరెస్టయిన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు తన ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా వేయించిన ఫ్లెక్సీలో ఎంపీ అవినాశ్ రెడ్డి ఫొటో పెట్టారట. తద్వారా తన వెనుక ఎంతమంది పరపతి గలవారున్నారో అని కేసును, సాక్షులను ప్రభావితం చేసేందుకు యత్నించారట!!. అదీ ఈనాడు వెర్రిగక్కిన పైత్యం. ఫ్లెక్సీలో ఓ నాయకుడి ఫొటో పెడితే అది సాక్షులను ప్రభావితం చేయడం అవుతుందా? గతంలో బ్యానర్లు, వాల్ పోస్టర్లు ఉండేవి. కొన్నేళ్లుగా ఫ్లెక్సీలు వచ్చాయి. చిన్న సెలూన్ ప్రారంభోత్సవం నుంచి షాపింగ్ మాల్స్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సాధారణమైపోయింది. ఆ సందర్భంగా తమ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతల ఫొటోలు ఆ ఫ్లెక్సీల్లో వేయటం సహజం. దీన్ని కూడా తప్పుబడతారా? చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రమంతటా ఆయన ఫొటోలు ఎందరో ఫ్లెక్సీల్లో వేశారు... ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్నాసరే ఆయన ఫొటోలు ఆ పార్టీ నేతలు ఫ్లెక్సీల్లో వేస్తున్నారు. అంత మాత్రాన వారంతా చంద్రబాబు ఫొటో చూపించి అందర్నీ బెదిరిస్తున్నట్టు భావించాలా? మరి ఫ్లెక్సీల్లో చంద్రబాబు ఫొటోలుంటే లేని అభ్యంతరం... ఎంపీ అవినాశ్ రెడ్డి ఉంటే మాత్రం బెదిరించడం.. సాక్షులను ప్రభావితం చేయడం ఎలా అవుతుంది రామోజీ గారూ?.

అవినాశ్‌కు టికెట్టు ఖరారు చేశాక కూడా...

సీబీఐ కౌంటర్ అఫిడవిట్ అంటూ ఈనాడు, దాని తోకమీడియా వండిన కథనాలన్నీ అవాస్తవాలే. అసలు కడప ఎంపీ టికెట్‌పై విభేదాలు రేగే అవకాశం ఎక్కడుంది? అవినాశ్ రెడ్డి అప్పటికే కడప ఎంపీ. ఆయనకే టికెట్ ఇస్తున్నట్లు పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అప్పటికే ధ్రువీకరించారు. జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఉన్న వైఎస్ వివేకానందరెడ్డి... ఎంపీగా అవినాశ్‌ను గెలిపించడానికి ప్రచారం కూడా మొదలు పెట్టారు. ముందురోజు రాత్రి జమ్మలమడుగులో ప్రచారం చేసి ఇంటికి వచ్చాక... ఆ రోజు అర్ధరాత్రి ఆయన హత్యకు గురయ్యారు. ఎంపీగా అవినాశ్ విజయం కోసం తన తండ్రి ప్రచారం చేస్తున్నారని వైఎస్ వివేకా హత్య తరువాత ఆయన కుమార్తె సునీత మీడియాతో కూడా చెప్పారు. మరి ఎంపీ టికెట్‌పై వివేకా, అవినాశ్ మధ్య విభేదాలున్నాయని పచ్చ మీడియా పదే పదే రాస్తుండటం రాజకీయ కుట్ర కాక మరేమిటి?

ఇక వివేకా హత్యకు రూ.40కోట్లు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారనే మరో నిరాధార ఆరోపణ కూడా పదే పదే చేస్తున్నారు. అందుకోసం రూ.5 కోట్లు అడ్వాన్స్ ఇచ్చారని... అందులో తనకు రూ.కోటి కూడా ఇచ్చారని దస్తగిరి అప్రూవర్‌గా మారుతూ ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు సీబీఐ తెలిపింది. మరి హత్య చేయడానికి 10 రోజులు ముందే చేతిలో కోటి రూపాయలున్న దస్తగిరి.. ఆ తరవాత రూ.5వేలు, రూ.10వేల అప్పు కోసం పులివెందులలో అందరి చుట్టూ ఎందుకు తిరిగాడు?

సునీల్ యాదవ్ తనకివ్వాల్సిన రూ.3 లక్షలు ఇప్పించాలంటూ... ఆ మేరకు దస్తావేజులు చూపిస్తూ మరీ దస్తగిరి ప్రాధేయపడటం నిజం కాదా...! ఆ దస్తావేజులను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు కదా!. అంటే దస్తగిరికి రూ.కోటి ఇచ్చారన్నది అబద్ధమని స్పష్టమవుతోంది కదా? దీన్నిబట్టి దస్తగిరి అప్రూవర్‌గా మారుతూ ఇచ్చిన వాంగ్మూలంలోని విషయాలన్నీ కల్పితాలే తప్ప వాస్తవాలు కాదని తెలియటం లేదా? హత్య వెనుక ఎంపీ అవినాశ్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారని గంగిరెడ్డి తనకు చెప్పినట్లుగా దస్తగిరి వెల్లడించిన విషయం అవాస్తవం కాదా?

ఐక్యరాజ్యసమితిని సంస్కరించరా?

ఐక్యరాజ్యసమితి (యూఎన్ఓ)ని గొప్ప ఉద్దేశ్యంతో 1945 అక్టోబర్ 24న స్థాపించినా... దాని నిర్వహణ, ఇతర అంశాలకు అవసరమైన ఆర్థిక సంపత్తి కోసం అమెరికాపైనే ఎక్కువగా ఆధారపడటం పెద్ద లోపంగా నిలిచింది. అలాగే శాశ్వత సభ్యత్వం ఉన్న ఐదు దేశాలూ... ఏదో రూపంలో తమకున్న వీటో పవర్‌తో యూఎన్ స్థాపిత లక్ష్యాలు సాకారం కాకుండా స్వప్రయోజనాల కోసం అడ్డుకోవడం మరో సమస్య. దాదాపూ ఏడు దశాబ్దాల యూఎన్ ప్రస్థానంలో దాని స్వరూప, స్వభావాలు అలాగే ఉండిపోవడం వల్ల ప్రపంచానికి పెద్దగా ఒరిగింది ఏమీ లేదు. కాలంతోపాటూ అదీ మారుతూ ఉండకపోవడం పెద్ద లోపం. ముఖ్యంగా శాశ్వత సభ్యత్వం పొందటానికి అర్హత ఉన్న అనేక దేశాలు రంగంలోకి వచ్చినా... వాటికి సభ్యత్వం ఇవ్వకపోవడం వల్ల సంపన్న, అభివృద్ధి చెందిన దేశాల పెత్తనానికే అది వేదికగా కొనసాగుతోంది. ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండాలలోని అర్హత ఉన్న దేశాలకు శాశ్వత సభ్యత్వం ఇవ్వక పోవడం వల్ల వర్ధమాన దేశాలకు అన్యాయం జరుగుతోంది.



అలాగే యూఎన్‌లో ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకూ పవర్‌లో సమతుల భాగస్వామ్యం లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సమస్యల నేపథ్యంలో, దేశాల మధ్య నెలకొన్న సరిహద్దు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా విఫలమైందని చాలా దేశాల ప్రజలు భావిస్తున్నారు. ఐక్యరాజ్యసమితిలో 193 దేశాలు సభ్యత్వం కలిగి ఉన్నా... అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు ఉన్న వీటో అధికారం కారణంగా వాటి మాటకు తిరుగులేకుండాపోతోంది. ప్రస్తుతం భద్రతా మండలిలో ఉన్న ఐదు శాశ్వత సభ్య రాజ్యాలతో పాటు తామూ శాశ్వత సభ్య రాజ్యాలుగా అవతరించడమే లక్ష్యంగా ఏర్పడిన జి –4 (భారత్, జపాన్, జర్మనీ, బ్రెజిల్) దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్య రాజ్యాలుగా అవతరించే విధంగా ఐక్యరాజ్యసమితిని సంస్కరించాల్సిన సందర్భం వచ్చింది.

అగ్ర రాజ్యం కనుసన్నల్లో పనిచేస్తూ ఆర్థికంగా వెనకబడిన దేశాల సమస్యలను పట్టించుకోవడంలేదనీ, సంక్షోభాలను ఎదుర్కొంటున్న దేశాల పట్ల నిష్క్రియాపరత్వాన్ని ప్రదర్శిస్తున్నదనీ ఐక్యరాజ్య సమితిపై విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి పేలవంగానైనా ప్రయత్నాలు చేయకపోవడాన్ని ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. యుద్ధం ఏడాదిగా జరుగుతున్నా ఐక్యరాజ్యసమితి సరియైన చర్యను తీసుకోవడం లేదనీ... దాని మౌనం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు. ఐరాస సొంతంగా నిర్ణయాలు తీసుకొని ప్రపంచ శాంతి పట్ల ఒక ధైర్యాన్నీ, భరోసాను ఇవ్వాలని ప్రపంచ సమాజం ఆశిస్తోంది.

ఒక్క మాటలో చెప్పాలంటే ఐక్యరాజ్యసమితిని సంస్కరించకపోతే నానాజాతిసమితి మాదిరిగానే ఐక్యరాజ్యసమితి కూడా వైఫల్యం చెందుతుందని హెచ్చరిస్తున్నారు. భారత్ లాంటి దేశాలకు ఐక్యరాజ్యసమితిలో ప్రముఖమైన ప్రాధాన్యతను ఇచ్చినప్పుడే ప్రపంచ శాంతి పరిఢవిల్లడానికి అవకాశం ఉంటుందనీ, అందుకోసం ఇండియాకు భద్రతా సమితిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలనే సంగతి మరువరాదు.

– కేతూరి శ్రీరామ్, ఎంఏ, రాజనీతి శాస్త్రం

ఉపాస ముండున్రి

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్తకు బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గా పాన్ డబ్బ మా దోస్తుల అడ్డ. పొద్దు మీకంగనే మా దోస్తులందరు గాడ జమైతరు. గా దినం నేను బోక ముందు గాల్లు ఏం ముచ్చట బెట్టిండ్రో నాకెర్క లేదు. గని నేను బోయినంక గాల్లు గిట్ల మాట్లాడుకుండ్రు.

''రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర జేస్తుండు. తెలంగాన దెచ్చినోల్లకు రొండుపార్లు మోక ఇచ్చిండ్రు. తెలంగాన ఇచ్చిన మా కాంగ్రెస్‌కు ఒకపారి మోక ఇయ్యుండ్రి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక బంగారు తెలంగాన ఏమో గని గాయిన కుటుంబం బంగారు కుటుంబమైంది. మంచి నీల్లు ఏమో గని మందు ఏర్లై పారుతున్నది'' అని సత్నారి అన్నడు.

''గీ సర్కార్ ఎవ్వరితో నడుస్తున్నదో ఎర్కేనా?'' అని ఇస్తారి అడిగిండు.

''ఎవ్వరితోని నడుస్తున్నది'' అని యాద్గిరి అడిగిండు.

''గీ సర్కార్ ముఖ్యమంత్రి తోని నడుస్త లేదు. మంత్రుల తోని నడుస్త లేదు. ఎమ్మెల్యేలతోని నడుస్త లేదు. అఫిసర్లతోని నడుస్త లేదు. పోలీసోల్ల తోని నడుస్త లేదు. మందు తోని నడుస్తున్నది'' అని ఇస్తారి అన్నడు.

''అందరికి చెయ్యిచ్చుకుంట రేవంత్ రెడ్డి పాదయాత్ర జెయ్యబట్టిండు. గా లెక్కనే కద్మ కాంగ్రెస్ లీడర్లు గూడ హాత్ సే హాత్ జోడో పాదయాత్ర జెయ్యాలని గాయిన అన్నడు.''

''కుక్కలు గిన రేవంత్ ఎంటబడ్డయా?''

''పాదయాత్ర అనంగనే కుక్కలెందుకు యాది కొచ్చినయి?''

''నడ్సెటోల్ల ఎంటనే కుక్కలు బడ్తయి. మొరిగి ఊకోకుంట కరుస్తయి. గీ నడ్మ పట్నంల కుక్కలు ఎక్వ అయినయి. తొవ్వ పొంటి బోయెటోల్లను ఒక్క తీర్గ గరుస్తున్నయి.''

''కుక్క గర్సినోల్లు దవకానకు బోయి సూది మందు దీపిచ్చుకుంట లేరా?''

''దవకానకు బోతె కుక్క కాటుకు మందులు దొరుకత లేవు. దాంతోని కుక్క కాటుకు చెప్పు దెబ్బనే మందు అనుకుంటున్నరు.''



''చెప్పులన్న దొరుకుతున్నయా?''

''చెప్పులెందుకు దొర్కయి?''

''పాదయాత్రలు జేస్కుంట లీడర్లు మీటింగులు బెడ్తున్నరు. బెట్టి స్పీచ్ దంచుతున్నరు. చెప్పిందే చెప్పుకొంట బోర్ గొట్టే లీడర్ల మీద జెనం చెప్పులేస్తున్నరు.''

''హాత్ సే హాత్ జోడో జెయ్య బట్కె కాంగ్రెస్ లీడర్లందరు ఒక్కటైతరా?''

''అందరు ఒక్క మాట మీద నడిస్తె కాంగ్రెస్ ఎట్ల అయితది. వొచ్చెపారి తెలంగానల కాంగ్రెస్ సర్కారొస్తది అని రేవంత్ అంటుంటె, ఏ పార్టికి మెజార్టి రాదు. హంగ్ వొస్తది. కాంగ్రెస్, బీఆర్ఎస్ గల్సి సర్కార్ ఏర్పాటు జేస్తయని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నడు.''

''అపొజిసన్ పార్టిలన్ని ఒక్కటైతె బీజేపీకి నూరు సీట్లు గూడ రావని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నడు.''

''అపొజిషన్ పార్టీలన్ని ఒక్కటైతె ప్రతాని ఎవరైతరు. నితీశ్ కుమార్ ప్రతాని కుర్సి మీద గూసోవాలనుకుంటున్నడు. ప్రతాని కుర్సి కోసమే కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ జేసిండు. ప్రతాని కుర్సి కోసమే రాహుల్ గాంది భారత్ జోడో యాత్ర జేసిండు. మమతా బెనర్జీ, కేజ్రీవాల్ గూడ ప్రతాని కుర్సి కోసం తన్లాడుతున్నరు. ఎండ కాలం షురువు గాక ముందే ఎండలు గొడ్తున్న తీర్గ ఎలచ్చన్లు రాక ముందే ఎలచ్చన్ల కాక షురువైంది. కుర్సీలాట మొదలైంది.''

''శివరాత్రి మంత్రి మల్లారెడ్డి కీసర గుట్టకు బోయిండు. గాడ జాత్ర అయితున్నది. గాడ ఆటల పోటీలు బెట్టిండ్రు. ఆటల పోటీల ముంగట మీటింగ్ బెట్టిండ్రు. ఎలచ్చన్ల కోడున్నదని చెప్పినా ఇనకుంట మంత్రి మల్లా రెడ్డి స్టేజ్ ఎక్కిండు. జాత్రల కోడేంది గీడేంది. నేను పాలమ్మిన. పూలమ్మిన. కాలేజీలు బెట్టిన. నా లెక్క మీరందరు పైకి రావాలె అని మంత్రి అనంగనే కిందున్నోళ్లు స్టేజి మీది కొచ్చిండ్రు'' అని సత్నారి జెప్పిండు.

తోక: మా దోస్తులల్ల ఒకడు ఒక 'ఆహ్వాన పత్రిక' బంపిండు. గా దాంట్ల గిట్లున్నది. మీ పిల్లా జెల్లా తోని శివరాత్రి నాడు మా ఇంటి కొచ్చి ఉపాస ముండుండ్రి. యాడాదైనంక గాడు ఎమ్మెల్యే అయ్యిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

కానిస్టేబుల్ అభ్యర్థులకు 2 నుంచి డ్రైవింగ్ టెస్ట్‌లు

సాక్షి, హైదరాబాద్: పోలీస్ శాఖలో కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల డ్రైవింగ్, మెకానిక్ ట్రేడ్ పరీక్షలను మార్చి 2 నుంచి నిర్వహించనున్నట్టు టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. పోలీస్ శాఖలో 100 డ్రైవర్, అగ్నిమాపక శాఖలో 225 డ్రైవర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అర్హులైన అభ్యర్థులకు మార్చి 2 నుంచి 21 వరకు డ్రైవింగ్ పరీక్షలు అంబర్‌పేట్‌లోని పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు www.tslprb.in వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను ఈనెల 25 ఉదయం 8 నుంచి 28 అర్ధరాత్రి 12 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వీటిని ఏ4 సైజులో ప్రింటవుట్ తీసుకోవాలని సూచించారు. అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో ఇబ్బందులుంటే support@ tslprb.in ఈమెయిల్ ఐడీ లేదా 9393711110 లేదా 9391005006 నంబర్లలో సంప్రదించాలన్నారు. డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరయ్యే అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షల్లో సాధించిన మార్కుల వివరాలు, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ (అగ్నిమాపక శాఖలో డ్రైవర్ ఆపరేటర్‌కు) ఐటీఐ ధ్రువపత్రాలు అన్నీ స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ అటెస్టేషన్) చేసుకుని తేవాలని సూచించారు.

ముగిసిన గ్రూప్–3 దరఖాస్తుల ప్రక్రియ

ఒక్కొక్క ఉద్యోగానికి 390 మంది పోటీ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–3 ఉద్యోగాల భర్తీకి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. గతేడాది డిసెంబర్ 30న గ్రూప్–3 కేటగిరీలో 1375 ఉద్యోగాల భర్తీకి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటన జారీ చేసింది. జనవరి 24 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా.. ఈ నెల 23న గడువు ముగిసింది. గ్రూప్–3 కేటగిరీలో 5,36,477 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కొక్క ఉద్యోగానికి సగటున 390 మంది పోటీ పడుతున్నారు.

ఎమ్మెల్యే సునీతపై పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే గొంగిడి సునీత అనైతిక, అక్రమ మార్గాల ద్వారా అధిక సంపదను కూడబెట్టారని ఆరోపిస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సునీతపై చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలంటూ యాదాద్రి భువనగిరి జిల్లా గొల్లగూడెంకు చెందిన బొడుదాసు మహేశ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. బ్లాక్‌మెయిలింగ్‌లో భాగంగానే కొందరు ఇలాంటి పిటిషన్లు వేస్తున్నట్లు కనిపిస్తోందంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

పచ్చబొట్టు చెరిగిపోదులే!



- ఆదివాసీల్లో చెక్కుచెదరని సంప్రదాయం..
- సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక
- 'తోటి' తెగ మహిళల ప్రత్యేకతకు రూపం

భవిష్యత్ తరాలకు అందితేనే పచ్చబొట్టు పదిలం..

ఈ తరం వారికి పచ్చబొట్టు అంటే కేవలం ఒంటిపై వేయించుకొనే ఫ్యాషన్ చిహ్నం.. టాటూ పేరుతో చిత్రించుకొనే ప్రత్యేకమైన డిజైన్. కానీ నిన్నటితరం వారికి మాత్రం అది జీవితాంతం గుర్తుంచుకొనే ఒక పదిల జ్ఞాపకం.. ముఖ్యంగా గిరిజనులకైతే అదో సంప్రదాయం.. జీవన విధానంలో ఓ భాగం.. తరతరాల ఆచారం. గిరిజనుల్లో మొదలై మైదాన ప్రాంతాలు, అటు నుంచి మెట్రో నగరాలకు ఓ ఫ్యాషన్ గా మారిన పచ్చబొట్టు పుట్టుక, అందుకు ఉపయోగించే వస్తువుల గురించి తెలుసుకోవాలంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గూడేల్లోకి వెళ్లాల్సిందే.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గిరిజనుల్లో పచ్చబొట్టు అనేది తోటి అనే తెగలోని ఆడవాళ్లకు మాత్రమే పరిమితమైన కళ. ఐదేళ్ల నుంచే సూదులు చేతబట్టి, ఒంటిపై ఎలాంటి ఆకారమైనా వేయగల నేర్పు నాటి తరం తోటి మహిళల సొంతం. ఇందుకోసం సన్నని మూడు సూదులను దగ్గర చేర్చి చేతితో పట్టుకొనేలా దారంతో చుట్టగా చుడతారు. అడవిలో దొరికే (పెద్దేగి జాతి చెట్టు) బెరడును తెచ్చి చిన్న కుండలో వేసి మాడి పోయే వరకు వేడి చేస్తే పచ్చని రంగు వస్తుంది. సన్నటి కట్టెపుల్లతో శరీరంపై మొదట ఆకారం వేస్తారు. ఆముదం నూనెను, ఆ రంగులో ముంచి శరీరంపై సూదితో పొడుస్తారు. వేసిన పచ్చబొట్టు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇదంతా ఎంతో క్రమశిక్షణ, ఓర్పుతో వేస్తుంటారు.



ఒక్కో బొట్టుకు ఒక్కో ప్రత్యేకత..

ఆది దంపతులైన శివపార్వతుల కల్యాణంలో తోటీలు పచ్చబొట్టు వేశారని పురాణ కథల్లో ఉంది. పార్వతికి నుదుటిపై పచ్చబొట్టు వేశాకే వివాహం జరిగిందని చెబుతుంటారు. ఇదే సంప్రదాయాన్ని రాజ్‌గోండ్ అమ్మాయిలు పెళ్లి పీటలు ఎక్కేముందు నుదుటిపై సూర్యచంద్రుల ఆకారంలో పచ్చబొట్టు వేయించుకొనేవారు. మూడు నెలల శిశువుకు దిష్టి చుక్కతో మొదలై, మహిళల చేతులపై నవగ్రహాలు, పుష్పాలు రకాల రూపాల్లో సందర్భాన్ని బట్టి వేసుకొనేవారు. రోగాలు, నొప్పులు వస్తే నుదిటి, కణత, గడ్డం, బుగ్గ, మెడ, వీపు, చేతి వేళ్ల మీద నుంచి భుజం వరకు, నడుము తదితర భాగాలపై వేసుకొనేవారు. అలంకారమే కాక, దైవభక్తి, భార్యాభర్తలు, అమ్మనాన్నలు, ఇష్ట దైవం, పేర్లను సైతం ఒంటిపై ముద్రించుకునే వాళ్లు. పూర్వం తమ పిల్లల్ని గుర్తుపట్టేందుకు శిశువుకు 3 నెలలు రాగానే పచ్చబొట్టు వేసేవారని నాటి తరం ఆదివాసీలు చెబుతున్నారు. పూర్వం గిరిజన మహిళలు చేతి నుంచి వీపు, తల వరకు ఒంటికి వేయని దుస్తుల వలే పచ్చబొట్టును వేయించుకొనేవారని గుర్తుచేసుకున్నారు. గిరిజన ప్రాంతాలకు వలసలు మొదలవడంతో గిరిజనేతరులకు సైతం ఈ ఆచారం అలవాటు అయిందని పేర్కొన్నారు. అయితే ఈ తరం గిరిజన మహిళల్లో ఎక్కువ మంది పచ్చబొట్టుపై ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. భవిష్యత్తు తరాలకు ఈ కళ అందితేనే పచ్చబొట్టు పదిలంగా ఉంటుందని చెబుతున్నారు.

చరిత్రకారుల ప్రస్తావన..

గతంలో హైమస్ డార్ఫ్, మైఖేల్ యోర్క్ వంటి విదేశీ పరిశోధకులు తమ రచనలు, ఫొటోలు, డాక్యుమెంటరీల్లో పచ్చబొట్టును ప్రస్తావించారు. రెండేళ్ల క్రితం ఐఐటీ హైదరాబాద్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు పచ్చబొట్టుపై అధ్యయనం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో పని చేసిన ఐఏఎస్, ఐపీఎస్‌లు సైతం తమ ఒంటిపై కనీసం ఒక చుక్కనైనా తోటిల వద్ద వేసుకొని మురిసిపోయేవారు. ఆదివాసీల్లో ఒకటైన తోటి తెగ జనాభా 2011 లెక్కల ప్రకారం 4,811గా ఉండగా ప్రస్తుతం 10 వేల వరకు ఉండొచ్చని అంచనా.

దేవుడిచ్చిన వరం

మా ముందు తరం నుంచే పచ్చబొట్టు వేసే ఆచారం ఉంది.. మా తెగకు దేవుడు ఇచ్చిన వరం ఇది. రాను రాను గిరిజనుల్లో పచ్చబొట్టుపై ఆసక్తి తగ్గిపోయినా మేం ఉన్నంతకాలం ఆచారాన్ని కొనసాగిస్తాం.

– వెద్మ రాంబాయి, ఎదులపాడ్, తిర్యాణి మండలం, కుమురంభీం జిల్లా



25న రాష్ట్రానికి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈ నెల 25న రాష్ట్రానికి రానున్నారు. ఆయన హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో శనివారం ఉదయం 11 గంటలకు జరిగే 19వ కాన్వొకేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (వర్సిటీ చాన్స్‌లర్) జస్టిస్ ఉజ్జల్ భూయాన్, రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారు.

స్కూల్ టీచర్లకూ 'ఇంటర్' విధులు

- కాలేజీ సిబ్బంది తక్కువైన చోట ఏర్పాట్లు
- ప్రైవేటుకు కొమ్ముగాసేవారికి నో చాన్స్
- క్లీన్ రికార్డు ఉన్నవారికే అవకాశం
- ఇంటర్ బోర్డు జిల్లా అధికారులకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్షల పకడ్బందీ నిర్వహణకు కసరత్తు మొదలైంది. ప్రైవేట్ కాలేజీలతో మిలాఖత్ అయ్యేవారికి చెక్ పెట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే నెల 15 నుంచి మొదలయ్యే ఈ పరీక్షల విధుల్లోకి స్కూల్ టీచర్లను కూడా తీసుకోవాలని ఇంటర్ బోర్డ్ నిర్ణయించింది. ఇంటర్ కాలేజీ అధ్యాపకుల కొరత ఉన్నచోట టీచర్ల అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఎక్కువుండే రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ టీచర్లను పరీక్షల విధులకు తీసుకోవాలని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,473 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఇంటర్ బోర్డ్ తెలిపింది. ఈ ఏడాది ఫస్టియర్ ఇంటర్‌కు 4,82,619 మంది, సెకండియర్‌కు 4,65,391 మంది హాజరవుతున్నట్టు పేర్కొంది. ప్రైవేటు కాలేజీలతో మిలాఖత్ అయినట్టు ఆరోపణలున్న పరీక్షా కేంద్రాలపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కాలేజీల్లో వీలైనంత వరకూ క్లీన్ రికార్డు ఉన్నవారికే ఇన్విజిలేషన్ బాధ్యతలు అప్పగించనున్నారు.

భద్రత మరింత పెంపు

కొత్తగా ప్రవేశపెడుతున్న ఆన్‌లైన్ మూల్యాంకన విధానాన్ని అభాసుపాలు చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారనే ఆందోళన అధికారుల్లో ఉంది. వారికి అనుకూలంగా ఉండే బోర్డ్ సిబ్బందితో కలిసి వ్యతిరేక కార్యకలాపాలు సాగించే వీలుందని ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో ప్రతీ పరీక్షకేంద్రం సమీపంలో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ ఫుటేజీని ఇంటర్‌బోర్డ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బయటవ్యక్తులతో సంబంధాలు పెట్టుకుంటున్న వారిపై ఇంటర్ బోర్డ్ నిఘా పెట్టింది.



క్షేత్రస్థాయిలోనూ సమీక్షిస్తున్నాం



ఎక్కడా ఆరోపణలకు తావివ్వకుండా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. క్షేత్రస్థాయిలో వాస్తవపరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షిస్తున్నాం. విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చేయడమే కాదు. పరీక్షకేంద్రాల్లో ఎలాంటి పక్షపాతానికి తావివ్వని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నాం. అన్నివర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. – జయప్రదాబాయి, ఇంటర్ పరీక్షల విభాగం కంట్రోలర్

ప్రతీ విద్యార్థి స్వేచ్ఛగా రాసేలా చర్యలు



ఇంటర్ పరీక్షలను మంచి వాతావరణంలో ప్రతీ విద్యార్థి రాయాలని కోరుకుంటున్నాం. ఈసారి తొలి దశలో కొన్ని పేపర్లకు ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడుతున్నాం. దీనిపై విమర్శలు చేసే శక్తుల ప్రమేయం పరీక్షలపై ఉండరాదని అధికారులను ఆదేశించాం.

– నవీన్ మిత్తల్, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి

'విదేశీ' వైద్య విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

- రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో చాన్స్
- జాతీయ మెడికల్ కమిషన్ ఆదేశాలు
- 3,833 మంది ఇంటర్న్‌షిప్ చేసుకునేలా కాలేజీల కేటాయింపు
- త్వరలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఎంబీబీఎస్, తత్సమాన మెడికల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు రాష్ట్రంలో కంపల్సరీ రొటేటింగ్ మెడికల్ ఇంటర్న్‌షిప్ (సీఆర్ఎంఐ) చేసుకునేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల వివరాలను పొందుపరిచింది. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామ్ (ఎఫ్ఎంజీఈ) పాసైన విద్యార్థులంతా రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్ చేసుకోవచ్చని తెలిపింది. ఏడాది ఇంటర్న్‌షిప్ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో వారికి స్టైపెండ్ కూడా ఇవ్వాలని ఎన్ఎంసీ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. త్వరలో ఇంటర్న్‌షిప్ కోసం ఎఫ్ఎంజీఈ పాసైన విదేశీ మెడికల్ గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని కాళోజీ వర్సిటీ తెలిపింది. ఎన్ఎంసీ ఆదేశాల మేరకు నడుచుకుంటామని వర్సిటీ వర్గాలు వెల్లడించాయి.

3,833 మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం..

కరోనా కాలంలోనూ, ఆ తర్వాత అనేకమంది విదేశీ ఎంబీబీఎస్ విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. కొందరు అక్కడకు వెళ్లి చదవగా, చాలామంది ఆన్‌లైన్ క్లాసుల ద్వారా మెడికల్ కోర్సు పూర్తి చేశారు. అలా విదేశీ వైద్య విద్య పూర్తి చేసినవారు తర్వాత దేశంలో మెడికల్ రిజిస్ట్రేషన్, ప్రాక్టీస్ కోసం ఎఫ్ఎంజీఈ పరీక్ష రాయాల్సి ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఎఫ్ఎంజీఈ పరీక్ష పాసైన వారు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంది. గతంలో విదేశీ గ్రాడ్యుయేట్ల కోసం కొన్ని కాలేజీల్లోనే ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉండగా, ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న 44 ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ఇంటర్న్‌షిప్ చేయడానికి వీలు కల్పించారు. ప్రస్తుతం ఆయా కాలేజీల్లో 3,833 మంది ఇంటర్న్‌షిప్ చేయవచ్చు. ఇప్పటివరకు ఎంబీబీఎస్ బ్యాచ్ బయటకు రాని మెడికల్ కాలేజీల్లో ఆయా కాలేజీలకు చెందినవారు ఇంటర్న్‌షిప్ దశకు చేరుకోనందున, అక్కడ పూర్తిస్థాయిలో విదేశీ గ్రాడ్యుయేట్లకు ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పించారు. సీట్ల సంఖ్యకు మించి కూడా కొన్నిచోట్ల ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా...

అన్నాడీఎంకే పగ్గాలు పళనిస్వామికే

న్యూఢిల్లీ: తమిళనాడులో అన్నాడీఎంకే పార్టీపై సర్వాధికారం మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామికే దఖలుపడింది. పార్టీకి ఆపద్ధర్మ ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని కొనసాగిస్తూ మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ గత ఏడాది సెప్టెంబర్‌లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. ఈ మేరకు ఈ జనవరి 12న రిజర్వ్‌చేసిన తీర్పును జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ హృషికేశ్ రాయ్‌ల సుప్రీంకోర్టు బెంచ్ గురువారం వెల్లడించింది. గత ఏడాది జూలై 11వ తేదీన జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో పార్టీ నియమావళికి సవరణలు చేస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త, సంయుక్త సమన్వయకర్త పోస్టులను రద్దుచేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ ఒ. పన్నీర్‌సెల్వమ్‌ను, ఆయన వర్గీయులు కొందరిని పార్టీ నుంచి తప్పించారు. ప్రధాన కార్యదర్శి పదవి సృష్టించి ఆ బాధ్యతలు పళనిస్వామికి అప్పజెప్పారు. ఈ తీర్మానానికి ముందువరకు సమన్వయకర్తగా పన్నీర్‌సెల్వం, సంయుక్త సమన్వయకర్తగా పళనిస్వామి ఉండేవారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగింపు, సర్వసభ్య సమావేశ తీర్మానాలపై పన్నీర్‌సెల్వం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా ఏకసభ్య జడ్జి జయచంద్రన్ జూన్ 23నాటి యథాతథస్థితి కొనసాగాలంటూ ఆగస్ట్ 17న ఉత్తర్వులిచ్చారు. దీనిని పళనిస్వామి వర్గం హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు సవాల్‌చేయగా సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దుచేస్తూ తీర్పు వచ్చింది. ఈ తీర్పును సవాల్‌చేస్తూ పన్నీర్‌సెల్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా గురువారం ఆయనకు చుక్కెదురైంది.


నోబెల్ శాంతి బహుమతికి 305 నామినేషన్లు

కోపెన్‌హగెన్: ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతికి నామినేషన్ల గడువు ఫిబ్రవరి ఒకటవ తేదీన ముగిసింది. ఈ ఏడాది 305 నామినేషన్లు వచ్చాయని నార్వేలోని నోబెల్ శాంతి బహుమతి ఎంపిక కమిటీ తెలియజేసింది. గతంతో పోలిస్తే ఈసారి తక్కువ నామినేషన్లు వచ్చాయి. గత ఎనిమిదేళ్లుగా ప్రతి సంవత్సరం 300 మందికిపైగానే నామినేట్ అవుతున్నారు. 2016లో మాత్రం 376 మంది నామినేట్ అయ్యారు. నోబెల్ శాంతి బహుమతి విజేత ఎంపిక ప్రక్రియను రహస్యంగా నిర్వహిస్తారు. ప్రముఖ వ్యక్తులు, అంతర్జాతీయ ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు నామినేషన్లు దాఖలు చేస్తుంటారు. ప్రముఖుల పేర్లను ఇతరులూ నామినేట్ చేయొచ్చు. 2021లో అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ పేర్లను ఇతరులు నామినేట్ చేశారు.

భూమికి ఐదో పొర!

తాజాగా కనిపెట్టిన శాస్త్రవేత్తలు ● ఘనపు లోహ గోళంలా ఉందని వెల్లడి

అశోక చక్రానికి కనిపించే మూడు సింహాలతో పాటు కనిపించని నాలుగో సింహమూ ఉన్నట్టుగా, భూమికి మనకిప్పటిదాకా తెలియని ఐదో పొర ఉందట! భూగర్భం తాలూకు మిస్టరీలను ఛేదించేందుకు తాజాగా చేపట్టిన ప్రయోగాల్లో ఈ విషయం యాదృచ్ఛికంగా వెలుగుచూసిందని సైంటిస్టులు చెబుతున్నారు. భూమికి నాలుగు పొరలుంటాయని మనకిప్పటిదాకా తెలుసు..



భూమి తాలూకు ఇన్నర్ కోర్ గుండా భూకంప తరంగాలు ఎంత వేగంతో చొచ్చుకుని సాగిపోతున్నాయో తెలుసుకునేందుకు ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు గత దశాబ్దకాలంగా పలు ప్రయోగాలు చేస్తున్నారు. వాటిలో భాగంగా రిక్టర్ స్కేల్‌పై ఆరుకు పైగా తీవ్రతతో కూడిన 200కు పైగా భూకంపాల తాలూకు గణాంకాలను వారు లోతుగా విశ్లేషిస్తున్నారు. చివరికి ఈ భూకంప తరంగాలు భూమి కేంద్రకం గుండా నేరుగా ప్రయాణిస్తున్నట్టు అంచనాకు వచ్చారు. ఇన్నర్ కోర్ తాలూకు అత్యంత లోతైన భాగాలకు సంబంధించి పలు కొత్త విషయాలు ఈ అధ్యయనం ద్వారా వెలుగుచూశాయి. మరింత సమాచారం కోసం ఆ తరంగాల ప్రయాణ సమయాల్లో మార్పులను పరిశోధకులు తాజాగా మరింత లోతుగా విశ్లేషించారు. ఈ క్రమంలో భూమికి ఇప్పటిదాకా మనకు తెలియని ఐదో పొర ఉందన్న విషయం బయట పడిందని చెబుతున్నారు! ఇది భూమి లోలోతుల్లో ఘనాకృతిలోని లోహపు గోళం మాదిరిగా ఉందని చెప్పారు. ఇన్నర్ కోర్ తాలూకు కేంద్ర స్థానంలో ఇమిడిపోయి ఉన్న ఈ పొరను ప్రస్తుతానికి 'అత్యంత లోపలి ఇన్నర్ కోర్'గా వ్యవహరిస్తున్నారు. దీనిపై మరిన్ని పరిశోధనలు చేస్తే భూ కేంద్రానికి సంబంధించి మనకెంతో ప్రయోజనకరమైన సమాచారం వెలుగుచూడొచ్చని చెబుతున్నారు. ఈ తాజా అధ్యయన ఫలితాలను జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించారు.

20 ఏళ్ల కిందే సూత్రీకరించినా..

నిజానికి భూమి లోలోతుల్లో ఇలాంటి ఒక లోహపు గోళం ఉందని 20 ఏళ్ల కిందే సైంటిస్టులు అంచనా వేశారు. బహుశా అది ఇన్నర్ కోర్ తాలూకు లోలోతుల్లో దాగుండవచ్చని సూత్రీకరించినట్టు ఏఎన్‌యూ తాలూకు రీసెర్చ్ స్కూల్ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌లో పని చేస్తున్న డాక్టర్ థాన్సన్ వివరించారు. ఇప్పుడు దానికి సంబంధించి తిరుగులేని రుజువులు లభించడం తమను ఆశ్చర్యానందాలకు లోను చేస్తోందన్నారు. మనకిప్పటి దాకా తెలిసిన భూమి తాలూకు నాలుగు పొరలు క్రస్ట్, మాంటెల్, ఔటర్ కోర్, ఇన్నర్ కోర్.

ఇలా వెలుగు చూసింది

భూకంపం సంభవించినప్పుడు దాని తరంగాలు భూ కేంద్రకం గుండా సరిగ్గా భూమి అవతలి వైపు దూసుకెళ్తాయి. అనంతరం వెనుదిరిగి భూకంప కేంద్రం వద్దకు ప్రయాణిస్తాయి. ఈ క్రమంలో అలస్కాలో సంభవించిన ఓ భూకంపాన్ని పరిశోధకుల బృందం అధ్యయనం చేసింది. దాని తాలూకు తరంగాలు దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రం గుండా భూమి అవతలి వైపునకు చొచ్చుకుపోయి తిరిగి అలస్కాలోని భూకంప కేంద్రం వద్దకు చేరుకున్నాయి. ఈ తరంగాల ప్రయాణ మార్గాన్ని లోతుగా పరిశీలించే క్రమంలో ఇన్నర్ కోర్‌లోని ఐదో లోహపు పొర ఉనికి తొలిసారిగా వెలుగు చూసిందని పరిశోధక బృందం తాజాగా వివరించింది. ''ఈ భూకంప తరంగాల ప్రయాణ ధోరణిని నిశితంగా గమనించాం. అవి దక్షిణ అట్లాంటిక్ మహాసముద్ర అంతర్భాగం నుంచి అలస్కా వైపు తిరిగొచ్చే క్రమంలో ఐదు చోట్ల నిర్దిష్ట ప్రతిస్పందనలు వెలువరిస్తూ ప్రయాణించినట్టు తేలింది. అలా ఐదో పొర ఉనికి బయట పడింది. ఇది వాస్తవమేనని పలు ఇతర భూకంపాల తాలూకు తరంగాల ప్రయాణ ధోరణులను పరిశీలించిన మీదట నిర్ధారణ అయింది' అని చెప్పుకొచ్చింది.

ఐదో పొర కూర్పు

ఇన్నర్ కోర్ లోతుల్లో ఉన్న ఐదో పొర ఇనుము–నికెల్ లోహ మిశ్రమంతో కూడి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి ఇన్నర్ కోర్‌లోని పదార్థాల గుండా భూకంప తరంగాలు ఎలా దూసుకెళ్తాయో, నెమ్మదిస్తాయో వివరంగా తెలుసుకునే అనిసోట్రోఫీ ఆధారంగా ఈ మేరకు నిర్ధారణకు వచ్చినట్టు వారు వివరించారు. 'ఈ తరంగాలు భూ కేంద్రం సమీపంలోని పలు ప్రాంతాలను భిన్న కోణాల్లో పదేపదే స్పృశించాయి. ఇన్నర్ కోర్ లోపలి ఘనాకృతి బయటి పొరతో పోలిస్తే భిన్నంగా ఉండొచ్చు. భూమి ఆవిర్భావ సమయంలో జరిగిన పరిణామాల వల్ల ఇన్నర్ కోర్‌లో ఈ ఘనాకృతి రూపుదిద్దుకుని ఉంటుంది' అని భావిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కాంగ్రెస్ నేత పవన్ ఖేడా అరెస్ట్

- ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దింపిమరీ అరెస్ట్ చేసిన అస్సాం పోలీసులు
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఖేడా
- మధ్యంతర బెయిల్ మంజూరు

గువాహటి/న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అస్సాంలో నమోదైన కేసులో ఆ రాష్ట్ర పోలీసులు కాంగ్రెస్ సీనియర్ నేత, పార్టీ మీడియా విభాగ చీఫ్ పవన్ ఖేడాను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమానం నుంచి దింపిమరీ అరెస్ట్‌చేశారు. దీంతో అదే విమానంలో ప్రయాణిస్తున్న సీనియర్ నేతలు రణ్‌దీప్ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌సహా కొందరు పార్టీ నేతలు విమానం నుంచి బయటికొచ్చి రన్‌వేపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఖేడా అరెస్ట్ వ్యవహారంతో కొద్దిసేపు రన్‌వేపై ఉద్రిక్తత నెలకొంది. అరెస్ట్ నేపథ్యంలో ఖేడా వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఆయనకు మధ్యంతర బెయిల్‌కు అనుమతిస్తూ ముగ్గురు జడ్జీల ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

అసలేం జరిగింది?

ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు వెళ్లేందుకు ఖేడా సిద్ధమయ్యారు. ఇందుకోసం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో విమానయాన సంస్థ విమానం ఎక్కారు. కొద్దిసేపట్లో విమానం టేకాఫ్ అవుతుందనగా విమానం సిబ్బంది ' లగేజీలో సమస్య ఉంది. పోలీసులు మీతో మాట్లాడాలనుకుంటున్నారు' అని ఖేడాకు సమాచారమిచ్చారు. కిందకు దిగిన ఆయనను ఢిల్లీ పోలీసులు సమీపించి అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. అందుకు ససేమిరా అంగీకరించని ఖేడా వెంటనే రన్‌వేపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఆ తర్వాత ఆయనను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని తర్వాత అస్సాం పోలీసులకు అప్పజెప్పారు. బుధవారం అస్సాంలోని హాఫ్లాంగ్‌లో బీజేపీ నేత శామ్యూల్ ఛాంగ్‌సన్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఆ రాష్ట్ర పోలీసులు ఖేడాను అరెస్ట్‌చేశారు. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ' ఈ వివాదంలో 17వ తేదీన ముంబైలో ఆయన ఇప్పటికే బేషరతు క్షమాపణలు చెప్పారు. అస్సాం, లక్నో, వారణాసిలలో నమోదైన వేర్వేరు కేసులను కలిపి ఒకే చోట విచారించాలి' అని ఖేడా తరఫు లాయర్ సింఘ్వీ సుప్రీంకోర్టును కోరారు. దీంతో 'ఖేడాకు ఈనెలాఖరు దాకా రక్షణ కల్పిస్తాం. మధ్యంతర బెయిల్ కోసం నేడు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచండి. అక్కడ మధ్యంతర బెయిల్ పొందండి' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు జడ్జీల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. అస్సాం, లక్నో, వారణాసిలో నమోదైన మూడు కేసులు కలిపి విచారించేందుకు మీ స్పందన తెలపాలంటూ అస్సాం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కేసు విచారణను 27వ తేదీకి వాయిదావేసింది. తర్వాత ఢిల్లీలోని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట పోలీసులు ఖేడాను హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ అర్చనా బనివాల్ ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చారు.

నియంతృత్వ పాలన ఇది: కాంగ్రెస్

'అరెస్టులతో మోదీ సర్కార్.. హిట్లర్–షాహీ పాలన స్థాయికి దేశ ప్రజాస్వామ్యాన్ని దిగజారుస్తోంది. నియంతృత్వ పోకడలను అడ్డుకోవాల్సిందే' అని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ట్వీట్‌చేశారు. కాంగ్రెస్ నేతలు చట్టానికి అతీతులమనే భావనలో గడిపేస్తున్నారని బీజేపీ ఎద్దేవా చేసింది.



రన్‌వేపై కూర్చుని ధర్నాకు దిగిన ఖేడా, పార్టీ నేతలు

సీఎం కేజ్రీవాల్ పీఏను ప్రశ్నించిన ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అవకతవకలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు(పీఏ) బిభవ్ కుమార్‌ను ప్రశ్నించింది. మనీ లాండరింగ్ ఆరోపణలపై అతడి వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. బిభవ్ తన మొబైల్ నంబర్ ఐఎంఈఐ(ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ)ని 2021 సెప్టెంబర్–2022 జూలై మధ్యలో నాలుగు సార్లు మార్చినట్లు కోర్టుకు సమర్పించిన చార్జిషీటులో పేర్కొంది. అయితే, ఈడీ ఆరోపణలను ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఖండించారు.

పంజాబ్‌లో రచ్చరచ్చ

- పోలీసులతో అమృత్‌పాల్ సింగ్ మద్దతుదారుల ఘర్షణ
- కత్తులు, తుపాకులతో పోలీసు స్టేషన్ వద్ద హల్‌చల్



పోలీసులపైకి దూసుకొస్తున్న దృశ్యం

అమృత్‌సర్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 'వారిస్ పంజాబ్ దే' గ్రూప్ అధినేత అమృత్ పాల్ సింగ్ మద్దతుదారులు గురువారం వీరంగం సృష్టించారు. అడ్డుగా ఉంచిన బారికేడ్లను తొలగించి పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. పోలీసులతో ఘర్షణకు దిగారు. ఓ కేసులో అమృత్‌పాల్ సింగ్ ప్రధాన అనుచరుడైన లవ్‌ప్రీత్ సింగ్ అలియాస్ లవ్‌ప్రీత్ తుఫాన్‌ను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ వందలాది మంది 'వారిస్ పంజాబ్ దే' సభ్యులు, మద్దతుదారులు కత్తులు, తుపాకులతో అమృత్‌సర్‌లో భారీ బల ప్రదర్శన చేపట్టారు. అమృత్‌సర్–జలంధర్ జాతీయ రహదారిని దిగ్బంధించారు. అజ్నాలా పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. చుట్టూ ఉన్న కంచెను ఛేదించుకొని ముందుకెళ్లారు. బారికేడ్లను తొలగించారు. పోలీసులను నిలదీశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అతికష్టం మీద పోలీసులు 'వారిస్ పంజాబ్ దే' సభ్యులను అడ్డుకోగలిగారు. రాజకీయ దురుద్దేశంతోనే తన అనుచరుడు లవ్‌ప్రీత్ సింగ్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారని అమృత్‌పాల్ ఆరోపించారు. కేసును వెనక్కి తీసుకోకపోతే జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. తాము చేతగాని వాళ్లం కాదని, అందుకే ఈ బలప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. గతంలో సామాజిక సేవ, మత ప్రచారం కోసం 'వారిస్ పంజాబ్ దే'ను ఏర్పాటుచేశారు.

హరిత ప్రగతి బాట

వెబినార్‌లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: పవన, సౌర, బయోగ్యాస్ వంటి పునరుత్పాదక ఇంధనాల తయారీకి భారత్‌లో ఉన్న అవకాశాలు బంగారు గని లేదా చమురు క్షేత్రం కంటే తక్కువేమీకాదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని, పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆయన ఆహ్వానించారు. హరిత ప్రగతిపై 2023–24 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన వివిధ అంశాలపై గురువారం నిర్వహించిన వెబినార్‌లో ప్రధాని ప్రసంగించారు. ఈ బడ్జెట్ కేవలం ఒక అవకాశం కాదని, భవిష్యత్తులో మన భద్రతకు హామీ ఇస్తుందని చెప్పారు. 2014 నుంచి పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ వేగంగా అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు.

గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ

దేశంలో 2014 తర్వాత ప్రవేశపెట్టిన అన్ని బడ్జెట్‌లు కొత్తతరం సంస్కరణలతో కూడుకున్నవేనని తెలియజేశారు. ఆధునిక యుగంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు కనిపెట్టే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. హరిత ప్రగతి, ఇంధన సరఫరాలో మూడు అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మొదటిది పునరుత్పాదక ఇంధనాల ఉత్పత్తి. రెండోది శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకోవడం, మూడోది గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా ముందుకు సాగడం. ఇథనాల్ బ్లెండింగ్, పీఎం కుసుమ్ యోజన, సౌర విద్యుత్ తయారీకి ప్రోత్సాహకాలు, రూఫ్‌టాప్ సోలార్ పథకం, బ్యాటరీ స్టోరేజీ వంటి వాటికి కొన్నేళ్లుగా బడ్జెట్లలో పెద్దపీట వేస్తున్నామని గుర్తుచేశారు.

గోబర్ధన్ యోజన కింద 500 కొత్త ప్లాంట్లు

పునరుత్పాదక ఇంధన వనరుల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను గడువు కంటే ముందే పూర్తి చేస్తున్నామని మోదీ హర్షం వ్యక్తం చేశారు. పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ కలపాలన్న లక్ష్యాన్ని ఐదు నెలల ముందే అధిగమించామని చెప్పారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని 2025–26 నాటికి చేరుకోబోతున్నామని పేర్కొన్నారు. దేశంలో మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 2030 నాటికి 500 గిగావాట్లకు చేరుకుంటుందని తెలిపారు. కొత్తగా 'ఈ20' ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. భారత్‌లో పంట వ్యర్థాలకు కొదవ లేదని, ఈ అవకాశం వదులుకోవద్దని దేశవ్యాప్తంగా ఇథనాల్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. 5 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కోసం నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ప్రారంభించామని, ఈ విషయంలో ప్రైవేట్ రంగానికి ప్రోత్సాహకాలు ఇవ్వడానికి రూ.19,000 కోట్లు కేటాయించామని వివరించారు. పేడ నుంచి గ్యాస్ ఉత్పత్తి కోసం గోబర్ధన్ యోజన కింద 500 కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించామని, ఈ ఆధునిక ప్లాంట్ల కోసం రూ.10,000 కోట్లు ఖర్చు చేయబోతున్నామని వెల్లడించారు.

బ్రిటన్ సూపర్‌మార్కెట్లలో పరిమితులు

లండన్: బ్రిటన్‌లోని ప్రముఖ సూపర్‌మార్కెట్ సంస్థలు కొన్ని పండ్లు, కూరగాయల కొనుగోళ్లపై పరిమితులు విధించాయి. అననుకూల వాతావరణ పరిస్థితులు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా సరఫరా కొరత తలెత్తింది. నెల రోజుల వరకు ఇవే పరిస్థితులు కొనసాగుతాయంటూ ప్రభుత్వం హెచ్చరించడంతో సూపర్ మార్కెట్ యాజమాన్యాలు ఈ చర్యను ప్రకటించాయి. టమాటాలు, క్యాప్సికం, దోసకాయలు, బ్రకోలి, క్యాలీఫ్లవర్ తదితరాల సరఫరా తక్కువగా ఉండటంతో వీటిని ఒక్కో వినియోగదారుకు మూడు వరకే విక్రయిస్తామని టెస్కో, అస్డా, మోరిసన్స్, ఆల్డి సంస్థలు తెలిపాయి. ఆఫ్రికా, యూరప్‌ల్లో ప్రతికూల వాతావరణం, ఇంధన ధరలు పెరగడం, బ్రిటన్, నెదర్లాండ్స్‌లో గ్రీన్‌హౌస్ వ్యవసాయంపై ఆంక్షలు కారణంగా పండ్లు, కూరగాయల దిగుబడి, రవాణాపై తీవ్ర ప్రభావం పడింది.

ఆరుగురు టీటీపీ ఉగ్రవాదులు హతం

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లో గురువారం పాక్ భద్రతా బలగాల దాడిలో ఆరుగురు తెహ్రీక్–ఇ–తాలిబన్(టీటీపీ) ఉగ్రవాదులు హతమయ్యారు. లక్కి మర్వాత్ జిల్లాలోని అబ్బాసా ఖట్టక్ పోలీస్ ఠాణాపై ఉగ్రమూకలు దాడికి పథకం వేశారనే సమాచారంతో బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. వారి నుంచి గ్రెనేడ్లు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. టీటీపీని పాక్ ప్రభుత్వం నిషేధించింది. గత నెలలో టీటీపీ జరిపిన ఆత్మాహుతి దాడిలో 100 మందికి పైగా మృతి చెందారు.

ఈడీ సప్లిమెంటరీ చార్జిషీట్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంపై ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పై విచారణను ప్రత్యేక కోర్టు మార్చి 17వ తేదీకి వాయిదా వేసింది. రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగ్‌పాల్ గురువారం ఈడీ సప్లిమెంటరీ చార్జిషీట్‌పై విచారణ చేపట్టారు. ఈడీ తరఫు న్యాయవాది నవీన్ కుమార్ వాదనలు వినిపించారు. ఆధారాలు ధ్వంసం చేయడానికి యత్నించారని ఆరోపించారు. ఈడీ చార్జిషీట్‌లోని అంశాలు నమ్మశక్యంగా లేవని నిందితుల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. వాదనల అనంతరం తదుపరి విచారణ మార్చి 17కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

గని ప్రమాదంలో 48 మంది గల్లంతు

బీజింగ్: చైనాలోనిఇన్నర్ మంగోలియా ప్రాంతంలోని అల్‌గ్జా లీగ్ గని కూలిన ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో 48 మంది జాడ తెలియాల్సి ఉందని చైనా అధికార వార్తాసంస్థ గురువారం తెలిపింది. భారీగా మట్టిచరియలు విరిగిపడటంతో బుధవారం ఆగిపోయిన సహాయక చర్యలను గురువారం తిరిగి ప్రారంభించారు. ఇప్పటివరకు ఐదుగురు చనిపోయినట్లు ధ్రువీకరించారు. గాయపడిన ఆరుగురిని ఆస్పత్రికి తరలించారు. 48 మంది జాడ గుర్తించాల్సి ఉంది. ఇటీవలికాలంలో చైనాలో గని ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. గత ఏడాది జరిగిన 367 గని ప్రమాద ఘటనల్లో 518 మంది చనిపోయినట్లు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం వెల్లడించింది.

సరిహద్దు మార్గాన్ని తెరిచిన తాలిబన్లు

పెషావర్: అఫ్గానిస్తాన్–పాకిస్తాన్ సరిహద్దుల్లోని కీలకమైన తోర్ఖామ్ మార్గాన్ని తాలిబన్ పాలకులు గురువారం తెరిచారు. వైద్యం, ఇతర అత్యవసరాల నిమిత్తం సరిహద్దులు దాటి వచ్చే వారికి పాకిస్తాన్ యంత్రాంగం అవసరమైన తోడ్పాటు ఇవ్వడం లేదంటూ తాలిబన్లు ఆదివారం తోర్ఖామ్ మార్గాన్ని మూసివేశారు. పాకిస్తాన్– మధ్య ఆసియా దేశాలకు ముఖ్యమైన సరఫరా మార్గం ఇదే. ఇది మూసుకుపోవడంతో పాకిస్తాన్ హుటాహుటిన ఉన్నత స్థాయి బృందాన్ని కాబూల్‌కు పంపించింది. డిమాండ్లను నెరవేర్చేందుకు అంగీకరించడంతో తాలిబన్లు శాంతించారు. అధికారుల సూచనలతో సరిహద్దులు తెరుచుకున్నాయి. దీంతో, అఫ్గాన్ ప్రజల కోసం ఆహార పదార్థాలు, తదితర అత్యవసరాలతో సరిహద్దుల్లో నిలిచిపోయిన వందలాది ట్రక్కులు ఖైబర్ పాస్ గుండా ముందుకుసాగాయి.



సాల్ట్‌లేక్ సిటీలో కారుపై మంచును తొలగిస్తున్న మహిళ

అమెరికాలో భీకర మంచు తుపాను

పియెర్రె: అమెరికాను భీకర మంచు తుపాను వణికిస్తోంది. రోడ్లపై మంచు పేరుకుపోవడంతో ఎక్కడి వాహనాలక్కడే నిలిచిపోయాయి. వందలాది నివాసాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. విమాన సర్వీసులు రద్దయ్యాయి. స్కూళ్లు మూతబడ్డాయి. వాతావరణ విభాగం 1989 తర్వాత మొదటిసారిగా మంచు తుపాను(బ్లిజ్జార్డ్) హెచ్చరికలను జారీ చేసింది. కొన్ని తీర ప్రాంతాల్లో అలలు 3 నుంచి 4.3 మీటర్ల ఎత్తున ఎగిసిపడుతున్నాయి. తుపాను తీవ్రత దృష్ట్యా సుమారు 24 రాష్ట్రాల్లోని 6.5 కోట్ల మంది ప్రజలకు వాతావరణ హెచ్చరికలు జారీ చేశారు. వ్యోమింగ్, ఆరిజోనా, న్యూ మెక్సికో, పోర్ట్‌ల్యాండ్, ఓరెగాన్ పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మిషిగన్, ఇలినాయీ, కాలిఫోర్నియాల్లో విద్యుత్ లైన్లు తెగిపోవడంతో జనం రాత్రిళ్లు చీకట్లోనే గడిపారు. మంచు, చలిగాలులతో కాలిఫోర్నియా, సియెర్రా నెవడాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సుమారు 1,800 విమాన సర్వీసులు రద్దు కాగా, మరో 6 వేలకు పైగా సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇలా ఉండగా, మరికొన్ని రాష్ట్రాల్లో ఇందుకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. నాష్‌విల్లేలో బుధవారం అత్యధికంగా 26.67 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదై 127 ఏళ్ల రికార్డు బద్దలైందని అధికారులు చెప్పారు. ఇండియానా పొలిస్, సిన్సినాటి, అట్లాంటా, లెక్సింగ్టన్, కెంటకీ, అలబామాల్లోనూ ఇదే స్థాయిలో ఎండలున్నాయి.

ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా అజయ్ బంగా!



వాషింగ్టన్: ప్రపంచ బ్యాంకు సారథిగా భారత్–అమెరికన్ అజయ్ బంగా పేరును నామినేట్ చేసిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ప్రపంచ బ్యాంక్‌ను సమర్థంగా ముందుకు నడిపించగల సత్తా అజయ్ బంగాకు ఉందని ప్రశంసించారు. ప్రపంచ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదిస్తే అత్యంత ప్రతిష్టాత్మక పదవికి అజయ్ బంగా ఎంపికైనట్లే. అదే జరిగితే ఆయన ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి భారత్–అమెరికన్‌గా, తొలి సిక్కు–అమెరికన్‌గా రికార్డు సృష్టిస్తారు. 62 ఏళ్ల బంగా జనరల్ అట్లాంటిక్ వైస్–చైర్మన్‌గా పనిచేస్తున్నారు. గతంలో మాస్టర్‌కార్డ్ అధ్యక్షుడు, సీఈఓగా సేవలందించారు. 2016లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. అమెరికాలో ప్రఖ్యాత పురస్కారాలు స్వీకరించారు.

నేటి నుంచే కాంగ్రెస్ మేధో మథనం!

- ఎన్నికల రోడ్‌మ్యాప్‌పై సమీక్ష
- రాయ్‌పూర్‌లో ప్లీనరీకి ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న 15,000 మంది ప్రతినిధులు

రాయ్‌పూర్: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ప్లీనరీ జరగనుంది. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం రోడ్‌మ్యాప్ ఖరారు చేయడంతోపాటు అధికార బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా భావసారూప్యత ఉన్న పార్టీలతో పొత్తులపై మేధో మథనం నిర్వహించనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు పార్టీ అగ్రనేతలు ప్లీనరీకి హాజరవుతారు. దాదాపు 15,000 మంది ప్రతినిధులు పాల్గొంటారని అంచనా.

సీడబ్ల్యూసీకి ఎన్నికలు?

ప్లీనరీలో మొదటి రోజు పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక విభాగమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ)కి ఎన్నికలు నిర్వహించాలో లేదో స్టీరింగ్ కమిటీ నిర్ణయించనుంది. ఈ ఏడాది దేశంలో ఎనిమిది రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. మధ్యప్రదేశ్, కర్ణాటకలో ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఢీకొట్టాలంటే మెజార్టీ రాష్ట్రాల్లో పాగా వేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ప్లీనరీలో విస్తృతంగా చర్చించబోతున్నారు. గెలుపు వ్యూహాలపై పార్టీ నేతలకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. ఎన్నికల సన్నద్ధతతోపాటు పార్టీలో అంతర్గత విభేదాల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరిస్తారు. అలాగే భావసారుప్యం కలిగిన పార్టీతో పొత్తులపై ప్లీనరీలో కొంత స్పష్టత రానుంది. సీడబ్ల్యూసీలో మొత్తం 25 మంది సభ్యులు ఉంటారు. కాంగ్రెస్ రాజ్యాంగం ప్రకారం పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్ష నేత సీడబ్ల్యూసీలో సభ్యులవుతారు. 12 మందిని ఎన్నుకుంటారు. మరో 11 మందిని నామినేట్ చేస్తారు. సీడబ్ల్యూసీకి చివరిసారిగా 1997లో కోల్‌కతాలో సీతారాం కేసరి అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు.

ఉద్యోగకల్పనలో బీజేపీ మాటలు ఉత్తవే..



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న రాంజీ గౌతమ్, ప్రవీణ్‌కుమార్

కరీంనగర్ కల్చరల్: కేంద్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని రాజ్యసభ ఎంపీ, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రాంజీ గౌతమ్ విమర్శించారు. ఉద్యోగాలకల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, దేశవ్యాప్తంగా పది లక్షలకుపైగా బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో దళితులపై దాడులు జరుగుతున్నాయని, మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగాయన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బీసీ కులగణన చేసి, బీసీల రిజర్వేషన్లు పెంచాలని బీఎస్పీ ఆధ్వర్యంలో రెండు నెలలుగా ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేవలం సెక్రటేరియట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టడం లేదా ట్యాంక్ బండ్ మీద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినంత మాత్రాన ఇక్కడి పేదలు సంతోషకరమైన జీవితాన్ని గడపలేరని పేర్కొన్నారు. అంబేడ్కర్, పూలే, సాహు మహరాజ్ ఆశయాలను నెరవేర్చే ఏకైక పార్టీ బీఎస్పీ అని గుర్తు చేశారు.

ఏన్కూరులో ఎల్లో చిల్లీ!

ఏళ్ల తరబడి మనం ఆకుపచ్చ రంగులో ఉండే పచ్చిమిర్చిని, ఎర్ర రంగులో ఉండే ఎండుమిర్చిని చూస్తున్నాం.. వంటల్లో వాడుతున్నాం.. కానీ పసుపు రంగు మిర్చిని ఎప్పుడైనా చూశారా? కూరగాయలు అమ్మే కొన్ని పెద్ద దుకాణాల్లో పసుపు రంగులో ఉండే క్యాప్సికం (బెంగళూరు మిర్చి) కన్పిస్తుంది. కానీ ఎల్లో మిర్చి కనబడదనే చెప్పాలి. అయితే ఖమ్మం జిల్లాలో ఓ రైతు మాత్రం ఈ వెరైటీ మిరపను సాగు చేస్తున్నాడు. దీని దిగుబడి, ధర ఆశాజనకంగా ఉందని ఆయన చెబుతున్నాడు.



మిరపతోటలోని పసుపురంగు కాయలు

పసుపు రంగు మిర్చి సాగు చేస్తున్న జన్నారం రైతు

- తెగుళ్ల బెడద తక్కువ..దిగుబడి ఎక్కువ
- ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం
- మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్న వెరైటీ మిరప

ఏన్కూరు: ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన రైతు కొండపల్లి నరేష్ ఓ రోజు యూట్యూబ్‌లో సాధారణ మిర్చి సాగుకు సంబంధించిన వీడియోలు చూస్తున్నాడు. ఈ క్రమంలోనే ఒకచోట పసుపు రంగులో ఉన్న మిర్చి అతని దృష్టిని ఆకర్షించింది. ఒకింత లోతుగా పరిశీలించే సరికి కొన్నిచోట్ల ఈ పసుపు రంగు మిరప పంటను సాగు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో వివరాలు ఆరా తీశాడు. వరంగల్, గుంటూరు వ్యాపారులు ఈ రకం మిర్చిని కొనుగోలు చేస్తారని తెలిసింది. గతేడాది క్వింటాల్‌కు రూ.65 వేల వరకు ధర పలికిందని కూడా తెలుసుకున్నాడు. దీంతో వరంగల్ వ్యాపారులను సంప్రదించాడు. వారి నుంచి మరిన్ని వివరాలు రాబట్టడమే కాకుండా వారి వద్దే ఎల్లో మిర్చి విత్తనాలు కొనుగోలు చేశాడు. తన ఎకరం పది కుంటల భూమిలో పంట వేశాడు. సాధారణ మిర్చి పంటలాగే సాగు పద్ధతులు అవలంబించగా రూ.లక్ష వరకు పెట్టుబడి ఖర్చు అయింది. తాజాగా తొలి తీతలో ఐదు క్వింటాళ్ల దిగుబడి రాగా ఇంకా ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల వరకు దిగుబడికి అవకాశముందని నరేష్ చెబుతున్నాడు. ఈ రకం మిర్చికి తెగుళ్ల బెడద తక్కువేనని.. సాధారణ మిర్చితో పోలిస్తే 50 శాతం తక్కువ వైరస్‌లు సోకుతాయని చెప్పాడు. నల్లి ప్రభావం తక్కువగా ఉండగా, తెల్లదోమ మాత్రం కాస్త సోకిందని తెలిపాడు.

మందులు, రంగులు, చిప్స్‌లో..



పసుపు రంగు మిర్చి సాగు ఆశాజనకంగా ఉంది. గత ఏడాది క్వింటాల్‌కు రూ.65 వేల ధర పలకగా ఇప్పుడు రూ.35 వేల నుంచి రూ.40 వేల మధ్యే ఉంది. ధర పెరిగేవరకు ఆగుదామని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా. ఈ మిర్చిని మందులు, రంగుల తయారీతో పాటు బ్రాండెడ్ కంపెనీల చిప్స్ తయారీలో ఉపయోగిస్తారు.

– కొండపల్లి నరేష్, రైతు

ఎల్లో మిర్చికి మంచి డిమాండ్ ఉంది



ఖమ్మం జిల్లాలో పసుపు రంగు మిర్చి సాగు ఇటీవలే మా దృష్టికి వచ్చింది. మార్కెట్‌లో ఈ రంగు మిర్చికి డిమాండ్ ఉంది. ఎకరానికి 12 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. రైతులు పంట మార్పిడి చేయడం వల్ల దిగుబడులు పెరుగుతాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఈ పంట సాగుపై వివరాలు సేకరిస్తున్నాం.

– పి.అపర్ణ, వైరా నియోజకవర్గ ఉద్యానవన అధికారి

సరికొత్త విద్యావిధానంవైపే ప్రపంచం

- 'బోధన ప్రణాళిక, అభివృద్ధి ప్రాజెక్ట్' సెమినార్‌లో వక్తలు

సాక్షి, హైదరాబాద్: నైపుణ్యం, సామాజిక అవగాహనతో కూడిన ఉన్నత విద్యావిధానం వైపు యావత్ ప్రపంచం వెళ్తోందని బోధన ప్రణాళిక, అభివృద్ధి ప్రాజెక్టుపై జరిగిన సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. సెస్‌లో రెండు రోజులపాటు జరిగిన ఈ సెమినార్ గురువారం ముగిసింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలితో కలిసి దక్షిణ బ్రిటీష్ కౌన్సిల్, అబెరిస్ట్విత్, బంగోర్ యూనివర్సిటీలు ఈ సదస్సుకు ముఖ్యభూమిక పోషించారు. హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, పొలిటికల్ సైన్స్ కోర్సుల్లో నైపుణ్యం, ఉపాధికి అనువైన బోధన ప్రణాళికతో ఉస్మానియా, కాకతీయ వర్సిటీల్లో అందించే ప్రక్రియకు తోడ్పాటునివ్వాలని నిర్ణయించాయి. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ప్రతినిధులు సుదీర్ఘ చర్చలు జరిపారు. నైపుణ్య విధానం, ఉపాధి అవకాశాల నైపుణ్యాలపై సవివరంగా చర్చించారు. విద్య కేవలం ఉపాధి అవకాశాలు కల్పించేది మాత్రమే కాకూడదని, అనుభవం, అవగాహన, వ్యక్తిత్వవికాసం పెంపొందించేలా ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు. చదువుకున్న వ్యక్తి ఏదో ఒక ఉద్యోగం సంపాదించడం మాత్రం అభివృద్ధిగా చూడకూడదని, రాజకీయ, ఆర్థిక, పరిశోధనల వైపు మళ్లించడం కూడా అవసరమని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. ఈ దిశగా విద్యావిధానంలో మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

విద్యార్థులూ.. ఆత్మహత్యలు వద్దు

- ఏ పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ఉండాలి
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచన
- ఆత్మహత్యాయత్నం చేసిన వైద్య విద్యార్థినికి పరామర్శ



నిమ్స్‌లో ప్రీతి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్/లక్డీకాపూల్: ఏ సందర్భంలోనైనా విద్యార్థులు ధైర్యంగా ఉండాలని.. ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. సీనియర్ వేధింపులకు గురిచేశాడంటూ ఆత్మహత్యాయత్నం చేసి ప్రస్తుతం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వరంగల్ ఎంజీఎం పీజీ వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతిని, ఆమె కుటుంబసభ్యుల్ని గవర్నర్ గురువారం పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ ఇది చాలా సున్నితమైన అంశమని, దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలన్నారు. ఒక వైద్య విద్యార్థినికి ఇలా జరగడం దురదృష్టకరమన్నారు. బాధితురాలిని కాపాడేందుకు అన్ని రకాల వైద్య సహాయం అందించాలని వైద్యుల్ని కోరినట్లు గవర్నర్ చెప్పారు.

బాధ్యులెవరైనా వదలం: డీఎంఈ

వైద్యవిద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఉదంతంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతోందని, బాధ్యులు ఎవరైనా వదిలేది లేదని రాష్ట్ర వైద్య, విద్య సంచాలకుడు రమేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రీతి పరిస్థితిని తెలుసుకోవడానికి ఆయన గురువారం నిమ్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీతి పరిస్థితి విషమంగానే ఉందన్నారు. ఆత్మహత్యాయత్నానికి ఆమె ఇంజక్షన్ తీసుకోవడమే కారణమనే విషయాన్ని అప్పుడే నిర్ధారించలేమని, దానికి సంబంధించిన ఆనవాళ్లేవీ వైద్యులు ఇప్పటిదాకా గుర్తించలేదన్నారు. ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణం ర్యాగింగ్ కాదని, పీజీ స్థాయిలో అప్పటికే వైద్యులుగా ఉన్న పరిస్థితిలో ర్యాగింగ్ ఉండదన్నారు.

హోంమంత్రి బంధువనే చర్యలు తీసుకోలేదా?: విపక్షాలు

పంజగుట్ట: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధరావత్ ప్రీతి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు పలు పార్టీలు, సంఘాల నాయకులు గురువారం నిమ్స్ ఆసుపత్రికి వచ్చారు. మాజీ మంత్రి రవీంద్రనాయక్, టీడీపీ నాయకురాలు జ్యోత్స్న, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు వెంకట్ బంజారా, బీజేపీ మహిళా మోర్చా నాయకులు, సామాజిక కార్యకర్త ఇందిరా శోభన్ వచ్చి డాక్టర్ ప్రీతి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ హోంమంత్రి బంధువైనందుకే ప్రీతిని వేధించిన సీనియర్ విద్యార్థి సైఫ్‌పై చర్యలు తీసుకొనేందుకు పోలీసులు వెనుకంజ వేస్తున్నారా? అని ప్రశ్నించారు.

శత్రుదేశంపై దండయాత్రలాగా..

▶ మొదటి పేజీ తరువాయి

పేలిపోయిన మోటార్లు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, పాము కాట్లు, విద్యుత్ షాక్‌తో రైతులు మృతి చెందిన సంఘటనలు ఎన్నో చూశాం. మనిషి చచ్చిపోతే దహనం అనంతరం స్నానం చేసేందుకు కరెంటు సరఫరా కోసం బతిమిలాడే పరిస్థితి ఉండేది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో గరిష్టంగా 13,662 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా.. ఇప్పుడు ఒక్క తెలంగాణలోనే 14,700 మెగావాట్ల డిమాండ్ ఉందంటే రాష్ట్రం ఏమేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు..' అని మంత్రి అన్నారు.



మిషన్ భగీరథ నల్లాను ప్రారంభిస్తున్న కేటీఆర్. చిత్రంలో ఎర్రబెల్లి తదితరులు

మాది వసుధైక కుటుంబ పాలన.. : 'రాజస్తాన్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. అక్కడ బీజేపీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణలో రాజ్యాంగ బద్ధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీని టీఆర్‌ఎస్‌లో విలీనం చేస్తే రకరకాల మాటలు మాట్లాడతారా? మీరు చేస్తే సంసారం.. మేము చేస్తే వ్యభిచారమా?. ప్రజల మనసులను గెలవాలంటే ఏం చేశామో, ఏం చేస్తామో చెప్పాలే తప్ప ఇష్టమొచ్చినట్లు మాట్లాడకూడదు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రతి ఒక్కరికీ కావాల్సిన పథకాలు అందిస్తూ ఒక మామలా, అన్నలా, పెద్ద కొడుకులా, తాతలా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలోని 4 కోట్ల మందీ కేసీఆర్ కుటుంబమే. మాది వసుధైక కుటుంబ పాలన..'అని చెప్పారు.

పార్టీ పేరు మాత్రమే మారింది..: 'ఎన్నికల యుద్ధానికి యువత సిద్ధం కావాలి. పార్టీ పేరు మాత్రమే మారింది. డీఎన్‌ఏ రంగు, గుర్తు కూడా అలాగే ఉంది. వ్యవసాయం, విద్యుత్, విద్య, వైద్య రంగాల్లో తెలంగాణ మాదిరిగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీ పెట్టారు. నిన్న, మొన్న వచ్చిన కొంతమంది చిల్లరగాళ్లు ఏవేవో మాట్లాడుతున్నారు. వాళ్లకు కుక్క కాటుకు చెప్పు దెబ్బలాగా సమాధానం ఇవ్వాలి. ఆ పార్టీలు పిచ్చోళ్ల చేతిలో ఉంటే తెలంగాణ ఆగమైతది. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? మీకు పదవులు వచ్చేవా?'అని కేటీఆర్ ప్రశ్నించారు. సభలో మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జి.జగదీశ్‌రెడ్డి, ఎంపీ దయాకర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విషమంగానే ప్రీతి ఆరోగ్యం

▶ మొదటి పేజీ తరువాయి



డాక్టర్ సైఫ్

చేస్తున్నామని నిమ్స్ వైద్యులు వివరించారు. అన్ని విభాగాలకు చెందిన వైద్య నిపుణుల బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని తెలిపారు. ఈమేరకు గురువారం రాత్రి విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు. సీనియర్ విద్యార్థి చేతిలో వేధింపులకు గురైన ప్రీతి బుధవారం ఎంజీఎం ఆస్పత్రిలో ఇంజక్షన్ వేసుకుని ఆత్మహత్యకు యత్నించిన సంగతి తెలిసిందే.

పోలీసుల అదుపులో సైఫ్?

ప్రీతి తండ్రి నరేందర్ నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు, సీనియర్ విద్యార్థి డాక్టర్ సైఫ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సైఫ్‌పై ర్యాగింగ్, వేధింపులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు. వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఏసీపీ బోనాల కిషన్ గురువారం కేఎంసీ, ఎంజీఎంలో విచారణ జరిపారు. ప్రీతి, సైఫ్‌ల సెల్‌ఫోన్‌లను సీజ్ చేసిన పోలీసులు.. కాల్‌డేటా ఆధారంగా కూడా విచారిస్తున్నారు. అదేవిధంగా ప్రీతి ఆత్మహత్యాయత్నానికి సైఫ్ వేధింపులే కారణమా..? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో కూడా ఆరా తీశారు. మరోవైపు, ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యులతో కూడిన త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ప్రీతి సహచర విద్యార్థులు, అనస్థీషియా విభాగ వైద్యులతో మాట్లాడి ప్రాథమిక నివేదిక తయారుచేసింది. ఈ నివేదికను శుక్రవారం డీఎంఈకి పంపనున్నట్లు ఎంజీఎం పరిపాలనాధికారులు పేర్కొన్నారు. కాగా, ప్రీతి, సైఫ్ ఇద్దరి కుటుంబాలదీ రైల్వే బ్యాక్ గ్రౌండే కావడం గమనార్హం. ప్రీతి తండ్రి ధరావత్ నరేందర్ నాయక్ వరంగల్ రైల్వే ప్రొటెక్షన్స్ ఫోర్స్‌లో ఏఎస్‌ఐగా పని చేస్తుండగా, సైఫ్ తండ్రి సలీం కాజీపేటలో రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో పని చేస్తున్నారు.

సరస్వతీ పుత్రిక.. ప్రీతి

ఎంజీఎం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ప్రీతి సరస్వతీ పుత్రిక అని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు చెబుతున్నారు. ఎస్ఎస్‌సీలో 600కు గాను 526 మార్కులు సాధించింది. ఇంటర్‌లో వెయ్యి మార్కులకు 970 సాధించింది. ఎంసెట్ ఎంట్రన్స్‌లో 5 వేల ర్యాంకు సాధించి కామినేని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. 2013లో వైద్యవిద్యను ప్రారంభించి 2019లో పూర్తి చేసింది. పీజీ ఎంట్రన్స్‌లో ఆలిండియా 1161 ర్యాంకు సాధించి కేఎంసీలో అనస్థీషియా విభాగంలో అడ్మిషన్ పొందింది. అన్ని స్థాయిల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తూ వస్తున్న ప్రీతి ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు తలొగ్గేది కాదని, వైద్యవిద్య అంటే ఆమెకు ఇష్టమని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

ప్రీతి ఘటనలో దోషుల్ని వదలం

- విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండ
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్/ఎంజీఎం/సుల్తాన్‌బజార్(హైదరాబాద్): వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నంపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపడుతుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రీతికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించినట్టు తెలిపారు. ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రీతి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడినట్టు.. వైద్యులను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ ప్రీతి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నట్టు వివరించారు.

ఘటనపై ఢిల్లీ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆరా: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నానికి సీనియర్ విద్యార్థి వేధింపులే కారణమని పత్రికల ద్వారా తెలుసుకున్న ఢిల్లీలోని యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు స్పందించారు. ఘటన వివరాలను వెంటనే తెలపాలంటూ కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్‌ను ఆదేశించారు. దీంతో కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ అధ్యక్షతన శుక్రవారం కాకతీయ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు.

సీనియర్ విద్యార్థిపై చర్యకు డిమాండ్: పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సీనియర్ విద్యార్థిపై ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నేత తమ్మినేని డిమాండ్ చేశారు. అలాగే, సైఫ్ వేధిస్తున్నాడని ప్రీతి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమని ఏబీవీపీ వర్కింగ్ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి వేరొక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏబీవీపీ ధర్నా.. నేతల అరెస్టు: వరంగల్ కాకతీయ వైద్య కళాశాల పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు గురువారం కోఠిలోని వైద్య విద్య సంచాలకుని కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ పోలీసులు, విద్యార్థుల మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారి తీసింది. దీంతో ఉభయులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ బాలగంగిరెడ్డి ఏబీవీపీ నేతలను అరెస్టు చేసి సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

జీవో 69 ఇక చెల్లుబాటు కాదు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల ఆపరేషనల్ ప్రోటోకాల్ ప్రకటిస్తూ 1996లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో 69 ఇకపై చెల్లుబాటు కాదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో మారిన తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టుల నీటి అవసరాలకు కొత్త ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌ను ట్రిబ్యునల్ రూపొందించాల్సి ఉంటుందని పేర్కొంది. రెండు రాష్ట్రాలకు జరిపే తుది నీటికేటాయింపుల ఆధారంగా వీటిని తయారు చేయాలని తెలిపింది. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట శుక్రవారం జరిగిన వాదనల్లో తెలంగాణ తరఫున సాక్షిగా ఉన్న కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ చేతన్ పండిట్ ఏపీ తరఫు న్యాయవాది అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కృష్ణాబోర్డు రూపొందించిన ముసాయిదా రూల్ కర్వ్ ఆధారంగా ఆపరేషనల్ ప్రోటోకాల్ తయారు చేయరాదని తెలంగాణ పేర్కొంది.

'ధరణి' దంగల్!

▶ మొదటి పేజీ తరువాయి

మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ప్రస్తావిస్తూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు చేసిన వ్యాఖ్యలు ఈ ఆందోళనను మరింత తీవ్రతరం చేశాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఏం చేయాలి? అన్న దానిపై రెవెన్యూ వర్గాల్లో తర్జన భర్జన జరుగుతోంది.

నిర్ణయం కలెక్టర్‌ది.. సంతకం తహసీల్దార్‌ది

ధరణి పోర్టల్‌లో వివరాల నమోదులో తప్పులతో లక్షల కొద్దీ భూసంబంధిత సమస్యలు తలెత్తాయి. వాటి పరిష్కారం కోసం రైతులు ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే.. అది నేరుగా జిల్లా కలెక్టర్/ కలెక్టర్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ లాగిన్‌కు వెళుతుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఈ దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే తహసీల్దార్‌కు పంపుతుంది. తహసీల్దార్లు దానిపై విచారణ జరిపి.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రెండు నివేదికలు తయారుచేసి ఆర్డీవో కార్యాలయానికి పంపుతారు. ఆర్డీవో కార్యాలయంలో పరిశీలన తర్వాత దరఖాస్తులు ఆన్‌లైన్‌లోనే తిరిగి కలెక్టర్ లాగిన్‌కు చేరుతాయి. తహసీల్దార్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా, ఆర్డీవో అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ దరఖాస్తును అంగీకరించాలా లేదా తిరస్కరించాలా అన్న దానిపై కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారు. అయితే ఈ నిర్ణయం తీసుకునే సమయంలో కేవలం బయోమెట్రిక్, డిజిటల్ కీ మాత్రమే కలెక్టర్‌ది వాడుతున్నారు. నిర్ణయం తీసుకున్న తర్వాత ఎలాంటి ప్రొసీడింగ్స్ రావడం లేదు. కేవలం కలెక్టర్లు ఆమోదించినదీ, తిరస్కరించినదీ మాత్రమే ఆన్‌లైన్‌లో కనిపిస్తుంది. ఈ ఆన్‌లైన్ ధ్రువీకరణపై తహసీల్దార్ డిజిటల్ సంతకం వస్తోంది. ఇక్కడ సమస్య ఏమిటంటే.. తహసీల్దార్ విచారణ పూర్తయి నివేదిక పంపాక కూడా పలు దరఖాస్తుల విషయంలో జిల్లాల కలెక్టర్లపై వివిధ ఒత్తిడులు వస్తున్నాయి. దీంతో తహసీల్దార్ల నివేదిక ఎలా ఉన్నా కలెక్టర్లు ధ్రువీకరిస్తున్నారు. మొత్తం దరఖాస్తుల్లో 20 శాతానికిపైగా దరఖాస్తుల్లో తహసీల్దార్ల అభిప్రాయానికి, నివేదికకు భిన్నంగా కలెక్టర్లు నిర్ణయాలు తీసుకుంటున్నట్టు అంచనా.

ఏదైనా సమస్య వస్తే బాధ్యులెవరు?: తమ అభిప్రాయాలకు భిన్నంగా జారీ అయ్యే ధరణి ఉత్తర్వులపై.. తమ డిజిటల్ సంతకాలే ఉండటంపై తహసీల్దార్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. రాజకీయ, ఇతర కారణాలతో భూముల ఉత్తర్వులపై ఫిర్యాదులు వస్తే.. ఆ నిర్ణయాలపై తమ సంతకాలు ఉంటాయని, తాము కూడా బాధ్యులం కావాల్సి వస్తుందని తహసీల్దార్లు వాపోతున్నారు. కలెక్టర్లతోపాటు తాము కూడా బదిలీ కావడమో, విచారణ ఎదుర్కోవాల్సి రావడమో జరిగితే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఏదైనా భూసమస్య కోర్టుకు వెళితే అక్కడ తాము సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని అంటున్నారు. ఈ క్రమంలో ధరణి ఉత్తర్వులపై జిల్లా కలెక్టర్ల సంతకాలే ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ చట్టాల ప్రకారం సంతకంతో సమస్యలు పరిష్కరించే అధికారం కలెక్టర్లకు లేనందున.. భూసమస్యల పరిష్కార అధికారం తమకే ఇవ్వాలని, అప్పుడు తాము బాధ్యత వహిస్తామని అంటున్నారు.

ట్రెసాపై ఒత్తిడి: 'ధరణి'సంతకాల విషయమై వారం, పది రోజులుగా రెవెన్యూ వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి. దీనిపై ప్రభుత్వం స్పందించే పరిస్థితి లేకుంటే హైకోర్టులో పిల్ దాఖలు చేయాలని, లేదంటే కొందరు తహసీల్దార్లు కలిసి పిటిషన్ వేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోర్టుకు వెళ్లడం కుదరకపోతే మానవ హక్కుల సంఘం, లోకాయుక్త వంటి సంస్థలను ఆశ్రయించాలని భావిస్తున్నారు. మరోవైపు తమ ఆందోళనను బహిరంగంగా ప్రభుత్వానికి తెలియపర్చాలని, ఇందుకోసం జిల్లాల్లో కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు అందజేయాలనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. అవసరమైతే విధుల బహిష్కరణకు పిలుపునివ్వాలని 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా)'పై తహసీల్దార్లు ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది.



విద్యుత్ వెలుగుల్లో యాదాద్రి క్షేత్రం

మత్స్యావతారంలో యాదగిరీశుడు



మత్స్యావతార అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహ స్వామికి హారతిస్తున్న ప్రధానార్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన గురువారం ఉదయం అలంకార సేవలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఉదయం నిత్య పూజలు, నిత్య పూర్ణాహుతి, ఆరాధనలు పూర్తయ్యాక.. 9గంటలకు మత్స్యావతార అలంకారంలో సేవోత్సవం నిర్వహించారు. ప్రధానాలయం తిరు మాడ వీధుల్లో ఊరేగించారు. పడమటి రాజగోపురం ముందున్న వేంచేపు మండపం వద్ద శ్రీస్వామి వారి మత్స్యావతార సేవను ప్రారంభించారు. రాత్రి ఆలయంలో నిత్యారాధనలు ముగిశాక 7గంటలకు శేష వాహనంపై శ్రీనారసింహస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. మత్స్యావతార, శేష వాహన సేవల విశిష్టతను ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు భక్తులకు వివరించారు.

యాదాద్రిలో వైభవంగా సాంస్కృతికోత్సవాలు



ఆలయ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 7గంటలకు సాంస్కృతికోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తూర్పు రాజగోపురం వద్ద ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో 100 మంది కళాకారులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అనంతరం టి.కే.సిస్టర్స్ కర్నాటక గాత్ర కచేరీ నిర్వహించారు. శ్రీసాయి బృందం మోర్సింగ్ వాయిద్య కచేరి భక్తులను ఆకట్టుకుంది. వేడుకల్లో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈవో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వేధింపులపై మౌనం వద్దు

ధైర్యంగా ఫిర్యాదు చేయాలంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నెట్ వాడకం.. సోషల్ మీడియా ఖాతాలు కలిగి ఉండటం ఈ రోజుల్లో సహజమే..అయితే అందులో మనం పెట్టే పోస్టులు, ఫొటోలు, కామెంట్లు సైతం కొన్నిసార్లు చిక్కులు తెస్తున్నాయి. ప్రత్యేకించి యువతులు, విద్యార్థులకు ఆకతాయిల నుంచి సైబర్ వేధింపులు పెరుగుతున్నాయి. వ్యక్తిగత ఫొటోలను, వివరాలను అవకాశంగా చేసుకుని కొందరు బరితెగిస్తున్నారు. అయితే ఆన్‌లైన్‌లో ఎదురయ్యే వేధింపులపై మౌనంగా ఉండొద్దని, ధైర్యంగా ఎదుర్కోవాలని యువతులకు తెలంగాణ పోలీసులు సూచిస్తున్నారు. సైబర్ వేధింపులకు గురికాకుండా ఉండేందుకు మహిళా భద్రతా విభాగం కొన్ని సూచనలు చేసింది.

- సోషల్ మీడియా ఖాతాల్లో వ్యక్తిగత వివరాలు గోప్యంగా పెట్టుకోవాలి.
- మిమ్మల్ని వేధింపులకు గురిచేసేందుకు అవకాశం ఉందనుకున్న ఫొటోలు, వీడియోలు, ఇతర కామెంట్లు ఏవీ పెట్టవద్దు.
- వేధించే వ్యక్తులను బ్లాక్ చేయడం మంచిది.
- సోషల్ మీడియాలో మిమ్మల్ని ఎవరైనా వేధిస్తున్నట్లయితే వెంటనే మీ తల్లిదండ్రులు లేదా మీకు నమ్మకస్తులైన పెద్దలకు తెలియజేయాలి. వేధింపులు శ్రుతి మించితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం ఉత్తమం.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్‌ఈఏ) రాష్ట్ర అధ్యక్షునిగా దామోదర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్‌లో రెండ్రోజులు జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు గురువారం ముగిశాయి. అధ్యక్షునిగా దామోదర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షునిగా విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా జి.మోహన్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ మోహన్, శ్రీహరిరెడ్డి, సీతారామయ్య, భాగ్యలక్ష్మి, కార్యదర్శులుగా టి.ప్రభాకర్, పి.శ్యామ్ రావు, ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి, పి.శరత్‌బాబు, విజయలక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బక్కారెడ్డి, ఈశ్వరయ్య, రఘునాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు, కోశాధికారిగా గంగారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా చందులాల్, శ్రీవాస్తవ్, రవీందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పెంటయ్య తదితరులను ఎన్నుకున్నట్టు కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీలపై నేడు బహిరంగ విచారణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల వార్షికాదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్), విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలతో పాటు ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి ఎర్రగడ్డలోని టీఎస్‌జెన్‌కో ఆడిటోరియంలో బహిరంగ విచారణ నిర్వహించనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత విద్యుత్ చార్జీలను యథాతథంగా అమలు చేయాలంటూ నవంబర్ 30న వార్షికాదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలను డిస్కంలు ఈఆర్సీకి సమర్పించాయి. కాగా, 2016–17 నుంచి 2022–23 మధ్య జరిపిన విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన రూ.12,015 కోట్ల ట్రూఅప్ చార్జీల వసూలుకు డిస్కంలు అనుమతి కోరాయి. ఈ రెండు ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలను ఈఆర్సీ స్వీకరించనుంది.

పాలమూరు, డిండిపై కమిటీ

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుమతులు లేకుండానే పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడంతో.. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి, పునరుద్ధరణ చర్యలను సిఫారసు చేసేందుకు.. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు నిపుణుల కమిటీని కేంద్ర పర్యావరణ శాఖ నియమించింది. ఆ శాఖలోని నిపుణుల మదింపు కమిటీ జనవరి 23న సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. డాక్టర్ ఎ.మల్హోత్రా అధ్యక్షతన కె.గౌరప్పన్, అశోక్ ఖర్య, ఎన్.లక్ష్మణ్, అమియా సాహూ, జేఏ జాన్సన్‌తో కూడిన కమిటీ.. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్ట నివారణ చర్యలను సిఫారసు చేయనుంది.

భూ బదలాయింపు బాధ్యత తహసీల్దార్లకే..

- జీవో 59 కింద క్రమబద్ధీకరణకు ఓకే అయిన భూములకు కన్వేయన్స్ డీడ్‌లు
- మార్గదర్శకాలు జారీ చేసిన సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్
- చదరపు గజానికి రూ.7వేలలోపు ప్రభుత్వ ధర ఉన్నచోట లైన్ క్లియర్
- తహసీల్దార్ల లాగిన్‌లోకి డీడ్‌లు.. వారి సంతకాలతోనే జారీ
- ఎలాంటి చార్జీలు చెల్లించకుండానే ఈ డీడ్‌ల రిజిస్ట్రేషన్
- ఎక్కువ ధర ఉన్న స్థలాలపై నిర్ణయం ఇంకా పెండింగ్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు ఆ భూములను క్రమబద్ధీకరించే ప్రక్రియ మొదలైంది. దీనికి సంబంధించి గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమైన జీవో 59 అమలు ఓ కొలిక్కి వస్తోంది. క్రమబద్ధీకరణకు ఆమోదం పొంది, ఫీజు పూర్తిగా చెల్లించిన దరఖాస్తుదారుల పేరిట సదరు భూములను బదలాయించేందుకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించి భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్ మిత్తల్ మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ భూములను బదలాయించే బాధ్యత తహసీల్దార్లకు అప్పగించారు. తహసీల్దార్ల లాగిన్లలో ఈ డీడ్‌లను అందుబాటులో ఉంచాలని, వాటిపై తహసీల్దార్ల సంతకం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు.. జీవో 59 కింద ఆమోదం పొందిన భూములకు సంబంధించిన కన్వేయన్స్ డీడ్‌లను సబ్ రిజిస్ట్రార్లు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ఇప్పటివరకు కేవలం ఆక్రమణదారులుగా ఉన్న వేలాది మందికి ఆ స్థలాలపై పూర్తి హక్కులు సంక్రమిస్తాయి. ఆ భూములను అవసరమైతే విక్రయించుకోవడానికి కూడా హక్కు లభించనుంది. సీసీఎల్‌ఏగా బాధ్యతలు స్వీకరించాక నవీన్ మిత్తల్ తొలిసారి జారీచేసిన అధికారిక ఉత్తర్వులు జీవో 59కి సంబంధించినవే కావడం, ఈ ప్రక్రియ పూర్తి బాధ్యతలను తహసీల్దార్లకే అప్పగించడం గమనార్హం.

తక్కువ ధర ఉన్న ప్రాంతాల్లో..

రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇళ్లు కట్టుకున్న పేదలకు వాటిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో 58, 59లను జారీ చేసింది. వీటికింద గత ఏడాది ఫిబ్రవరిలో దరఖాస్తులను స్వీకరించారు. జీవో 58 కింద ఉచితంగా, 59 కింద ప్రభుత్వం నిర్ధారించిన ఫీజును కట్టించుకుని.. సదరు స్థలాలను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టారు. జీవో 59 కింద క్రమబద్ధీకరణ కోసం లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ప్రభుత్వ విలువ చదరపు గజానికి రూ.7 వేల కంటే తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని దరఖాస్తులను పరిశీలించి ఆమోదం తెలిపారు. ఇవి 25వేల వరకు ఉంటాయని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ఈ దరఖాస్తులకు సంబంధించి కన్వేయన్స్ డీడ్‌లను జారీ చేసేందుకు సీసీఎల్‌ఏ తాజాగా మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వ విలువ రూ.7 వేల కంటే అధికంగా ఉన్న స్థలాల విషయంలో ఏం చేయాలన్న దానిపై ప్రభుత్వం ఉన్నతస్థాయిలో కసరత్తు చేస్తోందని, ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు.

సీసీఎల్‌ఏ జారీ చేసిన మార్గదర్శకాలివీ..

- జీవో 59 కింద ఆమోదం పొంది, నిబంధనల మేరకు ప్రభుత్వానికి ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు సంబంధించిన కన్వేయన్స్ డీడ్ (భూబదలాయింపు డాక్యుమెంట్) తహసీల్దార్ లాగిన్‌లోకి వస్తుంది.
- తహసీల్దార్లు మీసేవ వెబ్ పోర్టల్ ద్వారా లాగిన్ కావాల్సి ఉంటుంది. అందులో జీవో 59 కింద కన్వేయన్స్ డీడ్‌లను ప్రాసెస్ చేసే ఆప్షన్ ఉంటుంది.
- తహసీల్దార్ బయోమెట్రిక్ నమోదు చేసి ఈ ప్రాసెస్‌ను పూర్తి చేయవచ్చు. లాగిన్‌లో దరఖాస్తు నంబర్, గ్రామాల వారీగా కన్వేయన్స్ డీడ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ కన్వేయన్స్ డీడ్‌లలో లబ్ధిదారుల పూర్తి వివరాలను నమోదు చేయడంతోపాటు పాటు జారీచేసే పూర్తి బాధ్యతలను తహసీల్దార్ నిర్వర్తించాల్సి ఉంటుంది.
- సదరు దరఖాస్తును ఆమోదించడంతో కన్వేయన్స్ డీడ్ డౌన్‌లోడ్ అవుతుంది. ఇలా డౌన్‌లోడ్ చేసుకునే ముందే అన్ని వివరాలను సరి చూసుకోవాల్సి ఉంటుంది.
- డౌన్‌లోడ్ అయిన డీడ్ (మూడు పేజీలు) ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రింట్‌పై తహసీల్దార్ సంతకం చేయడంతోపాటు ఆఫీస్ స్టాంప్ వేయాల్సి ఉంటుంది.
- ఇలా తహసీల్దార్ సంతకం చేసిన కన్వేయన్స్ డీడ్‌లను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ వంటివేవీ వసూలు చేయకూడదు.
- ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన ఈ డాక్యుమెంట్‌ను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంటుంది. ఇలా అందజేసే సమయంలో తహసీల్దార్ జారీచేసిన కన్వేయన్స్ డీడ్‌ను, సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌ను లబ్ధిదారుడికి ఇవ్వాలి.
- కన్వేయన్స్ డీడ్ కాపీని మీసేవ పోర్టల్‌లో కూడా అప్‌లోడ్ చేయడంతో జీవో 59 కింద సదరు భూమిని లబ్ధిదారుడికి బదలాయించే ప్రక్రియ ముగుస్తుంది.

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థకు అంతర్జాతీయ గుర్తింపు

- అడవుల నిర్వహణ, అభివృద్ధిలో ప్రమాణాలు పాటిస్తున్నందుకు జర్మనీ ఫారెస్ట్ స్టీవర్డ్ కౌన్సిల్ సర్టిఫికెట్
- యూకలిప్టస్, వెదురు, టేకు, జీడిమామిడిల ఉత్పత్తులకు లోగో ఉపయోగించుకునేందుకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అటవీ, అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ)కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అడవుల నిర్వహణ, అభివృద్ధిలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నందుకుగాను ఎఫ్‌డీసీకి జర్మనీ ఫారెస్ట్ స్టీవర్డ్ కౌన్సిల్ సర్టిఫికెట్ దక్కింది. సేంద్రియ పద్ధతిలో యూకలిప్టస్, వెదురు, టేకు, జీడిమామిడి లాంటి అటవీ ఉత్పత్తు(ముడిసరుకు)ల నుంచి తయారయ్యే వస్తువులకు ఐదేళ్లపాటు తమ లోగోను ఉపయోగించుకునేందుకు ఎఫ్‌డీసీకి కౌన్సిల్ అనుమతినిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 75 వేల ఎకరాల్లో యూకలిప్టస్, వెదురు, టేకు, జీడిమామిడి చెట్లను ఉన్నత ప్రమాణాలతో సాగు చేస్తున్నట్టు అధికారులు తెలియజేశారు. అయితే కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి అటవీ డివిజన్లలో సుమారు 45 వేల ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటకు ఈ గుర్తింపు దక్కిందని అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు మంత్రికి వివరించారు. దీనివల్ల అంతర్జాతీయంగా ఎఫ్‌డీసీ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందని, ఐకియా వంటి ఇంటర్నేషనల్ బ్రాండ్లకు జర్మన్ కౌన్సిల్ ధ్రువీకరించిన కలపను విక్రయించే అవకాశం దక్కిందని వెల్లడించారు. ఐదేళ్లలో రూ.10 కోట్ల అదనపు ప్రయోజనం కలగనుందని, కంపోజిట్ వుడ్‌పేపర్, ప్యాకింగ్ పరిశ్రమల కోసం ప్రాసెస్ చేసిన ఉత్పత్తులకు అధికధర లభిస్తుందన్నారు. అటవీ ఉత్పత్తుల నుంచి చేసిన కాగితం, టెట్రాప్యాక్, మిశ్రమ కలపకు ఎఫ్‌ఎస్సీ ఆమోదం లభించిందని తెలియజేశారు.

గుర్తింపు రావడం గొప్ప విషయం: మంత్రి

అరణ్యభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆ శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు. మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశంలో భాగంగా ఇలాంటి గుర్తింపు రావడం గొప్ప విషయమన్నారు. మెరుగైన పద్ధతుల్లో సాగు చేస్తుండటం వల్ల మన అటవీ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్‌తోపాటు 30 శాతం రెవెన్యూ పెరిగిందని తెలిపారు. భవిష్యత్‌లో అటవీ ఉత్పత్తులను మరింత పెంచుకుని, వీటితో వచ్చిన ఆదాయంతో అడవుల సంరక్షణకు మరిన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, పీసీసీఎఫ్ ఆర్.యం. డొబ్రియల్, అటవీ శాఖ అదనపు కార్యదర్శి ఎం.ప్రశాంతి, ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు పీసీసీఎఫ్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సతీష్‌రెడ్డి, జయేశ్‌రంజన్, వివేక్ తదితరులు

నచ్చిన రంగాల్లో యువత రాణించాలి

- డాక్టర్ జి.సతీష్‌రెడ్డి సూచన
- ప్రభుత్వం తరఫున సహకరిస్తామని వెల్లడి

వెంగళరావునగర్ (హైదరాబాద్): స్వయంశక్తితో వ్యాపార రంగంలో ఎదగాలనుకునే యువతకు ప్రభుత్వం తరఫున అన్నిరకాల సహాయ సహకారాలను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని రక్షణ మంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి తెలిపారు. యువత నేటి కాలానికి అనుగుణంగా అన్నిరకాల నైపుణ్యాలను కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందిపుచ్చుకుని యువతీ యువకులు తమలో ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని, తమకు నచ్చిన రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మే) శిక్షణ సంస్థలో స్వయంశక్తితో ఎదగాలనుకునే యువతకు శిక్షణలో భాగంగా గురువారం జాతీయ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత తమకు నచ్చిన రంగాల్లో శిక్షణ తీసుకున్నట్టైతే.. ప్రభుత్వం బ్యాంకుల తరపున రుణాలను మంజూరు చేస్తుందని, తద్వారా చిన్న, మధ్యతరహా, భారీ వ్యాపారాలను చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకుని యువత వ్యాపార రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బ్యాంకర్లు కూడా యువతలోని నైపుణ్యాన్ని గ్రహించి వారిని నిరుత్సాహ పరచకుండా ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆర్థిక చేయూతను అందించి ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, మాజీ ఎంపీ వివేక్, నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప తదితరులు పాల్గొన్నారు. కాగా నిమ్స్‌మేలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను సతీష్‌రెడ్డి ప్రారంభించారు.

పర్యాటక ప్రాంతాలుగా సాగునీటి అతిథి గృహాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 8 సాగునీటి ప్రాజెక్టుల అతిథి గృహాలు, వాటి పరిసర ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయనున్నారు. అత్యంత అహ్లాదకర ప్రాంతాల్లో ఈ అతిథి గృహాలుండడంతో పర్యాటకులను బాగా ఆకర్షించగలవని అంచనా వేస్తున్నారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ గురువారం జలసౌధలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీఎస్‌టీడీసీ) అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తొలుత మొత్తం 22 ప్రాజెక్టుల అతిథి గృహాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని నీటిపారుదల శాఖ ప్రతిపాదించింది. కాగా, నీటిపారుదల శాఖ, టీఎస్‌టీడీసీ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో 22 అతిథి గృహాలను సందర్శించి తొలి దశలో 8 అతిథి గృహాలను అభివృద్ధిపరచాలని సిఫారసు చేసింది. రోడ్డు సదుపాయం, పర్యాటకుల ఆకర్షణ, అతిథి గృహాల పరిస్థితి, సదుపాయాలు, ప్రస్తుతం పర్యాటకుల రాక వంటి అంశాలను పరిగణనలో తీసుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కాగా, పెన్‌గంగ, పోచారం, కడెం, రంగనాయక సాగర్, కోయిల్‌సాగర్, డిండి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, జగిత్యాల అతిథి గృహాలతో పాటు ఐస్‌ల్యాండ్, నెహ్రూ పార్కును పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధిపరచనున్నారు. మార్చి 10లోగా టీఎస్‌టీడీసీతో ఒప్పందం చేసుకోవాలని ఆదేశించారు.

శంషాబాద్‌లో భారీగా బంగారం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న 23 మంది సుడాన్ మహిళలు



పట్టుబడిన బంగారం

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరోసారి భారీఎత్తున బంగారం పట్టుబడింది. సుడాన్ జాతీయులైన 23 మంది మహిళలు సుడాన్ నుంచి వయా షార్జా మీదుగా జీ9–458 విమానంలో గురువారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. లగేజీల స్కానింగ్‌లో బంగారం బయటపడడంతో అధికారులు అప్రమత్తమై మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. బూట్ల అడుగున ప్రత్యేకంగా తయారు చేసిన భాగంలో పెద్దఎత్తున ఆభరణాలు సైతం బయటపడ్డాయి. మొత్తం 14 కేజీల 906 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బంగారం విలువ రూ.7.89 కోట్లుగా అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు నలుగురు మహిళలను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

స్మగ్లర్లకు అందించేందుకే..

సుడాన్‌కు చెందిన మహిళలందరూ క్యారియర్లుగానే బంగారం తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. స్మగ్లర్లకు అక్రమంగా బంగారం చేరవేసేందుకే వీరు షార్జా మీదుగా హైదరాబాద్ చేరుకున్నట్లు సమాచారం. గతంలో కూడా సుడాన్‌కు చెందిన పలువురు మహిళలు అక్రమంగా బంగారం, విదేశీ నగదుతో పట్టుబడిన కేసులున్నాయి. వీరి సెల్‌ఫోన్‌ల ఆధారంగా బంగారం స్మగ్లర్ల వివరాలను తెలుసుకునేందుకు కస్టమ్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు తెలుగువారికి జాతీయ అవార్డులు



వేణుగోపాల్‌రావుకు పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము. చిత్రంలో కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ సంగీతం సముద్రమంత విశాలమైనదని, మన నాటకాలు అజరామరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సంగీత, నాటకాల ద్వారా భారత సంస్కృతిని కాపాడేందుకు కృషి చేస్తున్న కళాకారుల జీవితాలు ధన్యమన్నారు. గురువారం కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జాతీయ సంగీత, నాటక అకాడెమీ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఢిల్లీలో ఘనంగా జరిగింది. కరోనా కారణంగా 2019, 2020, 2021 సంవత్సరాలకు అందించని జాతీయ సంగీత, నాటక అకాడెమీ అవార్డులను గురువారం ముర్ము, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విజేతలకు అందించారు. మొత్తం 128 మంది కళాకారులకు అవార్డులు ఇవ్వగా, ఇందులో 50 మంది మహిళలే ఉండటం ఈ రంగాల్లో స్త్రీశక్తి చేస్తున్న సేవకు నిదర్శనమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో కళా, సంగీత సేవ చేస్తున్న ఆరుగురికి అవార్డులు దక్కాయి. హరికథ కళాకారిణి డి.ఉమామహేశ్వరి(హరికథ), కథక్ నృత్యకారులు రాఘవరాజ్ భట్, మంగళభట్(సంయుక్తంగా) 2019 సంవత్సరానికిగాను ఈ అవార్డులు అందుకున్నారు. 2020 సంవత్సరానికి కర్ణాటక సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, ప్రఖ్యాత గాయని ప్రేమరామ్మూర్తి, కూచిపూడి నృత్యకళాకారులు పసుమర్తి విఠల్, పసుమర్తి భారతి దంపతులు(సంయుక్తంగా) అవార్డులు అందుకున్నారు. 2021 సంవత్సరానికిగాను తెలుగులో నాటకరంగాన్ని కాపాడుకునేందుకు కృషి చేస్తున్న శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) నిర్వాహకులు ఆర్.వేణుగోపాల్ రావు సంగీత, నాటక అకాడెమీ అవార్డును అందుకున్నారు.

‘అధిక పెన్షన్’కు ఏం చేయాలి?

- ఈపీఎఫ్ చందాదారుల్లో గందరగోళం
- ఈపీఎఫ్‌ఓ కార్యాలయాలను సంప్రదిస్తున్న చందాదారులు



సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) పరిధిలోని చందాదారులు, పెన్షన్‌దారుల్లో ఇప్పుడు అధిక పెన్షన్ చర్చనీయాంశమైంది. గత నవంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు లోబడి ఈపీఎఫ్‌ఓ తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. ఈపీఎఫ్‌ఓ జోనల్ కార్యాలయాల్లోని అదనపు చీఫ్ ప్రావిడెంట్ కమిషనర్లు, ఈపీఎఫ్‌ఓ ప్రాంతీయ కార్యాలయాల్లోని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లకు ప్రత్యేక సూచనలు చేసింది. అయితే సర్క్యులర్‌లో వివరాలు వెల్లడించినప్పటికీ, అవి శాఖాపరమైన పరిభాషలో ఉండటంతో ఉద్యోగులు, పెన్షనర్లకు అర్థంకావడంలేదు. దీంతో అర్హులెవరు, ఎలా దరఖాస్తు చేసుకోవాలి అనే అంశాలపై ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో ఈపీఎస్ (ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం) కింద అధిక పెన్షన్ పొందే అంశంపై కొందరు ఈపీఎఫ్‌ఓ కార్యాలయాల్లో సంప్రదిస్తుండగా, మరికొంతమంది సామాజిక మాధ్యమాల్లో నిపుణులను సంప్రదిస్తున్నారు. అధిక పెన్షన్ పొందడానికి చందాదారులు తమ వివరాలను https:// unifiedportal& emp. epfindia. gov. in/ epfo/ memberinterface లింక్ ద్వారా అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

అధిక పెన్షన్‌కు అర్హతలు ఇలా...

- 2014, సెప్టెంబర్ 1 కన్నా ముందు పదవీ విరమణ పొందిన ఉద్యోగి పీఎఫ్ కంట్రిబ్యూషన్ చెల్లించడంతోపాటు ఈపీఎస్ ఆప్షన్‌ను (ఈ ఆప్షన్‌ను ఈపీఎఫ్‌ఓ అధికారులు తిరస్కరించినా, స్పందించకున్నా) ఎంచుకొని ఉండాలి. ఈ రెండింట్లో ఏ ఒక్కటి లేకున్నా అధిక పెన్షన్‌కు అర్హత లేనట్లే.
- 1 సెప్టెంబర్ 2014 నుంచి 4 నవంబర్ 2022 మధ్య పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ప్రస్తుతం సర్వీసులో ఉన్న వారిలో ఉద్యోగి, యజమాని ఇద్దరు పీఎఫ్ కంట్రిబ్యూషన్ చెల్లించడంతోపాటు ఆ కాలంలో అధిక పెన్షన్ ఆప్షన్ ఇచ్చుకున్నా అర్హత సాధించినట్లే. ఇక్కడ పెన్షన్ ఆప్షన్‌ను ఈపీఎఫ్‌ఓ తిరస్కరించినా... స్పందించకున్నా అర్హత ఉన్నట్లే.
- 1 సెప్టెంబర్ 2014 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి కేవలం ఈపీఎఫ్ (ఉద్యోగి భవిష్యనిధి) పథకం మాత్రమే వర్తిస్తుంది. ఈపీఎస్ వర్తించదు. అదేవిధంగా 1 సెప్టెంబర్ 2014 కంటే ముందు ఈపీఎస్‌కు ఎలాంటి ఆప్షన్ ఇవ్వకుండా ఉద్యోగం మానేసిన వారు కూడా అనర్హులే.
- నిర్దేశిత తేదీ నాటికి అధిక పెన్షన్‌కు అర్హత ఉన్నా.. పదవీ విరమణ పొందిన ఉద్యోగి మరణిస్తే అధిక పెన్షన్ ప్రయోజనం సదరు ఉద్యోగి కుటుంబానికి వర్తిస్తుందా? లేదా? అనే అంశంపై అధికారులు వివరించడం లేదు.

ప్రధాని దృష్టికి రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు

కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి హామీ



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి

సైదాబాద్ (హైదరాబాద్): రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగుల పెన్షన్ పెంపు.. తదితర అపరిష్కృత సమస్యలను ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి హామీ ఇచ్చారు. గురువారం ఆయన సైదాబాద్‌లోని ఎస్‌బీహెచ్ ఏ కాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రోహిణిరావు, అసోసియేషన్ సభ్యులతో కలసి కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పించారు. గత మూడు దశాబ్దాలుగా బ్యాంక్ ఉద్యోగుల ప్రాథమిక పెన్షన్‌ను సవరించలేదని ఆయన పేర్కొన్నారు. 2002కు ముందు పదవీ విరమణ పొందిన సీనియర్ మేనేజర్లు, టాప్ మేనేజర్‌లలో చాలామంది రూ. 35 వేల కంటే తక్కువ పెన్షన్ పొందుతున్నారని వివరించారు. పెరిగిన ఖర్చులతో పెద్ద హోదాలోనివారి పరిస్థితే ఇలా ఉంటే తక్కువ క్యాడర్ పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చని తెలిపారు. కాగా, పెన్షన్ రివిజన్, 100 శాతం డీఏ న్యూట్రలైజేషన్ సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని వారు కోరారు. అసోసియేషన్ వినతులకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ పర్యవేక్షణకు జేసీలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాల స్పెషల్‌డ్రైవ్ అమలు పరిశీలనకు జాయింట్ కమిషనర్లను జోన్ల సూపర్‌వైజర్లుగా నియమించారు. కూకట్‌పల్లి జోన్‌కు సంధ్య, సికింద్రాబాద్‌కు ఉమాప్రకాశ్, ఎల్‌బీనగర్‌కు జె.సువార్త, శేరిలింగంపల్లికి ఎల్.పి. మల్లయ్య, చార్మినార్‌కు ఎ.శైలజ, ఖైరతాబాద్‌కు బి.శ్రీనివాసులను నియమించారు.

మోటార్ సైకిల్ రేసింగ్



అతిపెద్ద మోటార్ సైకిల్ రేసింగ్ చాంపియన్‌షిప్, కేటీఎం ఆర్‌సీ కప్ హైదరాబాద్‌లో జరిగింది. కేటీఎం ఆర్‌సీ 390 జీపీ ఎడిషన్‌పై రేసర్లు పోటీలో పాల్గొన్నారు. కేటీఎం యజమానులకు ప్రొఫెషనల్ రైడర్ అనుభవాలను అందించే ప్రయత్నంలో భాగంగా ఈ రేసింగ్ నిర్వహించారు.

మేయర్‌పై ఆర్జీవీ 'ట్వీట్ల' దండకం



నగరంలోని అంబర్‌పేటలో కుక్కల దాడిలో చిన్నారి మృతి చెందడం, దానిపై నగర మేయర్ విజయలక్ష్మి స్పందించిన తీరు పట్ల దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ వరుస ట్వీట్లను సంధించారు. 'పాపం నిరుపేద కుక్కలు వేరే దారి లేక ఆకలి తాళలేక 4 ఏళ్ల బాలుడిని చంపేశాయని మేయర్ అనడం షాకింగ్‌గా.. నమ్మశక్యం కాని విధంగా ఉంది. హృదయాన్ని పిండేస్తున్న బాలుడి వీడియో రిపీటెడ్‌గా నగర మేయర్‌కి చూపించాలి. మేయర్ తన పెట్ డాగ్స్‌కు తినిపిస్తున్న పాత వీడియోను ఆయన షేర్ చేసి...ఈ వీడియోని నగరంలో ఉన్న కుక్కలన్నింటికీ చూపిస్తే.. పిల్లల్ని చంపే బదులు, తమకు ఆకలి వేసినప్పుడు అవి నేరుగా ఆమె ఇంటికి వెళ్లవచ్చు. ఈ ఘటన అనంతరం మేయర్‌గా రిజైన్ చేసి అన్ని కుక్కలను మీ ఇంటికి తీసుకెళ్లి స్వయంగా వాటికి తినిపించవచ్చు కదా? అప్పుడు అవి మా పిల్లల్ని తినవు కదా' అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 'నగరంలోని మొత్తం 5 లక్షల కుక్కల్ని ఒక డాగ్ హోమ్‌లో రౌండప్ చేయండి' అంటూ రాష్ట్ర ప్రభుత్వాధినేతలను అభ్యర్థించారు. కుక్కల అంశంపై గురువారం సమావేశం పెట్టామని, చర్చించాం అని మేయర్ చెప్పడంపై స్పందిస్తూ..'ఏ రకమైన ముగింపునకు వచ్చారు మీరు? అకౌంటబిలిటీ కోసం దీన్ని మీరు పాయింట్ టు పాయింట్ ట్విట్టర్‌లో పెట్టగలరా?' అని ప్రశ్నించారు. హైకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించడంపై ఉపశమనంగా ఉంది' అని ఆర్జీవీ ట్వీట్ చేశారు.

– సాక్షి, సిటీబ్యూరో

వణుకు పుట్టిస్తున్న శునకాలు!

ఎక్కడ చూసినా వీధి కుక్కలు వీరవిహారం చేస్తూనే ఉన్నాయి. ఇటీవల అంబర్‌పేటలో శునకాల దాడిలో బాలుడి మృత్యువాత ఉదంతం నగరవాసులను గగుర్పాటుకు గురి చేసింది. వీటి భయంతో జనాలు వణికిపోతున్నారు. గురువారం పలు ప్రాంతాల్లో జనావాసాలు, రోడ్లు, కూడళ్ల వద్ద కుక్కలు ఇలా సంచరిస్తూ కనిపించాయి.

-సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు



గగన్ మహల్‌లో..



అశోక్‌నగర్‌లో..



శివం రోడ్డులో..



బాగ్‌లింగంపల్లిలో..



నారాయణగూడలో..



వీఎస్‌టీ వద్ద..

న్యూస్‌రీల్

కొత్త డీసీపీలకు పీఏల కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కమిషనరేట్ పునర్ విభజన నేపథ్యంలో కొత్తగా రెండు జోన్లు వస్తున్న విషయం విదితమే. వీటితో పాటు డివిజన్లు, ఠాణాలు అధికారికంగా ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటికే సౌత్ వెస్ట్ జోన్‌కు ఖారె కిరణ్ ప్రభాకర్, సౌత్ ఈస్ట్ జోన్‌కు చెన్నూరి రూపేష్‌లను డీసీపీలుగా నియమించారు. వీరికి పీఏలను సైతం కేటాయిస్తూ కొత్వాల్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. సౌత్ ఈస్ట్ డీసీపీకి మీర్జా ఇమ్రాన్ ఖాన్, సౌత్ వెస్ట్ డీసీపీకి టి.వినీత్ కుమార్ పీఏలుగా నియమితులయ్యారు. సౌత్ జోన్‌లో పని చేస్తున్న కె.అనిల్ రెడ్డిని సెంట్రల్ జోన్ డీసీపీ పీఏగా బదిలీ చేస్తూ మంగళవారమే ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ పీఏలు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ముగిసిన ప్రీబిడ్ సమావేశాలు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 21 నుంచి వరుసగా మూడు రోజుల పాటు జరిగిన ప్రీ బిడ్ సమావేశాలు గురువారం ముగిశాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 5 ల్యాండ్ పార్సిల్స్‌పై ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ప్రీబిడ్ మీటింగ్ జరిగింది. హెచ్ఎండీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ గంగాధర్, మేడిపల్లి తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, హెచ్ఎండీఏ డీఏవో శోభారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామారావు, ఎమ్మెస్టీసీ ప్రతినిధులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లాలో 10, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 5, సంగారెడ్డి జిల్లాలో 23 ల్యాండ్ పార్సిల్స్ కొనుగోలుదారులు కోసం సిద్ధంగా ఉన్నాయి. గండిపేట మండలంలో 3, శేరిలింగంపల్లి 5, ఇబ్రహీంపట్నం మండలంలో 2 చొప్పున అమ్మకానికి ఉన్నాయి. మేడిపల్లి 4, ఘట్‌కేసర్ 1, అమీన్‌పూర్ 16, ఆర్‌సీపురం 6, జిన్నారం మండలంలో 1 చొప్పున విక్రయించనున్నారు. మార్చి 1న ఈ మొత్తం 38 ల్యాండ్ పార్సిల్స్‌ను ఎమ్మెస్టీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేపట్టింది.

ఉస్మానియాలో హైకోర్టు అడ్వకేట్ జనరల్‌కు వైద్య పరీక్షలు



అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడుతున్న వైద్యులు

అఫ్జల్‌గంజ్: రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ గురువారం ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ఆర్ఎంఓ–1 డాక్టర్ శేషాద్రిలు రక్త, జనరల్ పరీక్షలు చేయించారు. ఆస్పత్రిలో పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు అవయవ మార్పిడి శస్త్ర చికిత్సల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ ఆయనకు వివరించారు.

మాంసపు వ్యర్థాలు రోడ్లపై వేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

మటన్, చికెన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్

- శునకాల బెడద నివారణకు ముమ్మర చర్యలు
- నగరంలో కుక్కలు ఎక్కువున్న ప్రాంతాల గుర్తింపు
- వేగవంతంగా స్టెరిలైజేషన్
- హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో సంరక్షణ కేంద్రాలకు కుక్కలు
- సమస్యల పరిష్కారానికి 040–21111111 ఫిర్యాదు చేయొచ్చు
- ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వీధి కుక్కల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ప్రజల భద్రత, జీవాల సంరక్షణకు ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. గురువారం వివిధ శాఖల అధికారులతో తన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశంలో మంత్రి మాట్లాడారు.

- నగరంలో కుక్కల బెడద నివారణకు నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్టెరిలైజేషన్ కార్యక్రమాలు చేయాలని అధికారులను ఆదేశించారు. బస్తీలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరంలో కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రాలకు తరలించి ఆహారం, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో నూతన సంరక్షణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు.
- రోడ్లపై కుక్కలకు ఇష్టమొచ్చినట్లుగా ఆహారం వేయడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ప్రజలు కూడా అర్థం చేసుకోవాలని కోరారు. షాపుల నిర్వాహకులు మాంసం వ్యర్థాలను రోడ్లపై వేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో కుక్కలు ఎక్కువగా చేరడానికి కారణమవుతోందని పేర్కొన్నారు. మటన్, చికెన్ షాపుల వద్ద శుక్రవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా రోడ్లపై మాంసపు వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుక్కల విషయంలో ప్రస్తుతం 8 ప్రత్యేక టీములతో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

కోతులు, కుక్కల కారణంగా తలెత్తే సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ టోల్‌ఫ్రీ నంబర్ (040–21111111)కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వాటి ద్వారా ద్వారా ఫిర్యాదులు చేయొచ్చని తెలిపారు. కోతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. ప్రత్యేక అనుభవం ఉన్న వారి ద్వారా నగరంలోని కోతులను పట్టుకొని అటవీ శాఖ అధికారుల సమన్వయంతో వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్, పశుసంవర్థక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, అడిషనల్ కమిషనర్ శ్రుతిఓజా (హెల్త్), పశుసంవర్థక శాఖ డైరెక్టర్ రాంచందర్, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సెకండ్.. చీటింగ్

- ఎన్ఓసీ లేకుండానే పెద్ద ఎత్తున అమ్మకాలు
- ఢిల్లీ బండ్లతో బోల్తాపడుతున్న నగరవాసులు
- తప్పుడు పత్రాలతో వాహనాల రిజిస్ట్రేషన్లు
- పలు ఆర్టీఏ కేంద్రాల్లో అడ్డగోలుగా అనుమతులు

అక్రమ వాహనాల విక్రయాలకు అడ్డాగా హైదరాబాద్



సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీకి చెందిన సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకాలకు హైదరాబాద్ అడ్డాగా మారింది. తక్కువ ధరలకు లభిస్తున్నాయనే ఆశతో కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఊరూ పేరూ లేని వాహనాలను కొనుగోలు చేసి ఏజెంట్‌ల చేతుల్లో దారుణంగా మోసపోతున్నారు. మరోవైపు ఇలాంటి అక్రమ వాహనాలపై కొందరు దళారులు తప్పుడు డాక్యుమెంట్‌లను సృష్టించి కొందరు ఆర్టీఏ అధికారుల సహకారంతో అధికారికంగా నమోదు చేయిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ తరహా అక్రమ వాహనాల అమ్మకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. తరచూ ఇలాంటి వాహనాలను పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేస్తున్నా అక్రమ అమ్మకాలకు అడ్డుకట్ట పడటంలేదు.

ఇదో మచ్చుతునక..

కొద్ది రోజుల క్రితం నగరంలోని మలక్‌పేట్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఓ ఏజెంట్ సహాయంతో ఢిల్లీకి చెందిన సెకండ్ హ్యాండ్ ఇన్నోవా కారును కొనుగోలు చేశాడు. ఆరేళ్ల క్రితం షోరూమ్ నుంచి బయటకు వచ్చిన బండి కావడంతో అన్ని విధాలా బాగుందని భావించాడు. పైగా తక్కువ ధరకే లభించడంతో వెనుకడుగు వేయలేదు. కానీ వాహనం రిజిస్ట్రేషన్ సమయంలో తాను దారుణంగా నష్టపోయినట్లు గుర్తించాడు. సదరు వాహనానికి సంబంధించిన నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) నకిలీదని తేలింది. నగరంలో లభించే సెకండ్ హ్యాండ్ వాహనాల కంటే ఢిల్లీకి చెందిన వాహనాలు తక్కువ ధరకే లభిస్తుండటంతో చాలామంది ఎలాంటి పత్రాలు పరీక్షించుకోకుండానే కొనుగోలు చేసి మోసపోతున్నారు.

ఎన్‌ఓసీ ఎంతో కీలకం..

- ఎలాంటి వాహనమైనా సరే ఒకరి నుంచి మరొకరికి యాజమాన్య బదిలీ అయ్యే సమయంలో నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఎంతో కీలకం. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయినా, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ అయినా తప్పనిసరిగా ఎన్‌ఓసీ ఉండాల్సిందే. ఉదాహరణకు ఢిల్లీకి చెందిన వాహనాన్ని హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి కొనుగోలు చేసినప్పుడు వాహనం మొదటి యజమానికి పేరిట నమోదైన రిజిస్ట్రేషన్ పత్రాలను అక్కడి ఆర్టీఏ అధికారులకు సమర్పించి ఎన్‌ఓసీ పొందాలి. దాని ఆధారంగా హైదరాబాద్‌లో ఆర్టీఏ అధికారులు తిరిగి నమోదు చేస్తారు. చట్టబద్ధంగా ఒకరి నుంచి మరొకరు కొనుగోలు చేసినట్లు నిరూపించుకోవాలి. కానీ.. ఢిల్లీ, హరియాణా నుంచి తరలిస్తున్న వాహనాలకు ఇలాంటి కీలకమైన డాక్యుమెంట్‌లు లేకపోవడం గమనార్హం.
- గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ప్రతి రోజు సుమారు 3వేలకు పైగా వాహనాలు కొత్తగా నమోదవుతాయి. వాటిలో 600 నుంచి 800 వరకు ఇతర రాష్ట్రాలకు చెందిన సెకండ్ హ్యాండ్ వాహనాలే. ఢిల్లీ, హరియాణాలతో పాటు చెన్నై, బెంగళూరు, ముంబై తదితర నగరాల నుంచి కూడా సెకండ్ హ్యాండ్ వాహనాలు నగరంలో నమోదవుతున్నాయి. వీటిలో 70 శాతం వరకు ఢిల్లీకి చెందిన కార్లే ఉన్నట్లు అంచనా. వీటిపైన ఎక్కువ ఆదాయం లభిస్తుండడంతో ఏజెంట్‌లు పెద్ద సంఖ్యలో రంగంలోకి దిగి అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు.

నకిలీ డాక్యుమెంట్‌ల సృష్టి...

ఈ క్రమంలో ఎలాంటి ఆధారాలు లేకుండా వాహనాలు పట్టుబడినప్పుడు మాత్రమే వాహనదారులు తాము మోసపోయినట్లు గుర్తిస్తున్నారు. ఈ వాహనాలపై కూడా కొందరు ఏజెంట్‌లు నకిలీ డాక్యుమెంట్‌లను సృష్టిస్తున్నారు. వాటి ఆధారంగానే కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారుల సహకారంతో రిజిస్ట్రేషన్‌లు సైతం చేయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

'వాహన్'లో నమోదు తప్పనిసరి..

సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలుపై అప్రమత్తత అవసరం. వినియోగదారులకు చూపించే వాటికి, విక్రయించే వాటికి ఒక్కోసారి సంబంధం ఉండకపోవచ్చు. కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ 'వాహన్'లో నమోదైనవాటిని మాత్రమే కొనుగోలు చేయాలి. నకిలీల వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే 'వాహన్'లో బండి వివరాలు పరిశీలించాలి. వాహనం ఆర్సీ (రిజిస్ట్రేషన్), ఢిల్లీ రవాణా అధికారులు జారీ చేసిన నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ), బీమా పత్రాలు తదితరాలు సమగ్రంగా ఉంటేనే సెకండ్ హ్యాండ్ బండ్లు కొనుగోలు చేయడం మంచిది.

సారీ.. నో ఏసీ

ఈ షెల్టర్లు 'ప్రకటన'లకే పరిమితం

- అలంకారప్రాయంగా ఏసీ బస్ షెల్టర్లు
- కనీస సదుపాయాలు సైతం కరువే
- ఇవి ఉన్నది వ్యాపార ప్రకటనల కోసమేనా?
- మండుటెండలోనే ప్రయాణికుల పడిగాపులు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఏసీ బస్‌షెల్టర్‌లు అలంకారప్రాయంగా మారాయి. ఏ ఒక్క షెల్టర్‌లోనూ ఏసీ సదుపాయం లేదు. ఏసీ ఉంటే తప్ప ఆ షెల్టర్‌లలో కూర్చోవడం సాధ్యం కాదు. ఒక్క ఏసీ మాత్రమే కాదు. తాగునీళ్లు, టాయిలెట్‌లు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవు. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అక్కరకు రాని షెల్టర్‌లలో కూర్చొని ఎదురు చూసేందుకు అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు మండుటెండలోనే పడిగాపులు కాయాల్సివస్తోంది.

ఏర్పాటులోనే ఆర్భాటం..

- ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అయిదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఏసీ షెల్టర్లు నేతిబీర చందంగా మారాయి. అద్దాల డోర్‌లతో బ్రహ్మాండమైన లుక్ కనిపిస్తుంది. కానీ డోర్‌లు తెరిస్తే అన్నీ లుకలుకలే. ఏసీ షెల్టర్‌లతో పాటు నాన్ ఏసీ షెల్టర్‌ల ఏర్పాటును అప్పట్లో ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. వ్యాపార ప్రకటనలపై వచ్చే ఆదాయంతో వీటిని నిర్వహించాలి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన సదుపాయాలను ప్రయాణికులకు అందజేయాలి. ఈ షెల్టర్‌లను ఏర్పాటు చేసిననప్పటి నుంచి వ్యాపార ప్రకటనల ద్వారా ఆయా సంస్థలకు ఆదాయం లభిస్తోంది. ప్రయాణికులకు మాత్రం అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీస సౌకర్యాలు అందడం లేదు.
- తార్నాక, సికింద్రాబాద్, బేగంపేట్, బషీర్‌బాగ్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, శిల్పారామం, ఖైరతాబాద్ తదితర చోట్ల బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేశారు. రెండు కేటగిరీలుగా షెల్టర్‌లను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ నివేదిక ప్రకారం నగరంలో సుమారు 1800 బస్‌షెల్టర్‌లు అవసరం. కొన్ని చోట్ల పాతకాలపు షెల్టర్‌లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని శిథిలమయ్యాయి. రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్‌ల నిర్మాణం కారణంగా, గతంలో మెట్రో పనుల దృష్ట్యా షెల్టర్‌లను తొలగించారు. ఇలా షెల్టర్‌లు లేని చోట ఆధునిక పద్ధతిలో కట్టించేందుకు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలోనే మొదట ఏసీ షెల్టర్‌లకు శ్రీకారం చుట్టారు.
- కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు, శిల్పారామం, దిల్‌సుఖ్‌నగర్, ఖైరతాబాద్, తదితర 10 ప్రాంతాల్లో ఏసీ షెల్టర్‌లను ఏర్పాటు చేశారు. ప్రారంభించిన కొద్ది రోజులు మాత్రమే ఏసీ ఉంది. ఆ తరువాత ఎక్కడా పని చేయడం లేదు. అప్పట్లో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సీసీ కెమెరాలు, ప్యానిక్ బటన్‌లు, మొబైల్ చార్జింగ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు ఆ సదుపాయాలు ఏవీ అందుబాటులో లేదు.



మాదాపూర్ శిల్పారామంలోని బస్‌షెల్టర్

ప్రకటనలకే..

తార్నాక, బేగంపేట్ వంటి పలు చోట్ల ఏర్పాటు చేసిన నాన్ ఏసీ షెల్టర్లు బస్టాపులతో సంబంధం లేకుండా ఉన్నాయి. కేవలం వాటికి వ్యాపార ప్రకటనలకే ఏర్పాటు చేసినట్లుగా ఉన్నాయి. ఆ షెల్టర్లకు ఫర్లాంగ్ దూరంలో బస్సులు ఆగుతాయి. జన సమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, ముఖ్యంగా జనం దృష్టిని ఆకర్షించేందుకు అవకాశం ఉన్న చోట ఈ తరహా ప్రకటనలతో షెల్టర్లు ఏర్పాటు కావడం గమనార్హం.

అటు 'రోడ్ షో'







'దేనా ఔర్ లేనా' అనే దానికి సంక్షిప్త రూపంగా పేర్కొనే టీహబ్‌లో ఇంక్యుబేట్ అవుతున్న డెనొర్లైన్ స్టార్టప్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షో విశేషంగా ఆకట్టుకుంది. గురువారం నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాదాపూర్ వద్ద 'త్రీ సీ' (క్రియేట్, కోలాబరేట్, కాంకర్) ఫెస్టివల్‌లో భాగంగా ఈ ప్రదర్శనను నిర్వహించారు. టీహబ్ రోడ్డుపై అనురాగ్ యూనివర్సిటీకి చెందిన 60 మంది విద్యార్థులు ఒకే రంగు టీ షర్టులు ధరించి రోడ్డుపై డ్యాన్స్‌లతో చేసిన ఫ్లాష్‌మాబ్ విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జరిగిన పది గుర్రాల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, సందర్శకులు కేరింతలు, చప్పట్లు కొడుతూ ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా మెర్సిడెజ్–బెంజ్, డీఎండబ్ల్యూ, ఓల్వో, ఆడీ, పోర్ లెగ్జస్, ల్యాంబోగిని, ఫెర్రారీ, ల్యాండ్ రోవర్ వంటి కార్లు సందడి చేశాయి. ఈ సందర్భంగా డెనొర్లైన్ సీఈఓ ఠాగూర్ సీనియర్, డెనొర్లైన్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఠాగూర్ జూనియర్, సీఓఓ సౌమ్యారావు, సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

– రాయదుర్గం

ఇటు ఫ్యాషన్ షో



హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో గురువారం నిర్వహించిన ఫ్యాషన్‌షో అదుర్స్ అనిపించింది. త్రీసీ (సృష్టించు, సహకరించు, జయించు) ఫెస్టివల్‌లో భాగంగా దీనిని తలపెట్టారు. ఈ సందర్భంగా 8 మంది మోడల్స్ ర్యాంప్‌పై హొయలొలికించారు. ప్రైట్ అండ్ ఇండో వెస్ట్రన్, ఎత్నిక్ బ్రైడల్ కలెక్షన్లు ఎస్‌జీ ఫ్యాషన్‌కి చెందిన శ్రీకాంత్ గట్ల ఈ షోను క్యూరేట్ చేశారు. మిస్ ఇండియా వరల్డ్–2020 మానస వారన్సి, తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు ఫ్యాషన్ షోను తిలకించారు. డెనొర్లైన్ స్టార్టప్ సీఓఓ సౌమ్యారావు, డెనొర్లైన్ స్టార్టప్ సీఈఓ ఠాగూర్ సీనియర్, ఎండీ జూనియర్ ఠాగూర్, టీ హబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

– రాయదుర్గం

భవనంపై నుంచి పడి అంధ విద్యార్థి దుర్మరణం

సనత్‌నగర్: భవనం ఐదో అంతస్తు నుంచి కిందపడి ఓ అంధ విద్యార్థి మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై జయచందర్ వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ప్రాంతంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన వెంకట రవికుమార్ కుమారుడు గౌతం లక్ష్మీశ్రీకర్ (12) బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో ఆరో చదువుకుంటున్నాడు. గౌతం బాధ్యతలను చూసుకునేందుకు తల్లిదండ్రులు ఓ కేర్‌టేకర్‌నూ నియమించారు. ఆ కేర్‌టేకర్‌తో కలిసి రోజూ పాఠశాలకు వెళ్తుంటాడు. భవనం నాలుగో అంతస్తులోని తరగతి గదిలో చదువుకుంటుంటాడు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు కేర్ టేకర్ కూడా గౌతంతో పాటు ఉంటుంది. రోజులాగే పాఠశాలకు వచ్చిన గౌతంను గురువారం ఎవరూ గమనించకపోవడంతో మెట్లమార్గంలో ఉన్న రెయిలింగ్‌ను పట్టుకొని ఐదో అంతస్తు వరకు వెళ్లాడు. అయితే అక్కడ నిర్మాణ పనులు జరుగుతున్న దృష్ట్యా కాంట్రాక్టర్ మెటీరియల్‌ను యంత్రం ద్వారా పైకి తరలించేందుకు సులువుగా ఉండేందుకు ప్రహరీని కొంతమేర కూల్చివేశారు. అలా నడుచుకుంటూ మెటీరియల్ సప్లై కోసం ప్రహరీ పగులగొట్టిన ప్రాంతం నుంచి నేరుగా కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కనీసం ప్రహరీ ఉన్నా ఆ విద్యార్థి ప్రాణాలు దక్కేవని స్థానికులు పేర్కొన్నారు.



గౌతం కింద పడింది ఇక్కడి నుంచే (సర్కిల్‌లో)



గౌతం లక్ష్మీ శ్రీకర్(ఫైల్)

మత్తు 'మందుల' దందా!

- నిషా కోసం కొన్ని ఔషధాల వినియోగం
- అక్రమంగా దుకాణదారుల విక్రయాలు
- ఏజెన్సీ నుంచి బిల్లులు లేకుండా వీరి వద్దకు
- గుట్టురట్టు చేసిన హెచ్-న్యూ అధికారులు
- 15 మంది నిందితుల అరెస్ట్
- రూ.40 లక్షల విలువైన టానిక్స్, టాబ్లెట్లు సీజ్



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగం మాదక ద్రవ్యాలపై యుద్ధం చేపట్టింది. వినియోగదారులు, విక్రేతలు, సరఫరాదారులతో పాటు సూత్రధారులనూ కటకటాల్లోకి నెడుతోంది. దీంతో కటకటలాడిపోతున్న మత్తుబానిసలు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. సాధారణ రుగ్మతలు, శస్త్రచికిత్సల తర్వాత, అత్యవసర సమయాల్లో వాడే ఔషధాలను దొడ్డిదారిలో సేకరించి వినియోగిస్తున్నారు. దీనిని గుర్తించిన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 15 మందిని అరెస్టు చేసి వీరి నుంచి రూ.40 లక్షల విలువైన కోడిన్ ఫాస్పేట్ టానిక్స్, అల్ప్రాజోలమ్ టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ చక్రవర్తి గుమ్మి పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా నిషేధించిన దగ్గు మందు

దగ్గు, ఒంటి నొప్పుల నివారణ కోసం ఒకప్పుడు కోడిన్ ఫాస్పేట్ టానిక్ వినియోగించే వారు. ఇందులో వినియోగించే ముడిపదార్థాల వల్ల తీవ్రమైన మత్తు వచ్చేది. ఫలితంగా అనేక మంది ఈ ఔషధం వినియోగానికి బానిసలుగా మారడం మొదలెట్టారు. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2018 జూలై నుంచి దీని తయారీ, విక్రయం, వినియోగాలను నిషేధించింది. అయినప్పటికీ ఆగ్రా చుట్టుపక్కల ప్రాంతాల్లో దీన్ని అక్రమంగా తయారు చేస్తున్నారు. ఫర్హాబాద్‌కు చెందిన పవన్ అగర్వాల్ దీన్ని సేకరించి అమీర్‌పేటలో బయో-స్పైర్ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు మహ్మద్ బషీర్ అహ్మద్‌కు సరఫరా చేస్తున్నాడు. ఇది ఇతడి ద్వారా సైదాబాద్ కాలనీ వాసి ఎ.సత్యనారాయణకు చేరుతోంది. ఎలాంటి లైసెన్సులు లేని ఇతను ఈ ఔషధాన్ని ఉప్పల్‌కు చెందిన అక్షయ మెడికల్ షాపు యజమాని పాచం వేణు ద్వారా అమ్మిస్తున్నాడు. రూ.40 ఖరీదైన ఈ సిరప్‌ను రూ.200కు విక్రయిస్తున్నారు. నాంపల్లి, మెహదీపట్నం, మలక్‌పేట, అంబర్‌పేటల్లోనూ కొందరు వ్యాపారులు ఈ మందును విక్రయిస్తున్నారు.

చీటీ పైనే అమ్మాల్సిన ఆల్ప్రాజోలమ్...

మానసిక వైద్య చికిత్సలో వినియోగించే ఆల్ప్రాజోలమ్ సంబంధిత మాత్రలను కేవలం డాక్టర్ చీటీ ఆధారంగా, సూచించిన ప్రమాణంలోనే విక్రయించాలి. దీనిని వినియోగిస్తే మత్తు రావడంతో అనేక మంది బానిసలవుతున్నారు. దీర్ఘకాలం వాడి రుగ్మతలకు గురవుతున్నారు. రాజస్థాన్‌లోని బయోల్యాబ్ రెమిడీస్ సంస్థల్లో తయారయ్యే ఈ మాత్రలు కవాడీగూడకు చెందిన అజంత మెడికల్ ఏజెన్సీ ద్వారా కాచిగూడకు చెందిన గణేష్ ఫార్మాస్యూటికల్స్ నిర్వాహకుడు ఎ.వెంకట సురేష్ బాబుకు బిల్లులు లేకుండా హోల్‌సేల్‌గా వస్తున్నాయి. ఇతను జి.పూర్ణ చందర్, ఎం.మల్లేష్‌లను డెలివరీ బాయ్స్‌గా ఏర్పాటు చేసుకున్నాడు. వీరి ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాల్లో మెడికల్ షాపులు నిర్వహించే ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, కె.వేణుగోపాల్, ఎం.శ్రీధర్, ఎం.పవన్‌కుమార్, మహ్మద్ అబ్దుల్ హఫీజ్, మహ్మద్ అబ్దుల్ సమీ, జహిరుద్దీన్ అహ్మద్, నీరజ్ సింగ్‌లకు సరఫరా చేస్తున్నాడు. వీరు పరిచయస్తులైన కస్టమర్లను ఎలాంటి మందుల చీటీ లేకుండానే అమ్ముతున్నారు. 17 నుంచి 20 పైసల ఖరీదు చేసే ఈ టాబ్లెట్ రూ.12 కు విక్రయిస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్స్‌కు నిర్ణయం...

సిటీలో జరుగుతున్న ఈ ఔషధాల అక్రమ దందాపై హెచ్-న్యూకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ రెడ్డి నేతృత్వంలో ఎస్సై సి.వెంకట రాములుతో కూడిన బృందం వరుస దాడులు చేసి మొత్తం 15 మందిని అరెస్టు చేసింది. వీరి నుంచి 1,52,400 టాబ్లెట్లు, 1160 టానిక్స్ స్వాధీనం చేసుకుంది. పరారీలో ఉన్న మరో 10 మంది మెడికల్ షాపు నిర్వాహకుల కోసం గాలిస్తున్నామని చక్రవర్తి తెలిపారు. ఈ దందాకు చెక్ చెప్పడానికి ఔషధ నియంత్రణ శాఖతో కలిసి శుక్రవారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. నియంత్రిత, నిషేధిత జాబితాలో ఉన్న ఔషధాల దందా చేస్తే కాస్మోటిక్స్ యాక్ట్ కాకుండా ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, ఇవి నాన్-బెయిలబుల్ అని స్పష్టం చేశారు. వీటికి బానిసలుగా మారుతున్న యువత విచక్షణ కోల్పోయి నేరాలు కూడా చేస్తున్నారన్నారు. ఆయా మెడికల్ షాపుల లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. గత ఏడాది ఇలాంటి అక్రమ దందా చేస్తున్న 100 మెడికల్ దుకాణాల లైసెన్సులు రద్దు చేశామని, వీరితో పాటు కుటుంబీకులకు మరోసారి లైసెన్సు రాదని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

చుట్టాల్లా వెళ్లి పట్టేశారు!

- రూ.కోటి నగల చోరీ కేసులో పోలీసుల వ్యూహం
- నిందితులు పసిడి కార్ఖానాలో పనిచేసిన కార్మికులు
- హౌరాలో నలుగురిని అరెస్టు చేసిన అబిడ్స్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నగల తయారీ కేంద్రంలో పని చేస్తూ రూ.కోటి విలువైన వజ్రాభరణాలతో ఉడాయించిన కార్మికులను పట్టుకోవడానికి పోలీసులు వారి చుట్టాలుగా మారారు. ఇలానే పశ్చిమ బెంగాల్లోని హౌరాలో గాలించి నలుగురిని అరెస్టు చేశారు. నిందితులను అక్కడి కోర్టులో హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్‌పై సొత్తుతో సహా సిటీకి తీసుకువచ్చినట్లు మధ్య మండల డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఏసీపీ పూర్ణచంద్రర్‌తో కలిసి గురువారం వివరాలు వెల్లడించారు.

ఆర్థిక ఇబ్బందులతోనే...

పశ్చిమ బెంగాల్‌లోని హౌరా పరిసర ప్రాంతాలకు చెందిన హిమాన్షు సర్దార్, మహదేబ్ సర్దార్, ఉత్తమ్ ఓర్హూ ఐదేళ్ల క్రితం బతుకు తెరువు కోసం నగరానికి వలసవచ్చారు. ఉప్పుగూడలోని లలితబాగ్‌లో ఉంటూ అబిడ్స్‌లోని ఆర్‌వీజే ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో కార్మికులుగా పని చేస్తున్నారు. బంగారు, వజ్రాభరణాలు తయారు చేసే ఈ సంస్థకు గోపాల్ కృష్ణ డైరెక్టర్‌గా ఉన్నారు. వీరు కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హిమాన్షు, ఉత్తమ్ కుటుంబీకులు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో వీరికి పెద్ద మొత్తంలో నగదు అవసరమైంది. ఇదే కార్ఖానాలో పని చేసేందుకు మూడు నెలల క్రితం హౌరాకే చెందిన కార్తీక్ బాగ్ వచ్చాడు.

కార్తీక్ సలహాతో...

అప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ముగ్గురూ అతడు ఇచ్చిన సలహా నేపథ్యంలోనే తుది మెరుగుల కోసం యజమాని ఇచ్చిన సొత్తుతో ఉడాయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 18న గోపాల్ కృష్ణ రూ.కోటి విలువ చేసే 83 తులాల బంగారు ఆభరణాలు, 119 క్యారెట్ల వజ్రాలు, విలువైన రాళ్లు వీరికి అప్పగించాడు. ఆ రోజు ఉదయం 11.30 గంటలకు వీటిని తీసుకున్న నలుగురూ ఓ పెట్టెలో పెట్టుకుని మధ్యాహ్నం అక్కడినుంచి ఉడాయించారు. గోపాల్ కృష్ణ ఫిర్యాదుతో అబిడ్స్ ఠాణాలో కేసు నమోదైంది. రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాదరావు, డీఐ బి.అభిలాషతో కూడిన బృందం వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్ ఆధారంగా నిందితులు నలుగురూ ట్యాక్సీ, బస్సుల్లో విజయవాడ వెళ్లి అక్కడ హౌరా వెళ్లే రైలు ఎక్కినట్లు గుర్తించారు.

ఏ మాత్రం సమాచారం అందకుండా...

దీంతో ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుని గోపాల్ కృష్ణ ఇచ్చిన ఆధార్ కార్డుల ఆధారంగా గాలింపు చేపట్టారు. పోలీసుల రాకపై ఏ మాత్రం ఉప్పందినా నిందితులు పారిపోతారని భావించిన పోలీసులు 'చుట్టాలుగా' మారారు. తాము కార్తీక్ ఇంటికి వచ్చిన బంధువులమని, చాలా కాలం తర్వాత రావడంతో ఇల్లు గుర్తించలేకపోతున్నామని, అతడి ఫోన్ పని చేయట్లేదని స్థానికులకు చెప్పారు. అప్పటికే అతడు మిగిలిన ముగ్గురు నిందితులతో పాటు వచ్చి ఉండటంతో వీళ్లూ అతడి బంధువులై ఉండవచ్చునని భావించిన స్థానికులు స్పందించారు. ఇలా ఇంటిని గుర్తించిన టీమ్ స్థానిక పోలీసులను రప్పించి దాడి చేసింది. నలుగురు నిందితులతో పాటు సొత్తునూ స్వాధీనం చేసుకుంది. ఈ బృందాన్ని అభినందించిన డీసీపీ రివార్డు అందించారు.

మామిడి చెట్టు తెచ్చిన తంటా!

- మేడ మీద ఆకులు పడుతున్నాయని పక్కింటివారితో గొడవ
- చెట్టు తొలగించాలని హైకోర్టును ఆశ్రయించిన రిటైర్డ్ టీచర్
- కోర్టు ఆదేశాలతో చెట్టు కొట్టేసిన మున్సిపల్ అధికారులు
- ఎల్బీనగర్ పోలీసులను ఆశ్రయించిన ఇంటి యజమాని
- వృద్ధురాలికి 41-ఏ నోటీసులు జారీ

సాక్షి, సిటీబ్యూరో: 'పచ్చని చెట్లు ప్రగతి మెట్లు' అని నేర్పించాల్సిన టీచర్ బుద్ధే వక్రంగా మారింది. ఇంటి మేడ మీద ఆకులు పడుతున్నాయని, చెట్టు వేర్లు గోడ లోపలికి చొచ్చుకుపోతున్నాయని లేనిపోని తగాదాతో తంటాలు తెచ్చుకుంది ఓ రిటైర్డ్ మహిళా టీచర్. చెట్టును కొట్టేయాలని ఏకంగా హైకోర్టు మెట్లెక్కింది. న్యాయస్థానం ఆదేశాలతో మున్సిపల్ అధికారులు చెట్టును తొలగించారు. దీంతో మొదలైన గొడవ.. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యే వరకు వచ్చింది. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

- రిటైర్డ్ ఉపాధ్యాయురాలు మల్లికాంబ (పేరు మార్చాం) ఎల్బీనగర్‌లోని ఫతుల్లగూడలో నివాసం ఉంటుంది. ఆమె ఇంటి వెనక ఓ కుటుంబం అద్దెకు ఉంటోంది. వారి ఇంట్లో ఉన్న మామిడి చెట్టు కొమ్మలు, ఆకులు వృద్ధురాలి భవనం మేడ మీద పడుతున్నాయని ప్రతి రోజు అద్దెవాసులతో గొడవ పడేది. దీంతో వారు పలుమార్లు కొమ్మలను కొట్టేశారు. అయినా ఓర్వలేక చెట్టు వేర్లు గోడల్లోపలికి వెళుతున్నాయని మళ్లీ గొడవ పెట్టుకుంది. కిరాయిదారులు వినకపోవడంతో చెట్టును తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసింది. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈసారి ఏకంగా హైకోర్టును ఆశ్రయించింది. చెట్టుతో తన ఇంటికి నష్టం వాటిల్లుతోందని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలేదని కోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించింది. చేసేదిలేక సంబంధిత అధికారులు మామిడి చెట్టును కొట్టేశారు.
- ఇటీవల అద్దె వసూలు చేసేందుకు ఇంటికి వచ్చిన యజమాని మామిడి చెట్టు కొట్టేసి ఉండటాన్ని గుర్తించి అద్దెవాసులను ప్రశ్నించాడు. వారు అసలు విషయం చెప్పడంతో మల్లికాంబ, ఇంటి యజమాని, అద్దెదారులకు మధ్య గొడవ జరిగింది. అది కాస్తా పోలీసు స్టేషన్‌కు చేరడంతో.. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన రిటైర్డ్ టీచర్ వాళ్ల మోహం మీదే తలుపులు వేసి లోపలికి వెళ్లిపోయింది. దీంతో ఇరుగు పొరుగును విచారించిన అధికారులకు ఆమె వైఖరి తెలుసుకుని అవాక్కయ్యారు. కాలనీలోని ప్రతి ఒక్కరితోనూ ఆమెకు తగువులాటేనని, ప్రతి చిన్న విషయానికి దూర్భాషలాడుతుందని చెప్పారు.
- అద్దెదారుల ఫిర్యాదు మేరకు మలికాంబపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేసిన పోలీసులు ఆమె వయసును దృష్టిలో ఉంచుకుని అరెస్టు చేయకుండా 41-ఏ నోటీసులు జారీ చేశారు.
- ఇదిలా ఉండగా.. ఎస్సీఎస్టీ కేసులో చార్జిషీటు దాఖలు చేయాలంటే బాధితులు, నిందితులు ఇరువర్గాల కుల ధ్రువీకరణ పత్రం అనివార్యం. దీంతో పోలీసుల సూచన మేరకు ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఆమె ఇంటికి వెళ్లగా.. మీరెవరు, ఎందుకు వచ్చారు. వారిపై విరుచుకుపడింది. దీంతో విస్తుపోయిన అధికారులు అక్కడ్నుంచి వెళ్లిపోయారు. ఎవరెవరో మా ఇంటికి వస్తున్నారని, వేధిస్తున్నారంటూ పోలీస్ స్టేషన్‌లోనూ వాగ్వాదానికి దిగడం కొసమెరుపు.

'లెవెల్స్' రీచ్ కావాలంటూ..

రూ.లక్షలు దోచేశారు..
రిటైర్డ్ ఆర్మీ అధికారి నుంచి రూ.20 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: యూట్యూబ్‌లోని వీడియోస్‌కు లైక్, షేర్, కామెంట్ చేస్తే కోటీశ్వరుడిని చేస్తామంటూ ఓ మహిళ రిటైర్డ్ ఆర్మీ అధికారికి వల వేసి అందినంత దోచేసింది. తీరిగ్గా ఇంట్లో ఉంటున్న సదరు అధికారి సైబర్‌నేరగాళ్లు చెప్పిన మాటలకు విని లింకులు ఓపెన్ చేసి లైక్, కామెంట్, షేర్ చేశాడు. తొలి రోజుల్లో కొంత డబ్బు ఇచ్చి నమ్మకం కలిగించారు. ఆ తర్వాత లెవెల్స్ రీచ్ కావాలంటూ పలు దఫాలుగా రూ.20లక్షలకు పైగా దోచుకున్నారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నగరానికి చెందిన వ్యక్తి ఆర్మీలో ఉన్నతహోదాలో పనిచేసి కొంతకాలం క్రితం రిటైర్ అయ్యారు. ఇటీవల అదవిసారా అనే యువతి టెలిగ్రామ్ ద్వారా అతడికి పరిచయమైంది. ఇంట్లో ఉంటూ బోర్ కొట్టకుండా ఉండేలా ఓ పని చెప్తానంటూ.. అది చేస్తే కోటీశ్వరులు కావొచ్చని ఆశ చూపింది. ఇందుకు అంగీకరించడంతో ఆయనకు తొలి రోజుల్లో యూట్యూబ్ లింకులు పంపి లైక్, కామెంట్, షేర్, సబ్‌స్క్రైబ్ చేసినందుకు డబ్బు ఇచ్చారు. ఆ తర్వాత లెవెల్-ఏ, లెవెల్-బీ అంటూ మాయ మాటలు చెప్పి రూ.20లక్షలు స్వాహా చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

భవనంపై నుంచి కిందపడి విద్యార్థిని మృతి

మియాపూర్: భవనంపై నుంచి పడి ఓ విద్యార్థిని మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్‌లోని రెడ్డికాలనీలో ఉంటున్న వేగుంట సునీల్‌చౌదరి, గీతా లావణ్య దంపతుల కుమార్తె లాస్య చౌదరి(16) బాచుపల్లిలోని వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం చదువుకునేందుకు టెర్రస్ పైకి వెళ్లింది. ఉదయం 5:30 గంటల ప్రాంతంలో ఆమె తల్లి ఇంటి పరిసరాల్లో ఎవరో మూలుగుతున్నట్లు శబ్దం వినిపించి అక్కడి వెళ్లి చూడగా తలకు తీవ్ర గాయాలతో లాస్య కనిపించింది. దీంతో ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. టెర్రస్ పైకి వెళ్లిన లాస్య ప్రమాదవశాత్తు భవనం నుంచి కింద పడిందా...లేదా కిందకు దూకి ఆత్మహత్య చేసుకుందా అనేది తెలియాల్సి ఉంది. తల్లిదండ్రుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అగ్గి పెట్టె కోసం హత్య



మనోజ్‌కుమార్ మృతదేహం

జగద్గిరిగుట్ట: అగ్గి పెట్టె విషయమై చోటు చేసుకున్న వాగ్వాదం ఓ వ్యక్తి హత్యకు దారి తీసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆస్‌బెస్టాస్ కాలనీ, వెంకటేశ్వరనగర్‌కు చెందిన మనోజ్‌కుమార్(23) శుభకార్యాల్లో బ్యాండ్ వాయించేవాడు. బుధవారం రాత్రి అతను ఆస్‌బెస్టాస్ కాలనీ పార్కు వద్ద ఉన్న సంజయ్‌పురి కాలనీకి చెందిన రాజు, రోహన్‌లను అగ్గి పెట్టె అడిగాడు. వారు ఇవ్వకపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి లోనైన రాజు, రోహన్ తమ వెంట తెచ్చుకున్న కత్తితో మనోజ్‌కుమార్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రాజశేఖర్‌కు ఇన్నోవేషన్ లీడర్‌షిప్ అవార్డు



వెంకటేశ్వరకాలనీ: క్రియేటివ్ మల్టీ మీడియా గ్రూపు వ్యవస్థాపకుడు రాజశేఖర్ బుగ్గవీటికి ఇన్నోవేషన్ లీడర్‌షిప్ అవార్డు లభించింది. వరల్డ్ ఇన్నోవేషన్ కాంగ్రెస్ అండ్ అవార్డ్స్ 2023 వేడుకల్లో ఆయనను ఈ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ, డిజైన్ థింకింగ్ ఫర్ ఇన్నోవేషన్ అనే అంశంపై తమ సంస్థ రూపొందించిన లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్ డిజైన్ ఎంతో మందిని ఆకట్టుకుందన్నారు. కొత్త ఆవిష్కరణలే మైలురాయిగా తమ సంస్థ ముందుకు సాగుతోందన్నారు.

లక్ష మంది చిన్నారులకు అంధత్వం రాకుండా కాపాడిన 'ఎల్వీప్రసాద్'

బంజారాహిల్స్: నెలలు నిండకుండా జన్మించిన సుమారు లక్ష మంది నవజాత శిశువులకు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ ద్వారా చికిత్స అందించిఅంధత్వం రాకుండా నివారించ గలిగిందని డాక్టర్ సుభద్ర జలాలి అన్నారు. గురువారం ఎల్వీప్రసాద్ ఆసుపత్రిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ తెలంగాణ, ఏపీ, ఒడిశాలోని తమ నెట్‌వర్క్ సెంటర్లలో నెలలు నిండకుండా పుట్టిన చిన్నారులకు చికిత్స అందించి ఒక మైలురాయిని అధిగమించిందన్నారు. నవ జాత శిశువుల సంరక్షణ, నిర్వహణలో ఎల్వీప్రసాద్, అట్లాస్ ఆఫ్ రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ అండ్ అదర్ నియోనాటల్ రెటినాల్ డిసీజెస్‌ను ప్రారంభించడం మరో ముఖ్యమైన మైలురాయి అన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



అగ్నిప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న రోహిణ్‌రెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని వెంకటేశ్వర నగర్‌లోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని గురువారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి. రోహిణ్‌రెడ్డి పరామర్శించారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని అక్కడి నుంచే ఫోన్‌లో రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శ్రీనివాసయాదవ్, ధన్‌రాజ్ రాథోడ్, భల్లు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సాయం అందించారు.

'ప్రశ్నించే గొంతుకల అణిచివేత'

లిబర్టీ: ప్రశ్నించే గొంతుకలను పాలకులు అణిచివేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. మతోన్మాదులకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని, ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా పేర్కొంటూ కేసులు నమోదు చేస్తూ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. గురువారం ఆయన మాల మహానాడు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ మనుస్మృతి సదస్సులో పాల్గొన్న మేధావులు, రచయితలు, ప్రజాస్వామ్యవాదులు, సంపాదకులను అరెస్టు చేయడంపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. మనువాద పాలకులు ఎప్పుడూ రాజ్యాంగ వ్యతిరేకులేనని అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చివేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను దళిత బహుజనులు అడ్డుకొని ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు.

కల్పవృక్ష వాహనంపై దర్శనమిచ్చిన శ్రీనివాసుడు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వెంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనివాసుడు కల్పవృక్ష వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారికి పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారు సర్వభూపాల వాహనంపై తిరువీధుల్లో ఊరేగారు.

5 కిలో మీటర్లు... 156 నిఘా నేత్రాలు



- నిఘా నీడలో కేబీఆర్ పార్కు.. జీహెచ్ఎంసీ వాక్ వే
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అడుగడుగునా కెమెరాల ఏర్పాటు
- క్షణాల్లో నేరస్తుల ఆచూకీ గుర్తింపు



జీహెచ్ఎంసీ వాక్‌వేలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

బంజారాహిల్స్: అడుగు తీసి అడుగు వేస్తే చాలు.. ఆ జాడలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యేలా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వాక్ వేలో అడుగడుగునా నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. పార్కు చుట్టూ ఉన్న జీహెచ్ఎంసీ వాక్ వేలో ఐదు కిలోమీటర్ల మేర ప్రతి అంగుళం ఫుటేజీలో బందీ అయ్యేలా కెమెరాలను ఏర్పాటు చేశారు.

- రూ. 78 లక్షల వ్యయంతో 156 కెమెరాలు ఏర్పాటు చేశారు.
- గతంలో ఏర్పాటు చేసిన కెమెరాలకు భిన్నంగా ఈసారి ఐదు మెగాపిక్సెల్ మోటారైజ్డ్ విత్ వెరీఫోకల్ లెన్సెస్‌తో ఈ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.
- వీటి ద్వారా ఏ చిన్న పొరపాటు జరిగినా వెంటనే గుర్తించేలా ఈ అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పార్కు చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా పార్కింగ్ స్థలాల్లో కూడా బిగించారు.
- పార్కింగ్ స్థలాల్లోను, పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన కెమెరాల వ్యవస్థను కేబీఆర్ పార్కు లోపల ఉన్న ఆఫీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు.
- ఏదైనా ఘటన జరిగినప్పుడు వెంటనే కెమెరాలు పరిశీలించేందుకు వీలుగా అన్ని సౌకర్యాల మధ్య ఈ వ్యవస్థను ఉంచారు.
- గతంలో జరిగిన కొన్ని ఘటనల్లో నిందితులను వెంటనే పట్టుకోవడానికి ఆస్కారం లేకుండా పోయింది. కొన్ని చోట్ల కెమెరాలు ఉండటం, మరికొన్ని చోట్ల కెమెరాలకు చెట్లకొమ్మలు అడ్డుగా ఉండటం, ఇంకొన్ని చోట్ల వైర్లు కట్ కావడం తదితర అసౌకర్యాలతో ఈ కెమెరాల వ్యవస్థ అధ్వానంగా ఉండేది.
- నిందితులను పట్టుకోవడానికి రోడ్డు బయట షాపులు, హోటళ్లకు ఏర్పాటు చేసిన వ్యక్తిగత సీసీ కెమెరాలను పరిశీలన చేయాల్సి వచ్చేది.
- ఇక నుంచి ఈ సమస్యకు చెక్ పెట్టి పార్కు వాక్ వేలోనే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు వీలుగా అత్యాధునిక సౌకర్యాలతో వీటిని బిగించారు.
- ఐదు మెగా పిక్సల్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఇక్కడ ఇదే ప్రథమం. ఇదిలా ఉండగా కేబీఆర్ పార్కు లోపల కూడా 44 కెమెరాలు పని చేస్తున్నాయి. వీటిని అటవీ శాఖ నిర్వహిస్తోంది. వాక్‌వేలో ఏర్పాటు చేసిన కెమెరాలు మాత్రం బంజారాహిల్స్ పోలీసుల నిర్వహణలో ఉంటాయి.

తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ.8.70 కోట్లు



కార్పొరేటర్లు, జలమండలి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మురుగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.8.70 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, జలమండలి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం తొలి విడతగా రెండు కోట్ల రూపాయలను విడుదల చేసిందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ అవసరం ఉంటే అక్కడ డ్రైనేజీ, తాగునీటి పనులు చేపట్టాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి తాత్సారం చేయవద్దని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వెంగళరావు నగర్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్ పటేల్, జలమండలి జీఎం. హరీష్‌శంకర్, డీజీఎం వాహబ్, మేనేజర్లు రాజేందర్, శ్రీనివాస్, శ్యామ్, రమేష్, వివిధ డివిజన్ల అధ్యక్షులు సంజీవ, సంతోష్, మన్సూర్, అప్పుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 11 నుంచి శ్రీరామ జ్ఞానయజ్ఞం



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: లోక కల్యాణార్థం అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 11 నుంచి 19వ తేదీ వరకు ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీరామ మహా హోమం, జ్ఞానయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ రంగారావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను గురువారం స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, వీహెచ్‌పీ ప్రతినిధి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ .. తెలంగాణలో ఇంత పెద్దెత్తున శ్రీ రామ కథా జ్ఞానయజ్ఞం జరగడం ఇదే మొదటిసారని, 108 యజ్ఞశాలలు ఏర్పాటు చేసి ఈ మహా యజ్ఞం నిర్వహిస్తామన్నారు. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు హోమ యజ్ఞం నిర్వహిస్తామని, తర్వాత ప్రముఖులచే ప్రవచనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గురుచరణ్ తల్వార్, రామెంద్రనాథ్ భరద్వాజ్, ఎన్.శ్రీధర్ రెడ్డి, హరికృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

మీకు అండగా మేముంటాం..



భగ్గీఖానా వాసుల సమస్యలు తెలుసుకుంటున్న విజయారెడ్డి

హిమాయత్‌నగర్: 'మీకు అండగా మేముంటాం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చుతాం' అని ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని భగ్గీఖానా ప్రాంతంలో ఆమె హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న హాత్ సే హాత్ జోడో యాత్రకు మద్దతుగా తాము ఇక్కడ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. భగ్గీఖానాలోని ప్రతి ఒంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతున్నదని, వచ్చాక అందరికీ సమన్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా శివ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఈఐఎస్ వెబ్‌సైట్‌లో పోర్న్ చిత్రాలు

- వెబ్‌సైట్ హ్యాక్ అయ్యిందని సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు
- దర్యాప్తు చేపట్టిన సైబర్‌క్రైం పోలీసులు

హిమాయత్‌నగర్: 'తెలంగాణ స్టేట్ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ(టీఎస్ఈఐఎస్) అధికారిక వెబ్‌సైట్ హ్యాక్‌కు గురైంది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తే దీనిలో పోర్న్ చిత్రాలు ప్రత్యక్షమవుతున్నట్లు సెక్రటరీ హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీపీ కేవీఎం ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ కింద పనిచేసే 'టీఎస్ఈఐఎస్'ను గుర్తు తెలియని వారు హ్యాక్ చేశారు. ఈ వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే దానిలో పోర్న్ కంటెంట్‌తో కూడిన చిత్రాలు, వీడియోలు కనిపిస్తున్నాయి. ఈ వెబ్‌సైట్ స్టూడెంట్స్ వారి తల్లిదండ్రులకు అనుసంధానమై ఉంటుందని, సదరు వెబ్‌సైట్‌లో పోర్న్ కంటెంట్ ఉండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా సొసైటీలో విద్యార్థులపై చెడు ప్రభావం పడే అవకాశం ఉంటుందని సెక్రటరీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపు దుబాయ్‌లో ఎన్టీఆర్, ఘంటసాల శత జయంతి ఉత్సవాలు



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను, కళలను పరిరక్షిస్తూ ప్రభుత్వానికి కళాకారులకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్న కళ సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 25న దుబాయ్‌లో ఎన్టీఆర్, ఘంటసాల శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల కమిటీ చైర్మన్ డాక్టర్ మహ్మద్ రఫీ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని సీనియర్ పాత్రికేయులు మహ్మద్ షరీఫ్, భగీరథ, కలయిక ఫౌండేషన్ చైర్మన్ చేరాల నారాయణ, ఇంటూరు హరికృష్ణలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఎన్టీఆర్ పురస్కారం నటకిరీటి రాజేంద్ర ప్రసాద్‌కు, అంతర్జాతీయ ఘంటసాల శతాబ్ది కళా పురస్కారాలు ఘంటసాల కోడలు కలైమామణి, ఘంటసాల పార్వతి, ప్రముఖ గాయకులు చంద్రతేజకు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్వాతి సంపాదకుడు వేమూరి బలరామ్‌ను ఎన్టీఆర్, ఘంటసాల అంతర్జాతీయ జీవన సాఫల్య పురస్కారం, ఐదు లక్షల నగదుతో సన్మానించనున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఫిలింనగర్: బంజారాహిల్స్ ఉదయ్‌నగర్‌లోని శ్రీ సరస్వతి స్కూల్‌లో గురువారం ఉచిత చర్మవ్యాధి వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీకి చెందిన డెర్మాటిక్, హెయిర్, స్కిన్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు ఎండీ ఇమ్రాన్ అలీ ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 520 మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు.

ప్రోటాన్ బీమ్ థెరపీతో విజయవంతంగా చికిత్స

బంజారాహిల్స్: అపోలో ప్రోటాన్ కేన్సర్ సెంటర్ వైద్యులు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న 11 ఏళ్ల బాలికకు, స్కల్ బేస్ కార్డోమాతో బాధపడుతున్న 16 ఏళ్ల బాలికకు ప్రోటాన్ బీమ్ థెరపీతో విజయవంతంగా చికిత్స నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అపోలో ప్రోటాన్ కేన్సర్ సెంటర్ చెన్నై రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ చిలుకూరి మాట్లాడుతూ, ప్రోటాన్ బీమ్ థెరపీ అనేది ప్రపంచంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యంత అధునాతన రేడియేషన్ థెరపీ చికిత్స అని అన్నారు. ఈ థెరపీ ద్వారా రోగులకు తాము విజయవంతంగా వైద్యసేవలు అందించామన్నారు.

బాబా గుడిలో మహా అన్నదానం

రహమత్‌నగర్: బోరబండ సైట్-1లోని సాయిబాబా గుడిలో గురువారం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త లక్ష్మణ్ గౌడ్, కమిటీ సభ్యులు కృష్ణమోహన్, రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

645 మందికి కంటి పరీక్షలు

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ సర్కిల్-18 పరిధిలోని పంజగుట్ట ప్రతాప్‌నగర్, వెంకటేశ్వరనగర్, ఎన్బీటీనగర్, షేక్‌పేట, ఫిలింనగర్ గౌతంనగర్ కమ్యూనిటీ హాళ్లతో పాటు ఫిలింనగర్‌లోని ఎఫ్ఎన్‌సీసీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాల్లో గురువారం 645 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 179 మందికి కంటి అద్దాల పంపిణీ చేసి, మరో 66 మందికి శస్త్రచికిత్స కోసం సిఫారసు చేశామని డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

13 మంది డ్రంకన్ డ్రైవర్లకు జరిమానా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందుబాబులకు కోర్టు జరిమానా విధించింది. పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా 13 మంది వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వీరిని గురువారం నాంపల్లిలోని 4వ ఎంఎం కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ. 2100ల వంతున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

'నా మాటల మూట' ఆవిష్కరణ

పంజగుట్ట: ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు ఉప్పల గోపాలరావు (ఉగోరా) రచించిన 'నా మాటల మూట' 'ఉగోరా రచనలపై వివిధ రంగాల్లోని ప్రముఖుల అభిప్రాయాలు' అనే పుస్తకాల ఆవిష్కరణ గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఎన్టీవీ సీఈఓ రాజశేఖర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సీనియర్ పాత్రికేయులు దిలీప్ రెడ్డి, విద్యా వెంకట్, ప్రముఖ పద్య కవి డాక్టర్ రాధశ్రీ , సామాజిక కార్యకర్త రవీంద్ర, విశ్రాంత ప్రిన్సిపాల్ విజయగోపాల్, కథా రచయిత గొర్రెపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌కు 'చింతల' టూరిస్ట్

కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



బస్తీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వర కాలనీ: ఎన్నికల సమయంలో నాలుగేళ్లకోసారి ప్రజల ముంగిటకు వచ్చే బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డిని చూసి జనం నవ్వుకుంటున్నారని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11లోని నాయుడు నగర్ బస్తీలో ఆమె పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాము నిత్యం ప్రజల మధ్య ఉంటూ కార్పొరేటర్‌గా వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి ఎలా చేస్తున్నామో డివిజన్ ప్రజలందరికీ తెలుసని అన్నారు. కేవలం ఎన్నికలు దగ్గర పడుతున్నప్పుడే చింతల రాంచంద్రారెడ్డి జనంలోకి వస్తుంటాడని, ఆయన ఖైరతాబాద్ నియోజకవర్గానికి టూరిస్ట్‌లాంటి వారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఆయన నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి భూతద్దంలో పెట్టి వెదికినా ఒక్కటీ కనిపించదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో ఆయనకు కనీసం వేయి ఓట్లు కూడా రావని ఎద్దేవా చేశారు.

యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన



ఫెయిర్‌లో వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని తాజ్‌బంజారా హోటల్‌లో గురువారం టీ-కాలేజ్ డేస్ ఆధ్వర్యంలో యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో 50కి పైగా యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే వారికి టీటీ-కాలేజ్ డేస్, యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్ మంచి వేదిక అని నిర్వాహకులు సంతోష్‌గుప్తా, సంజయ్ గుప్తా తెలిపారు. ఈ ఫెయిర్‌లో మాస్టర్స్, బ్యాచిలర్స్ డిగ్రీలో 500లకుపైగా రిజిస్ట్రేషన్లు వచ్చాయన్నారు. సాధారణంగా అమెరికా యూనివర్సిటీలో అడ్మిషన్లు 60 నుంచి 90 రోజులు తీసుకుంటే ఈ ఫెయిర్‌లో స్పాట్‌లోనే అడ్మిషన్లు నిర్ధారిస్తున్నామన్నారు. వీసా ప్రాసెస్ కూడా తామే చేస్తున్నామని, తమ సంస్థ ద్వారా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు రూ.25 లక్షల మంజూరు



ఐమాక్స్ థియేటర్ ఎదురుగా డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని పలు బస్తీల ప్రజలు ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన గురువారం డివిజన్ పరిధిలోని ఐమాక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న బస్తీల్లో అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ సమస్యలు తలెత్తడానికి గల కారణాలను తెలుసుకున్న ఆయన వెంటనే అధికారులతో సర్వే చేయించి పైప్‌లైన్ పనుల కోసం రూ. 25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నాలుగైదు రోజుల్లో నూతన పైప్‌లైన్ పనులు ప్రారంభమవుతాయని స్థానికులకు ఎమ్మెల్యే తెలిపారు. వాటర్‌వర్క్స్ డీజీఎం శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ, జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు మహేందర్‌బాబు, మహేష్ యాదవ్, రాజు, గంగాధర్ యాదవ్, మురళి, ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బంజారానగర్ సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యేను కలిసిన బంజారానగర్‌వాసులు

రహమత్‌నగర్: తమ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బోరబండ డివిజన్ బంజారానగర్ వాసులు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు విజ్ఞప్తి చేశారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలో బుధవారం వారు ఎమ్మెల్యేను కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. తమ బస్తీలో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. స్పందించిన ఆయన వెంటనే బంజారానగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యేను కలిసిన వారి బస్తీ అధ్యక్షుడు యాదయ్య, వెంకటేశ్, రాజు, బస్తీ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు తెలియజేయాలి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బంగారు శృతి


రహమత్‌నగర్: డివిజన్ పరిధిలోని హబీబ్ ఫాతిమా నగర్‌లో బుధవారం రాత్రి బీజేపీ కార్నర్ మీటింగ్ జరిగింది. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్, జూబ్లీహిల్స్ ఎస్సీ సెల్ కన్వీనర్ రాంధారి బాబా నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి బంగారు శృతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని సూచించారు. జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు కనకరాజు, నీలం రతన్‌కుమార్, కళావతి, శ్రీజిత్ కుమార్, ఆనంద్, గణేష్, మహేష్, మనోజ్, నాందెడ్ కాశీ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

దిగజారిన 'ఈనాడు'

- అసత్య ప్రచారం మరోసారి బట్టబయలు
- ఏపీ ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మండిపాటు


అమర్


కొమ్మినేని

సాక్షి, అమరావతి: సీహెచ్ రామోజీరావు సారథ్యంలోని ఈనాడులో నిజాయితీ లోపించిందని.. మోసపూరిత, కుట్ర పూరిత అసత్య ప్రచారం మరోమారు తేటతెల్లమైందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా, అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావులు మండిపడ్డారు. పాత ఫొటోలతో పాఠకులను మోసం చేయడం దురదృష్టకరమని గురువారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అసలు నిజం బయట పడ్డాక, అది సాంకేతిక లోపం వల్ల జరిగిందంటూ లోపలి పేజీలో సింగిల్ కాలమ్ వార్తతో సమర్థించుకునే యత్నం మరీ అభ్యంతరకరంగా ఉందన్నారు. ప్రభుత్వంపై, పోలీసులపై ప్రజల్లో వ్యతిరేకత పెంచే లక్ష్యంతో రాసినట్లున్న ఆ కథనంలో 2021 ఫిబ్రవరి 3వ తేదీ నాటి ఫొటోలను ముద్రించడం దారుణమని వ్యాఖ్యానించారు. ఆ ప్రకటనల్లో వారు ఇంకా ఏమేం చెప్పారంటే.. టీడీపీ నేత పట్టాభికి సంబంధించిన వార్తలు బ్యానర్ గానే కాకుండా.. పుంఖానుపుంఖాలుగా మూడు పేజీల్లో పరిచిన తీరు ఆశ్చర్యం కలిగించింది. ఈనాడు తన వివరణను, విచారాన్ని మొదటి పేజీలో వేసి ఉంటే పత్రికా ప్రమాణాలను పాటించినట్లుండేది. తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు నాయుడుకు వత్తాసు పలికే క్రమంలో రామోజీరావు, ఆయన మీడియా నిస్సిగ్గుగా విశ్వసనీయతనే పణంగా పెట్టి అభూత కల్పనలకు పాల్పడి పరువు పోగొట్టుకుంది. ఈ ఘటనతో అయినా కళ్లు తెరవాలి. తాము ఏం రాసినా జనం నమ్మేస్తారనుకుని ఇంతకాలం జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఈనాడు వంకర రాతల గుట్టును సోషల్ మీడియా రట్టు చేసింది. పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వేధించారన్న పట్టాభి మాటలను పట్టుకుని, కనీసం విచారించకుండానే ప్రభుత్వ ప్రతిష్ట దిగజార్చాలనుకోవడం తగదు. ఈనాడుతో పాటు చంద్రబాబు విధేయ పత్రికలు, న్యూస్ చానల్స్ తమ వంకర, పక్షపాత, కుట్రపూరిత, మోసపూరిత ధోరణులకు ఇకనైనా స్వస్తి చెప్పాలి.

కట్టుకథలు రాస్తున్న

ఈనాడుపై జనాగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా 'ఈనాడు' ప్రతులు దహనం.. ఉవ్వెత్తున ఎగిసిన నిరసనలు

- పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో తప్పుడు కథనం
- సోషల్ మీడియాలో బట్టబయలు కావడంతో లోపలి పేజీలో సవరణ
- రామోజీ తీరుపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల మండిపాటు
- ఈ పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికని నినాదాలు
- చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతో దిగజారిన పాత్రికేయం
- చంద్రబాబు మేలే లక్ష్యంగా రామోజీరావు కుట్ర సిద్ధాంతం


కొయ్యలగూడెంలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, అమరావతి: ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'ఈనాడు'పత్రిక అసత్య కథనాలు వండి వారుస్తోందని, వారికి అనుకూలమైన చంద్రబాబును సీఎంను చేయాలనే కుట్రతో దిగజారుడు వార్తలు ప్రచురిస్తోందని ఏపీ వ్యాప్తంగా నిరసన ఎగసిపడింది. తప్పుడు వార్తలు రాసి.. ప్రజలను మోసం చేస్తున్న ఈనాడు పత్రిక ప్రతులను గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా సంఘాలు, సోషల్ యాక్టివిస్టులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో దహనం చేశారు. రామోజీరావు ఇంతగా దిగజారిపోవడం దారుణం అని ఛీకొట్టారు. పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, ప్రభుత్వం మీద బుదరజల్లడానికి ఈనాడు చేసిన కుట్ర మరోసారి బట్టబయలు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వెత్తున నిరసనలు ఎగిసిపడ్డాయి. వైఎస్సార్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉన్న సెంటర్లల్లో ఈనాడు రామోజీ రావు విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అవి 2021లోని ఫొటోలని సోషల్ మీడియా ద్వారా వైరల్ కావడంతో ఎవరికీ కనిపించని రీతిలో రెండో పేజీలో సింగిల్ కాలంలో 'సవరణ'వేసి చేతులు దులుపుకుందని ఆందోళనకారులు మండిపడ్డారు. ఈనాడు పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికి అని పెద్ద ఎత్తున నినదించారు. చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతోనే ఈనాడు పత్రిక దిగజారుడు వార్తలు, కథనాలు రాస్తోందని మంత్రులు ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చి, చంద్రబాబుకు ప్రజలను చేరువ చేయాలని రాజగురువు రామోజీ కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు దుయ్యబట్టారు. అసత్యాలను ప్రచారం చేస్తున్న ఈనాడు పత్రికను బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

ఇవి సోషల్ మీడియా రోజులు

పట్టాభి అనే వ్యక్తి జాతీయ నేతలా ఎల్లో మీడియా జాకీలు వేసి లేపుతోందని, ఇవి ఎల్లో మీడియా రోజులు కావని.. సోషల్ మీడియా రోజులు అని ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎల్లో మీడియా అని ముద్దుగా పిలుచుకునే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, అనుబంధ సంస్థలు ప్రచురిస్తున్న, చూపుతున్న వార్తలు, కథనాలు చూస్తుంటే ఇంకా దిగజారిపోవడానికి వారికి మెట్లు ఏమీ లేవు అని నిరూపించుకున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు మాత్రమే బాగుండాలనేది రామోజీరావు సిద్ధాంతం.. రామోజీరావుకు వయసు పెరిగి.. బుద్ధి మందగించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తూర్పారబట్టారు. కుట్రల రామోజీని బట్టలూడదీసి ప్రజల ముందు నిలబెడతామని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) హెచ్చరించారు. దుష్ప్రచారం చేసేటప్పుడు బ్యానర్ ఐటమ్స్.. సవరణకు మాత్రం సింగిల్ కాలమా? అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు నిలదీశారు. రామోజీ ఆరాటమే తప్ప.. చంద్రబాబుకు రాజకీయ భవిష్యత్ లేదని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సంబంధం లేని ఫొటోలను ప్రచురించి ప్రజలను మోసం చేయాలని ఈనాడు యాజమాన్యం కుట్ర చేసిందని, సోషల్ మీడియా దెబ్బకు దిగొచ్చిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ శాసన సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు.

రామోజీరావు దిష్టి బొమ్మ దహనం

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన ప్రభుత్వంపై ఈనాడు విషం చిమ్ముతుండటాన్ని ప్రజలు ఛీకొడుతున్నారని విజయవాడలో పలువురు నేతలు మండిపడ్డారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ మంటల్లో ఈనాడు ప్రతులను తగులబెట్టారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి తప్పుకుంటున్నాం

ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు దివాకర్

సాక్షి, అమరావతి: జాయింట్ యాక్షన్ కమిటీలో ఉన్న సంఘాల సమష్టి నిర్ణయం మేరకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ తప్పుకుంటోందని ఆ కమిటీ చైర్మన్ వీఎస్ దివాకర్ స్పష్టం చేశారు. ఇక నుంచి తమకు ఆ సంఘంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చర్యల వల్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున, ఉద్యోగులందరూ ఆ సంఘానికి దూరంగా ఉండాలని సూచించారు. గురువారం ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం తాడేపల్లిలో నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. 'ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వంపై పబ్లిసిటీ కోసం గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం అభ్యంతరకరం. ఈ ఘటన వల్ల ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయి'అని తెలిపారు.



కొత్త గవర్నర్‌తో సీఎం దంపతుల భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీర నజీర్‌లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డి గురువారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న సీఎం దంపతులకు గవర్నర్ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, రాజ్‌భవన్ అధికారులు స్వాగతం పలికారు. సీఎం జగన్ దంపతులు గవర్నర్ దంపతులను శాలువతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ సీఎం జగన్‌ను శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా నియమితులైన అబ్దుల్ నజీర్ బుధవారం రాత్రి విజయవాడకు చేరుకున్న విషయం తెలిసిందే. ఆయన శుక్రవారం గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారు.

బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

- పట్టాభి ఘటనపై రామోజీకి ఏపీ మంత్రి అంబటి అల్టిమేటం
- నేటి సాయంత్రం వరకు గడువు ఇస్తున్నాం
- క్షమాపణ కోరకుంటే నేరపూరిత పరువు నష్టం దావా వేస్తాం
- రామోజీ అక్రమ సామ్రాజ్యానికి రక్షకుడు చంద్రబాబే



సాక్షి, అమరావతి: తప్పుడు కథనాలను ప్రచురిస్తున్న ఈనాడుపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో వైఎస్సార్‌సీపీ యుద్ధం చేస్తుందని ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. పట్టాభి ఘటనలో సాంకేతికంగా జరిగిన తప్పులకు చింతిస్తున్నట్లుగా ఎవరికీ కనపడకుండా రామోజీరావు నాలుగు ముక్కలను ప్రచురించడం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రంలోగా ప్రభుత్వానికి బహిరంగ క్షమాపణ చెప్పకుంటే నేరపూరిత పరువు నష్టం దావా (క్రిమినల్ డిఫర్మేషన్) వేస్తామని హెచ్చరించారు. మంత్రి అంబటి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

టీడీపీ పోర్న్ స్టార్లతో బూతులు..

రాజకీయంగా కథ ముగిసిన చంద్రబాబు పునరుజ్జీవం కోసం సీఎం జగన్, ప్రభుత్వంపై బురద జల్లుతూ తప్పుడు కథనాలను ప్రచురిస్తారా? టీడీపీ పోర్న్ స్టార్‌లు పట్టాభి, లోకేశ్, చింతకాయల అయ్యన్నలతో సీఎం జగన్‌ను బూతులు తిట్టిస్తూ చంద్రబాబు సైకోలా ఆనందిస్తుంటే ఆర్థిక నేరగాడు రామోజీరావు వాటిని ప్రచురించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. మార్గదర్శి ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడి రూ.వేల కోట్లతో రామోజీ నిర్మించుకున్న అక్రమ సామ్రాజ్యానికి చంద్రబాబు రక్షకుడిలా వ్యవహరిస్తున్నారు. రామోజీ ఆరాటమేగానీ రాజకీయంగా చంద్రబాబు బతికి బట్టకట్టడం అసాధ్యం.

ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా కె.జానకీరామిరెడ్డి మరోసారి గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి ఉప్పుటూరు వేణుగోపాలరావుపై 20 ఓట్ల తేడాతో గెలిచారు. మొత్తం 1,438 ఓట్లు పోల్ కాగా.. జానకీరామిరెడ్డికి 703, వేణుగోపాలరావుకు 683, మరో అభ్యర్థి డీఎస్ఎన్‌వీ ప్రసాద్‌బాబుకు 38 ఓట్లు వచ్చాయి. కొన్ని ఓట్లు చెల్లలేదు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి గెలుపొందడం ఇది వరుసగా రెండోసారి. కాగా ఉపాధ్యక్షుడిగా పీఎస్‌పీ సురేష్‌కుమార్ గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి తుహిన్ కుమార్‌పై 52 ఓట్ల తేడాతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా వి.సాయికుమార్, సంయుక్త కార్యదర్శిగా సాల్మన్ రాజు, కోశాధికారిగా బీవీ అపర్ణలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శిగా జ్ఞానేశ్వరరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి పితాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా అన్నం శ్రీధర్, మారుతి విద్యాసాగర్, కాశీ అన్నపూర్ణ, షేక్ ఆసిఫ్, శాంతికిరణ్, శరత్, అచ్యుత రామయ్య విజయం సాధించారు.

నగర వార్తలు

కోర్టు నుంచి నిందితుడి పరారీ

- సైబర్ మోసం కేసులో అరెస్టయిన నైజీరియన్
- కూకట్‌పల్లి కోర్టు ఆరవణ నుంచి పరారైన నిందితుడు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ, మహారాష్ట్ర పోలీసుల కళ్లుగప్పి.. న్యాయస్థానం నుంచే పరారయ్యాడు ఓ మోస్ట్ వాంటెడ్ నైజీరియన్ నేరస్తుడు. సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన సైబర్ నేరం కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేయగానే.. డ్రగ్స్ కేసులో ముంబై పోలీసులు అరెస్టు చేసేందుకు యత్నించారు. నిందితుడు చాకచక్యంగా ఇరు రాష్ట్రాల పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న ఘటన కూకట్‌పల్లి పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

- నైజీరియాకు చెందిన ఒకో రోకో ఇకాబ్ (35) సైబరాబాద్ పరిధిలోని ఓ వ్యక్తిని రూ. 26 లక్షలు మోసగించాడు. నిందితుడు ముంబైలో ఉన్నట్లు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. అక్కడి పోలీసుల సహకారంతో నైజీరియన్‌ను అరెస్టు చేశారు. ఒకో రోకో ఇకాబ్‌పై ముంబైలో గతంలో మాదక ద్రవ్యాల కేసు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.
- తొలుత సైబరాబాద్ పోలీసులు నిందితుడిని గుర్తించడంతో సైబర్ నేరం కేసులో నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి.. వారెంట్‌పై ముంబై కేసులోనూ అరెస్టు చేద్దామని అక్కడి పోలీసులు భావించారు. ఈక్రమంలో నైజీరియన్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసి గురువారం కూకట్‌పల్లిలోని ఎనిమిదో మెట్రోపాలిటన్ న్యాయమూర్తి భవాని ఎదుట హాజరుపరిచారు. రిమాండ్ ఇవ్వగానే వెంటనే అరెస్టు చేసేందుకు ఐదుగురు ముంబై పోలీసులు కోర్టు బయట వాహనంలో ఎదురు చూస్తున్నారు.
- పోలీసులు భావించినట్లుగా నిందితుడిని రిమాండ్‌కు తరలించకుండా.. వ్యక్తిగత పూచీకత్తు మీద న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. దీంతో ముంబై పోలీసులు అవాక్కయ్యారు. అప్పటికే న్యాయస్థానం నుంచి బయటికి వచ్చిన నైజీరియన్.. ముంబై పోలీసులు అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని గమనించాడు. గుర్తు తెలియని వ్యక్తులు తనను ఎత్తుకెళ్తున్నారని గట్టిగా కేకలు వేశాడు. విషయం తెలుసుకున్న న్యాయమూర్తి భవాని.. నైజీరియన్, ముంబై పోలీసులను తన ముందుకు రావాలని ఆదేశించారు. తాను బెయిల్ మంజూరు చేసిన వ్యక్తిని కోర్టు పరిసరాల్లో ఎలా అరెస్టు చేస్తారని ముంబై పోలీసులను ప్రశ్నించారు. అత్యుత్సాహం చూపిన ముంబై పోలీసులపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి పోలీసులను ఆదేశించింది. ఈ క్రమంలో నిందితుడు పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు.

ఆస్పత్రులు ఆలయాలతో సమానం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


గోపన్‌పల్లితండాలో ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హఫీజ్‌పేట్: ఆస్పత్రులు ప్రజలకు దేవాలయాలతో సమానంగా మారాయని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గోపన్‌పల్లి తండాలో ప్రైవేట్ హాస్పిటల్‌ను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... డాక్టర్లు పేదలకు వైద్య సేవలను అందించేందుకు ఎప్పుడూ ముందుండాలన్నారు. ముఖ్యంగా పేదలు, మధ్య తరగతి ప్రజలు నివాసముండే ప్రాంతాల్లో ఆస్పత్రులను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపాలని సూచించారు. పేదలకు అధునాతన సేవలతో కూడిన వైద్య సేవలను అందించేందుకు డాక్టర్లు కృషి చేయాలని, వారికి స్థానికులు సహకారం అందించాలన్నారు.

చిన్నప్పుడు తిరిగిన ప్రాంతం...

అభివృద్ధిలో జమీన్ ఆస్మాన్ ఫరక్

తాను చిన్నప్పుడు తిరిగిన ఈ ప్రాంతంలో అభివృద్ధి జమీన్ ఆస్మాన్ ఫరక్‌లా ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గుర్తు చేశారు. ఒకప్పుడు అత్యంత వెనుకబడిన ప్రాంతాలైన గౌలిదొడ్డి, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లితండా వంటి ప్రాంతాలలో స్కూల్ ఉండేదని, అక్కడికి వచ్చేవారమని పేర్కొన్నారు. ప్రస్తుతం కళ్లు మూసుకొని, కళ్లకు గంతలు కట్టుకొని ఇక్కడికి వచ్చి చూస్తే ఏ దేశంలో మనం ఉన్నామని అనిపించేలా నిర్మాణాలు, సౌకర్యాలు కనిపిస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలో ఐటీ సంస్థలు ఇక్కడకు చాలా వచ్చాయని, వాటితో జరిగిన అభివృద్ధి ఊహించనదని అన్నారు. మౌలిక వసతులు, శాంతిభద్రతల పరిరక్షణతోనే ఈ ప్రాంతాలు అన్నివిధాలా అభివృద్ధి చెందాయని మంత్రి స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున కంపెనీలు వచ్చాయన్నారు. మా పాలమూర్ జిల్లాకు చెందిన వారిలో ఏటా 14 లక్షల మంది వలసలు వెళ్లే వారని, ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ ఉపాధి కోసం వలస వస్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ గుర్తు చేశారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే సి.రామ్మోహన్‌రెడ్డి, తెల్లాపూర్ కౌన్సిలర్ లచ్చిరామ్‌నాయక్, టీఎస్ లెజిస్లేటివ్ అసెంబ్లీ మీడియా అడ్వైజర్ కమిటీ మాజీ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, పలువురు ఆస్పత్రి డాక్టర్లు పాల్గొన్నారు.

గూగుల్ మద్దతుతో

'ఉమెన్ ఇంజినీర్స్ ప్రోగ్రామ్'

రాయదుర్గం: గ్లోబల్ ఎడ్‌టెక్ కంపెనీ, ట్రాన్స్‌ఫర్మేషనల్ డీప్‌టెక్ ప్రోగ్రాంలను అందించడంలో మార్కెట్ లీడర్ అయిన టాలెంట్‌స్ప్రింట్ తన ఉమెన్ ఇంజినీర్స్ (డబ్ల్యూఈ) ప్రోగ్రామ్ అయిదవ ఎడిషన్‌ను గురువారం ప్రకటించింది. గూగుల్ మద్దతులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 5వ బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది ఈ ప్రోగ్రామ్ అంతర్జాతీయంగా పోటీతత్వం కలిగిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా మారేందుకు దేశవ్యాప్తంగా 200 మంది మొదటి ఏడాది చదువుతున్న మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులను గుర్తించడం, ఎంపిక చేయడం, శిక్షణ ఇవ్వడం, ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రోగ్రామ్‌కు ఎంపికైన ప్రతి విద్యార్థినికి వంద శాతం ఫీజు స్కాలర్‌షిప్, లక్ష రూపాయల నగదు స్కాలర్‌షిప్‌గా లభిస్తుంది. గూగుల్ జీఎం శివ్‌వెంకటరామన్ మాట్లాడుతూ... మా భవిష్యత్తు విమెన్ లీడర్లను టెక్ పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతించడానికి ఎదురు చూస్తున్నామన్నారు. టాలెంట్‌స్ప్రింట్ సీఈఓ, ఎండీ శంతను పాల్ మాట్లాడుతూ... 2019లో ప్రారంభించిన టాలెంట్ స్ప్రింట్ విమెన్ ఇంజినీర్స్ ప్రోగ్రాంను గూగుల్ మద్దతుతో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.

'ఉస్మానియా'లో వైద్య విద్యార్థుల ధర్నా


ధర్నా చేస్తున్న దంత వైద్య విద్యార్థులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా దంత వైద్యశాలలో వైద్య విద్యార్థులు ఆందోళనకు దిగారు. తరగతులను బహిష్కరించి కళాశాల ప్రవేశం ద్వారం వద్ద బైఠాయించి ప్లకార్డులు పట్టుకుని మాకు న్యాయం జరగాలి, డీఎంఈ రావాలి, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాల ప్రాంగణంలో ఉన్న దంత వైద్య విద్యార్థులను వసతి గృహం ఖాళీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ప్రిన్సిపాల్ ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే...

నాలుగేళ్ల బీడీఎస్ వైద్య విద్యార్థుల వార్షిక పరీక్షలు ఇటీవలే ముగిశాయి. కొత్తగా బీడీఎస్‌లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు చేరారు. పాత విద్యార్థులు ఖాళీ చేయాల్సిందిగా గతంలోనే ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు గదులకు తాళాలు వేసుకొని వెళ్లారు. గత్యంతరం లేని స్థితిలో కొత్తగా చేరిన విద్యార్థులకు వరండా పక్కనే ఉన్న ఉస్మానియా వైద్య కళాశాలలో వసతి కల్పించాం. హౌస్ సర్జన్ విద్యార్థులు నిబంధనల ప్రకారం వసతి గృహంలో ఉండే సదుపాయం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖాళీ చేయాలని ఆదేశించాం.

– డాక్టర్ అరుణ, ప్రిన్సిపాల్

పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డికి

అరుదైన గౌరవం

యువ ఐఏఎస్‌లకు పాఠాలు చెప్పే అవకాశం



అల్వాల్: సేంద్రియ వ్యవసాయంలో నిష్ణాతుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. ముస్సోరీలోని లాల్‌బహదూర్ శాస్త్రి అకాడమీలో యువ ట్రెయినీ ఐఏఎస్‌లకు పాఠాలు చెప్పాలని ఆయనకు ఆహ్వానం అందింది. గత ఏడాది డిసెంబర్ 22వ తేదీన ముస్సోరిలో ప్రారంభమైన యువ ఐఏఎస్‌ల శిక్షణ శిబిరం మార్చి 12వ తేదీ వరకు కొనసాగుతుంది. 'కిసాన్ సంవాద్– అభ్యుదయ రైతుల నుంచి నేర్చుకోవడం' అనే కార్యక్రమం కింద' సేంద్రియ వ్యవసాయంపై మార్చి 7వ తేదీన పాఠాలు చెప్పాలని చింతల వెంకట్‌రెడ్డిని అకాడమీ డైరెక్టర్ అభిరామ్ జి.శంకర్ ఆహ్వానించారు. వెంకట్‌రెడ్డితో పాటు ఆయన సహాయకుడికి టికెట్ చార్జీలు, బస ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ శిక్షణతో యువ ఐఏఎస్‌లు దేశంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అందరికీ సేంద్రియ వ్యవసాయం పట్ల అవగాహన కలగాలని పద్మశ్రీ వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రకృతి ఆధారంగా వ్యవసాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

'ఆర్గాన్ డొనేషన్ క్యాంపెయిన్ ఆన్ వీల్స్' ప్రారంభం


వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వాహనాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో తయారు చేసిన ఆర్గాన్ డొనేషన్ క్యాంపెయినర్ ఆన్ వీల్స్ వాహనాన్ని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... అవయవాల దానం ద్వారా ఏడుగురి ప్రాణాలను రక్షించవచ్చని, ప్రతి ఒక్కరూ తమ అవయవాలను దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే జయచంద్ర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 400 మంది తమ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తొలిసారి ఎక్కడా లేని విధంగా ఇంటి వద్దనే అవయవ దాన రిజిస్ట్రేషన్ చేసేలా ఆర్గాన్ డొనేషన్ క్యాంపెయిన్ ఆన్ వీల్స్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఈ వాహనంలో ఒక స్క్రీన్ ఏర్పాటు చేసి అవయవ దానంపై ప్రజలకు అవగాహన కలిపిస్తామన్నారు. కార్యక్రమంలో రావినూతల రమాకాంత్, చల్లారామ్ కళ్యాణ్, స్వప్న రెడ్డి, చపాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జయా జైట్లీకి జీవన సాఫల్య పురస్కారం

ఘనంగా సన్మాన్ అవార్డుల ప్రదానోత్సవం


జీవనసాఫల్య పురస్కారం పొందిన జయా జైట్లీ

బంజారాహిల్స్: హస్తకళాకారులను ప్రోత్సహించడం, సంప్రదాయ కళలను వెలుగులోకి తీసుకురావడం లక్ష్యంగా విజయవంతంగా ముందుకు సాగుతున్న క్రాఫ్ట్స్ ఆర్ట్స్ ఆఫ్ తెలంగాణ దేశంలో వివిధ సంస్థల ద్వారా జాతీయ అవార్డు పొందిన కళాకారులను ఘనంగా సత్కరించింది. సన్మాన్ పేరుతో గురువారం బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని సీసీటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ గీతారాం ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను ఘనంగా సత్కరించారు. వివిధ రంగాలలో విశేష కృషి చేస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్న న్యూ ఢిల్లీకి చెందిన జయా జైట్లీకి సీసీటీ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ఇందులో భాగంగా బిద్రి క్రాఫ్ట్‌లో జాస్తి రామయ్య సన్మాన్ అవార్డును గులాం తాహేర్ సిద్దిఖీకి, ఫుల్కారీ ఎంబ్రాయిడరీలో కళాంజలి సన్మాన్‌ను గుర్వీందర్ కౌర్ గుణ్‌దేవ్‌కు, కళాపురి ఫౌండేషన్‌కు సీసీటీ గుర్తింపు అవార్డును, వెంకటగిరి జామ్దానీలో ప్రఖ్యాతి చెందిన పట్నం సుబ్రమణ్యంకు లలితా ప్రసాద్ సన్మాన్ అవార్డును, డోక్రా క్రాఫ్ట్‌లో ప్రఖ్యాతి చెందిన నాగార్జున మాధవికి గౌరవ కిలలారు సన్మాన అవార్డును తంజావూరు పెయింటింగ్‌లో ప్రఖ్యాతి పొందిన సి.నటరాజన్‌కు, పింగెళి కమలారెడ్డి సన్మాన అవార్డును కచ్ ఎంబ్రాయిడరీలో ప్రఖ్యాతి పొందిన ప్రకాశ్ నారంగ్ సిజ్జుకు సీసీటీ అవార్డ్ ఆఫ్ రికగ్నైజేషన్ అవార్డును, నేచరల్ ఫైబర్ క్రాఫ్ట్ ద్వారా గుర్తింపు పొందిన తంగ జ్యోతికి సీసీటీ గుర్తింపు అవార్డును అందజేశారు. మొత్తం 12 మంది కళాకారులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీసీటీ చైర్మన్ అనురాధ బిష్ణోయ్, కార్యదర్శి హేమలత కెమ్కా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో సీసీటీ ఆవరణలో ఈ కళాకారుల ప్రదర్శన, కళాకారులు రూపొందించిన ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

గాజుల అందం

రంగు వెలసిన వెడల్పాటి గాజులను వాడకుండా పక్కన పడేయటం ఇళ్లలో సాధారణంగా జరుగుతుంటుంది. వాటితో జరీ అంచును ఇలా అందంగా తయారుచేసుకోవచ్చు.





1. పాత సిల్క్, జరీ అంచు ఉన్న చీరను ఎంపిక చేసుకోవాలి. జరీ అంచు బాగుంటే, దానిని చీర నుంచి కట్ చేసుకోవాలి.
2. ఎంపిక చేసుకున్న గాజుకు కట్ చేసిన జరీ అంచును చుట్టి, అన్నివైపులా గ్లూతో అతికించాలి.
3. ఎక్కడా జరీ పోగులు బయటకు రాకుండా సరి చూసుకోవాలి.
4. పూర్తిగా గాజు తయారీ పూర్తయ్యాక ఫ్యాబ్రిక్ చివర్లు కూడా బయటకు కనిపించకుండా అతికించాలి.
5. రెండు రకాల గాజు మోడల్స్ తయారు చేసుకొని, కాంబినేషన్‌గా ధరించవచ్చు.



ఫ్యాషన్

సంప్రదాయ వేడుకలలో
జరీ అంచు చీరల రెపరెపలు మనకు పరిచయమే.
పువ్వులు, హంసలు, గోపురపు డిజైన్లతో అవి అందంగా ఆకట్టుకుంటాయి.
వాటిని అంచు వరకే ఎందుకు పరిమితం చేయాలనే ఆలోచనతో
ఆభరణంగా రూపుకడుతున్నారు డిజైనర్లు.
పాత చీరెల అంచులైనా
కొత్తగా మార్కెట్లో లభించే జరీ బార్డర్స్ అయినా
ఇలా మనసుదోచేలా మురిపిస్తున్నాయి.

జరీ అంచు ఆభరణం



సంప్రదాయ వేడుకలు

వేడుకకు తగినట్టు డ్రెస్ ఎంపిక ఉంటుంది. దానికి మ్యాచింగ్‌గా ఈ జరీ మాలలు మరింత అందాన్ని తీసుకువస్తున్నాయి.



ఫ్యాబ్రిక్ రోలర్

నూలు దారాలను ఉండగా చేసి, వాటికి కట్ చేసుకున్న బార్డర్‌ని అతికించి, కావల్సిన పరిమాణంలో ఫ్యాబ్రిక్ బీడ్స్‌ను తయారు చేసుకోవచ్చు.

లాకెట్స్‌తో ప్రత్యేకం

ముగ్గు, గోపురం, దేవతా మూర్తుల లాకెట్స్‌ని ఈ జరీ అంచు చెయిన్స్‌కు జత చేయచ్చు. లేదంటే, బార్డర్ ఫ్యాబ్రిక్‌నే లాకెట్‌లా తయారు చేసి, వేసుకోవచ్చు.

















బీడ్స్‌తో జత కట్టి

రంగు రంగుల పూసలను ఎంపిక చేసుకొని, వాటితో జరీ బాల్స్‌ను జత చేసి దండగా సిద్ధంగా చేసుకోవచ్చు.



విశేషం

శిక్షణలో మహిళా రెజ్లర్లు

అమ్మాయిలకు మాత్రమే

ఆ కుస్తీ శాలకు వెళితే 35 మంది యువతులు భారీ కసరత్తులు చేస్తూ కనిపిస్తారు. హర్యానాలోని సోనిపట్‌లో 'యుద్ధవీర్ అఖాడా' మహిళా రెజ్లర్ల గురుకులంగా వాసికెక్కింది.

ఉదయం 4.30 గంటలు.

ఆ అమ్మాయిలంతా లేచి మొదట చేయవలసిన పని బాదం పప్పును మెత్తగా నూరి చిక్కటి పాలతో తీసుకోవడం. ఆ తర్వాత శరీరంలో చురుకుదనం తెచ్చే చిన్నపాటి వ్యాయామాలు చేయడం. ఆ తర్వాత వ్యాయామ స్థాయిని పెంచుకుంటూ పోవడం. ఆపై గోదాలో దిగి ఒకటి రెండు కుస్తీలు ఆడటం. ఉదయం 8.30 వరకూ ఈ శిక్షణ సాగుతుంది. ఏ మాత్రం మార్పు ఉండదు. మళ్లీ సాయంత్రం ఇలాగే నాలుగు గంటల శిక్షణ ఉంటుంది.

ఢిల్లీకి గంటన్నర దూరంలో ఉన్న సోనిపట్ (హర్యాణ) అనే ఒక మోస్తారు పట్టణం శివార్లలో ఆవాల చేల పక్కన ఉన్న 'యుద్ధ్‌వీర్ అఖాడా' కేవలం మహిళా రెజ్లర్లకు ఉద్దేశించబడినది. దీనిని స్థాపించిన యుద్ధవీర్ స్వయంగా కుస్తీ యోధుడు. విశాలమైన ఈ శిక్షణా కేంద్రంలో గోడల నిండా అతడు తెచ్చిన మెడల్స్ వేలాడదీసి ఉంటాయి. ప్రస్తుతం అతడు ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నందువల్ల అతని తండ్రి, శిక్షకులు ఈ అమ్మాయిలకు ట్రైనింగ్ ఇస్తున్నారు.

2016 నుంచి వచ్చిన ఊపు

హర్యాణలో ఆడపిల్లలకు త్వరగా పెళ్లి చేసి పంపడం, ఆటలకు దూరంగా ఉంచడం ఆనవాయితీ. అయితే 2016 రియో ఒలింపిక్స్‌లో హర్యాణ నుంచి సాక్షి మాలిక్ ఒలింపిక్స్‌లో పతకం తేవడంతో ఒక్కసారిగా ఆ రాష్ట్రమంతా మహిళా కుస్తీ గురించి చర్చించుకోవడం మొదలెట్టింది. అదే సంవత్సరం ఆమిర్‌ఖాన్ 'దంగల్' వచ్చి ఆడపిల్లల కుస్తీని కథాంశంగా చూపి సూపర్‌హిట్ కొట్టడంతో అక్కడి తల్లిదండ్రులు, ఆడపిల్లలు కుస్తీని తమ భవిష్యత్తుకు ఒక మంచి మార్గంగా భావించారు. అది గమనించిన యుద్ధ్‌వీర్ ఆ మరుసటి సంవత్సరం ఈ అకాడెమీని తెరిచాడు.

గురుకుల విద్య

యుద్ధ్ వీర్ అఖాడాలో 10 ఏళ్లు నిండిన వయసు నుంచి 15 ఏళ్ల లోపు చేరవచ్చు. 20 ఏళ్ల వయసు వచ్చేవరకు సాధన చేయాల్సి వుంటుంది. అన్నాళ్లు అక్కడే ఉండిపోవాలి. అయితే ఈ విద్య ఉచితం కాదు. ఒక్కో స్టూడెంట్ నెలకు కనీసం 15 వేలు చెల్లించాలి. శిక్షణ ఇస్తూ మంచి ఆహారం కూడా ఇవ్వాలంటే కనీసం ఈ మాత్రం ఫీజు అవసరం అని నిర్వాహకులు అంటారు. సంప్రదాయ జిమ్‌తో పాటు కొయ్యదుంగను ఈడ్చడం, టైర్లను సుత్తితో బాదడం, మట్టి గోదాలో కుస్తీ ఆడటం వంటి శిక్షణ ఉంటుంది. నడుముకు బలం రావడానికి, చేతుల్లో ఒడుపు రావడానికి రకరకాల వ్యాయామాలు చేయిస్తారు.

అలంకరణ లేదు

ఇక్కడ చేరే అమ్మాయిలందరూ మిలట్రీలో లాగా క్రాఫ్ చేయించుకోవాల్సి ఉంటుంది. టీషర్టులు, ట్రాక్ ప్యాంట్లు తప్పనిసరి. గబుక్కున చూస్తే వీరంతా అబ్బాయిలకు మల్లే కనిపిస్తారు. ఆదివారం రోజు ఇచ్చే వెసులుబాటులో సరదాగా వంట చేయడం, ఆ సాయంత్రం నృత్యంతో సేద తీరడం చేస్తారు. 'మేమంతా స్నేహితులమే అయినా గోదాలో ఉన్న కాసేపు శత్రువులమే' అని నవ్వుతారు. 'ఓడినవారు ఐదు నిమిషాల్లో మాట కలిపేయాలి అనేది నియమం' అంటారు.

ఆశలు... ఆకాంక్షలు

ఇక్కడ చేరిన వారంతా ఇప్పటికే అండర్ 15, అండర్ 17 కుస్తీ పోటీల్లో జాతీయ స్థాయిలో ఆడి పతకాలు తెస్తున్నారు. జూనియర్ ఛాంపియన్ బిపాష దహియా ఇక్కడ ఇంకా శిక్షణలో ఉంది. కామన్‌వెల్త్, ఒలింపిక్స్‌లో ఆడి ప్రభుత్వ ఉద్యోగాలు తెచ్చుకోవాలని, ఆర్మీలో చేరాలని వీరంతా భావిస్తున్నారు. 'మేము ఐదుగురం అక్కాచెల్లెళ్లం. కొడుకు లేని కారణాన మా నాన్న మాలో ముగ్గుర్ని ఇక్కడికి పంపించాడు. మేము దృఢంగా, బలంగా ఉండాలని ఆయన కోరిక' అని ఒకమ్మాయి అంది. సమాజంలో స్త్రీలపై ఉండే వివక్ష, హింసను తట్టుకోవడానికి మానసికంగా, శారీరకంగా బలంగా ఉండటానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అమ్మాయిలు భావిస్తున్నారు.

రెండు నిమిషాల్లో ఎత్తి కిందపడేయగల వీరిని చూస్తే ఎవరైనా సరే ఒళ్లు దగ్గర పెట్టుకోక తప్పదు మరి.

వైరల్

శ్రమజీవనమే పరమానందం

'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్' అన్నాడు దేవదాస్.
బాధ సంగతేమిటోగానీ కష్టంలోనే సౌఖ్యాన్ని వెదుక్కుంది చెన్నైకి చెందిన పరమేశ్వరి.
తన కుటుంబాన్ని పోషించుకోవడం కోసం గత ఇరవై సంవత్సరాలుగా రోజుకు మూడు ఉద్యోగాలు చేస్తోంది...



పరమేశ్వరి

పేద ఇంట్లో పుట్టి పెరిగింది పరమేశ్వరి. అష్టకష్టాలు పడి కూతురి పెళ్లి చేశారు తల్లిదండ్రులు. వారి సంతోషం కరిగిపోయి విషాదంగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. దీనికి కారణం... అల్లుడు. అతడు పనిచేసేవాడు కాదు. పైగా మద్యానికి బానిస.

పెళ్లితో కష్టాలన్నీ తీరుతాయి అనుకున్న పరమేశ్వరి పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అయింది. ఇల్లు దాటి పని చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి ఎదురైంది. కొన్ని సంవత్సరాల తరవాత చెల్లి భర్త చనిపోయాడు. ఆమె అక్క దగ్గరకి వచ్చేసింది.

భర్త, పిల్లలు, తల్లి, చెల్లి, ఆమె కూతురు... వీరిని పోషించాలంటే ఒక్క ఉద్యోగం చేస్తే సరిపోదనే విషయం పరమేశ్వరికి అర్థమైంది. అలా రోజుకు మూడు ఉద్యోగాలు చేయడం మొదలుపెట్టింది. పొద్దున నాలుగు గంటలకు లేచి ఒకరి ఇంట్లో ఇంటిపనులు చేస్తుంది.

ఆ తరువాత ఒక ఐటీ కంపెనీలో పని చేస్తుంది (ఉద్యోగులకు టీ, కాఫీలు అందించడం)

సాయంత్రం ఒక హోటల్‌లో పాత్రలు శుభ్రం చేస్తుంది. పరమేశ్వరి ఇంటికి వెళ్లేసరికి రాత్రి పదకొండు అవుతుంది. తన మాటల్లోనే చెప్పాలంటే ఆమెకు వీకెండ్స్, హాలిడేలు, సన్‌డేలు లేవు.

'కష్టాల మధ్య పెరిగాను. అందుకే కష్టపడడాన్ని భారంగా, బాధగా భావించడం లేదు. జీవితం అంటేనే పోరాటం. ఆ పోరాటంలో ప్రతిరోజూ కష్టపడాల్సిందే. సుఖంలోనే కాదు కష్టపడడంలోనూ సంతోషాన్ని వెదుక్కోవచ్చు' అంటుంది చెన్నైలోని ఎంజీఆర్ నగర్‌కు చెందిన 36 సంవత్సరాల పరమేశ్వరి.

పరమేశ్వరికి ఒక కల ఉంది.

సొంతంగా ఒక ఇల్లు, ఒక వెహికిల్ ఉండాలి.

అదృష్టం అనేది కష్టపడేవారి అడ్రస్ వెదుక్కుంటూ వస్తుంది అంటారు. పరమేశ్వరి కోసం ఏ అదృష్టం వెదుక్కుంటూ రాలేదుగానీ తన శ్రమ ఫలితమే ఇల్లుగా, వాహనంగా మారాయి. సంపాదించిన దానిలో ఎంతో కొంత దాచుకునేది. అలా ఆమె తన కలను నెరవేర్చుకుంది. ఈ సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని 'హ్యూమన్స్ ఆఫ్ మద్రాస్' అనే సంస్థ పరమేశ్వరి గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పరమేశ్వరి శ్రమైక జీవనసౌందర్యాన్ని నెటిజనులు వేనోళ్ల పొగిడారు.

హెయిర్ కేర్ టిప్స్

ప్రతి రోజూ పది నుంచి పదిహేను నిమిషాలపాటు తలకు మసాజ్ చేసినట్లయితే జుట్టు కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం తగ్గుతుంది. రోజూ తలస్నానం చేసేవాళ్లు తల రుద్దుకునేటప్పుడే పది నిమిషాల సేపు మసాజ్ చేసినట్లు రుద్దితే రెండు పనులూ అవుతాయి.

ఉసిరిక పొడి, కుంకుడుకాయ, శీకాయపొడి అన్నీ సమపాళ్లలో అంతా కలిసి రెండు టేబుల్‌స్పూన్లు ఉండేటట్లు చూసుకోవాలి. ఇందులో కోడిగుడ్డు సొన కలిపి అవసరమైతే కొద్దిగా నీటిని కలిపి పేస్టు చేసుకుని తలంతా పట్టించి పది నిమిషాల సేపు మసాజ్ చేయాలి. మసాజ్ పూర్తయిన తర్వాత ఇరవై నిమిషాలకు కడిగేయాలి. అవసరమనిపిస్తే కొద్దిగా గాఢత తక్కువగా ఉన్న షాంపూ వాడవచ్చు. వారానికి కనీసం మూడుసార్లు చొప్పున నెల రోజుల పాటు ఈ ట్రీట్‌మెంట్ చేస్తే హెయిర్ లాస్‌ను పూర్తిగా నివారించవచ్చు.



హెయిర్‌లాస్‌ను కంట్రోల్ చేయడానికి ఆముదం, బాదం నూనె చక్కటి కాంబినేషన్. ఈ రెండింటినీ సమపాళ్లలో తీసుకుని గోరువెచ్చగా చేసి తలకు పట్టించి మసాజ్ చేయాలి. మసాజ్ పూర్తయిన అరగంటకు తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే మంచిఫలితం ఉంటుంది. ఆముదం, బాదం బదులుగా కొబ్బరి నూనెను కూడా వాడవచ్చు.

రోజూ పది నిమిషాల సేపు ఆల్మండ్ ఆయిల్‌తో తలకు మసాజ్ చేస్తే జుట్టు రాలదు.

వంటిల్లు

ఎండకు చల్ల గొడుగు

ఇంట్లో పెరుగు ఉంటే
ఒంట్లో వేడి పెరగదు

మార్చి నెల రానేలేదింకా...
వాతావరణం మారిపోయింది.
ఎండకు గొడుగు పట్టాల్సిందే.
ఇంట్లోనే 'చల్ల' గొడుగు పడదాం.
పెరుగు చిలికి... లస్సీ చేద్దాం.



రోజ్ లస్సీ

కావలసినవి: పెరుగు – 2 కప్పులు; చల్లటి నీరు – కప్పు; చక్కెర లేదా తేనె – 3 టేబుల్ స్పూన్‌లు; రోజ్ సిరప్ – 2 టేబుల్ స్పూన్‌లు; పిస్తా – 10 (పలుకులు చేయాలి).


తయారీ: మిక్సీ జ్యూస్ జార్‌లో పెరుగు, రోజ్‌సిరప్, చక్కెర, నీరుపోసి బ్లెండ్ చేయాలి. రుచిని బట్టి మరింత తీపి కావాలనుకుంటే మరో రెండు స్పూన్‌ల చక్కెర వేసి కరిగే వరకు కొద్దిసేపు బ్లెండ్ చేయాలి. గ్లాసులో పోసి పిస్తాతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.



కేసర్ ఇలాచీ ...

కావలసినవి: పెరుగు – 2 కప్పులు; కుంకుమ పువ్వు రేకలు – 2; తేనె– 3 టేబుల్ స్పూన్‌లు; యాలకులు – 6 (తొక్క వేరు చేసి గింజలను పొడి చేయాలి); బాదం తరుగు – టేబుల్ స్పూన్; పిస్తా – టేబుల్ స్పూన్.

తయారీ: ఒక పాత్రలో బాదం, పిస్తా మినహా పైన తీసుకున్న అన్నింటినీ వేసి బీటర్‌తో రెండు నిమిషాల సేపు చిలకాలి. తీపి సరి చూసుకుని అవసరమైతే మరికొంత తేనె వేసి కలిసేవరకు చిలకాలి. ఈ మిశ్రమాన్ని గ్లాసుల్లో పోసి పైన బాదం, పిస్తాతో అలంకరించి సర్వ్ చేయాలి. ఇది మధ్యాహ్న భోజనంలో భాగంగా తీసుకుంటే బాగుంటుంది.



మసాలా చాస్

కావలసినవి: పెరుగు – కప్పు; జీలకర్ర పొడి – అర టీ స్పూన్; చాట్ మసాలా – పావు టీ స్పూన్; నల్ల ఉప్పు – చిటికెడు; అల్లం తురుము – పావు టీ స్పూన్; పచ్చిమిర్చి – 1 (తరగాలి); మిరియాల పొడి – పావు టీ స్పూన్; ఇంగువ – చిటికెడు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పుదీనా – 5 ఆకులు; కొత్తిమీర తరుగు – టీ స్పూన్; మంచి నీరు – 4 కప్పులు.

తయారీ: ఒక పాత్రలో పెరుగు, జీలకర్ర, చాట్ మసాలా, జీలకర్ర పొడి, నల్ల ఉప్పు, అల్లం తరుగు, పచ్చిమిర్చి తరుగు, మిరియాలపొడి, ఇంగువ, ఉప్పు వేసి బీటర్‌తో బాగా చిలకాలి. ఇప్పుడు నీటిని పోసి అరనిమిషం పాటు చిలకాలి. చివరగా పుదీన, కొత్తిమీర వేసి తాగడమే. రోజూ ఉదయం బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు తాగితే ఎండ వేడిమి బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు.



స్వీట్ మింట్ ...

కావలసినవి: పెరుగు – కప్పు; తేనె– 2 టేబుల్ స్పూన్‌లు; పుదీన ఆకులు – అర కప్పు; జీడిపప్పు – 20 (వలిచినవి); బాదం – 10 (తరగాలి); పిస్తా – 10 (తరగాలి); మంచి నీరు – 4 కప్పులు.

తయారీ: జీడిపప్పులను చిన్న పలుకులు చేసి, బాదం తరుగు, పిస్తా తరుగులో కలిపి పక్కన ఉంచుకోవాలి. మిక్సీ జార్‌లో పెరుగు, పుదీన, తేనె వేసి బ్లెండ్ చేయాలి. నీటిని కలిపి మరోసారి కలిసేలా తిప్పాలి. ఈ లస్సీని గ్లాసుల్లో పోసి బాదం, పిస్తా, జీడిపప్పుతో అలంకరించి సర్వ్ చేయాలి. ఇష్టమైతే ఐస్‌క్యూబ్స్ వేసుకోవచ్చు.



కేసర్ పిస్తా ...

కావలసినవి: పెరుగు – కప్పు; చక్కెర లేదా తేనె – టేబుల్ స్పూన్; క్రీమ్– పావు కప్పు; కుంకుమ పువ్వు– పది రేకలు; పిస్తా – టేబుల్ స్పూన్; మంచి నీరు – 4 కప్పులు.

తయారీ: మిక్సీజార్‌లో పిస్తా, పెరుగు, క్రీమ్, చక్కెర లేదా తేనె, కుంకుమ పువ్వు నాలుగు రేకలు వేసి బ్లెండ్ చేయాలి. ఈ లస్సీని గ్లాసులో పోసి ఐస్ క్యూబ్స్ వేసి పైన రెండు కుంకుమ పువ్వు రేకలతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.



పైనాపిల్ ...

కావలసినవి: పైనాపిల్ ముక్కలు – అర కప్పు; చక్కెర – పావు కప్పు; పెరుగు – 2 కప్పులు; క్రీమ్ – పావు కప్పు; పుదీనా – 4 ఆకులు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి;

తయారీ: పెనం వేడి చేసి పైనాపిల్ ముక్కలు, చక్కెర వేసి సన్న మంట మీద కలుపుతూ మగ్గనివ్వాలి. సుమారుగా మూడు నిమిషాల సేపటికి ముక్కలు మెత్తబడతాయి. ఆ తర్వాత చల్లారే వరకు పక్కన ఉంచాలి. ఒక పాత్రలో పెరుగు, క్రీమ్ వేసి బీటర్‌తో బాగా చిలకాలి. ఇందులో ఉడికించిన పైనాపిల్ మిశ్రమాన్ని వేసి చిలకాలి. ఈ లస్సీని గ్లాసులో పోసి పుదీనాతో అలంకరించి ఐస్ క్యూబ్స్ వేసి సర్వ్ చేయాలి. చల్లగా చిక్కగా ఇష్టపడే వాళ్లు ఓ అరగంట ఫ్రిజ్‌లో పెట్టి చల్లబడిన తరవాత తాగవచ్చు.

యువర్స్

■ ఇంగ్లీష్ ఇడియమ్



ఒక విషయం గురించి విన్నప్పుడు ఆహా అనిపిస్తుంది. తీరా వాస్తవం తెలిశాక 'వామ్మో' అనిపిస్తుంది. చూడడానికి అమాయకంగా కనిపించే వ్యక్తి కరడుగట్టిన హంతకుడు అని తెలిస్తే షాక్ అవుతాం. అసలు స్వభావానికి విరుద్ధంగా కనిపించే మాయ చేసే వారి విషయంలో ఉపయోగించే ఇడియమ్...నైట్‌మేర్ డ్రెస్డ్ లైక్ ఏ డే డ్రీమ్. ఐరిష్, స్కాటిష్ జానపద కథల్లో నుంచి పుట్టిన ఇడియమ్ ఇది. ఈ కథల్లో ఒక పాత్ర పగలు అందమైన అమ్మాయిలాగా కనిపించి, రాత్రి మాత్రం క్రూరమైన రాక్షసిగా మారి రక్తపాతం సృష్టిస్తుంటుంది. ఈ పాత ఇడియమ్ అమెరికన్ పాప్ సింగర్ టేలర్ స్విఫ్ట్ పాట 'బ్లాంక్ స్పేస్'తో బాగా పాపులర్ అయింది. పాటలో 'డార్లింగ్ ఐయామ్ ఏ నైట్‌మేర్ డ్రెస్డ్ లైక్ ఏ డే డ్రీమ్' అనే వాక్యం కనిపిస్తుంది.

■ సమ్‌థింగ్ స్పెషల్

అవును... ఇది నిజమే!



● జపాన్‌లోని ఆసోచి కొండల్లో 'విండ్ ఫోన్' అనే టెలిఫోన్ బూత్ ఉంది. 'విండ్ ఫోన్ ఏమిటి? అక్కడెక్కడో కొండల్లో ఉండడం ఏమిటి?' అనుకుంటున్నారా! విషయంలోకి వస్తే...2011లో జపాన్‌లో భూకంపం వచ్చి ఎంతోమంది చనిపోయారు. చనిపోయిన వారితో ఆత్మీయులకు మాట్లాడే అవకాశం లేదు. వారు ఎక్కడో ఉన్నట్లుగానే భావించి ఫోన్‌లో మాట్లాడి మనసులో ఉన్న బాధను దించుకోవడమే ఈ 'విండో ఫోన్' ఉద్దేశం. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లో కూడా 'విండ్ ఫోన్'లు ఏర్పాటయ్యాయి.

● పెరూలో 'టకనాకుయ్' పేరుతో ప్రతి సంవత్సరం 'ఫైటింగ్ ఫెస్టివల్' జరుగుతుంది. 'టకనాకుయ్' అంటే ఒకరితో ఒకరు తలపడడం. అంతమాత్రాన ఈ ఫైటింగ్ ఫెస్టివల్‌లో రక్తం కారేలా కొట్టుకోరు. ఒక విధంగా చెప్పాలంటే ఉత్తుత్తి ఫైటింగ్ అన్నమాట! మనసులో ఉన్న కోపం, ఒత్తిడి, ఆందోళనను వదిలించుకోవడానికి ఈ 'ఫైటింగ్ ఫెస్టివల్' ఉపయోగపడుతుందనే నమ్మకం ఉంది. దీనికి ఎంతో పురాతనమైన చరిత్ర ఉంది.

■ కాలనాళిక

టైమ్ కాప్స్యూల్ 2047



కాలంతో పాటు నడవడం ఎంత ముఖ్యమో భవిష్యత్ దార్శనికత కూడా అంతే ముఖ్యం.
టైమ్ క్యాప్స్యూల్ అనేది మన వర్తమాన,భవిష్యత్ ఆలోచనల సమ్మేళనం.
ఐఐటీ, ఢిల్లీ శాస్త్రవేత్తలు ఇటీవల రూపొందించిన కాలనాళిక (టైమ్ క్యాప్స్యూల్) సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఇండియా @ 2047' పై అభిప్రాయాలను సేకరించి ఇందులో భద్రపరిచారు. ఈ టైమ్ క్యాప్స్యూల్‌ను స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేశారు. దీని బరువు 75 కిలోలు.
ఈ కాలనాళికను 2047లో తెరుస్తారు. భవిష్యత్‌కు సంబంధించిన మన ఆశాజనకమైన అంచనాలు వాస్తవమైతే అంతకంటే సంతోషం ఏమున్నది!

■ యంగ్ టాలెంట్

మంచుఖండం మనసైన సాహసం



హసన్ అరుణ్

అంటార్కిటికా విహారం తెర మీద చూసినంత సౌకర్యంగా ఉండదు. కానీ మాటల్లో చెప్పలేనంత ఆహ్లాదంగా ఉంటుంది జర్నీ. అంటార్కిటికా గురించి తెలుసుకోవాలంటే స్వయంగా పర్యటించాల్సిందే అనుకున్నాడు హైదరాబాద్ కుర్రాడు హసన్ అరుణ్. లండన్, కింగ్స్ కాలేజ్‌లో ఎకనమిక్స్ చదువుతున్న అరుణ్ గత డిసెంబర్‌లో అంటార్కిటికా సాహసయాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. విశేషాలను లండన్ నుంచి సాక్షితో పంచుకున్నాడు.

మూడు సముద్రాల కలయిక

''అంటార్కిటికా గురించి తెలుసుకోవాలని ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఇంటర్నెట్‌లో ఉన్న సమాచారం నాకు సంతృప్తినివ్వలేదు. స్వయంగా ఎక్స్‌ప్లోర్ చేయాల్సిందే అనుకున్నాను. ఆ అడ్వెంచర్‌ని ఎంజాయ్ చేయాలని కూడా. హైదరాబాద్ నుంచి గత డిసెంబర్ 21వ తేదీ బయలుదేరి దాదాపుగా ఒక రోజంతా ప్రయాణం చేసిన తర్వాత బ్రెజిల్ లోని 'రియో డీ జెనీరో'మీదుగా అర్జెంటీనా రాజధాని 'బ్యూనోస్ ఎయిరిజ్'కి చేరాను. అక్కడ మూడు రోజులున్నాను. ప్రపంచం అంచు అని చెప్పే 'ఉషుయాయియా' ను చూశాను. అంటార్కిటికా క్రూయిజ్ అక్కడి నుంచే మొదలవుతుంది. ఉషుయాయియా నుంచి 26వ తేదీ ఉదయం క్రూయిజ్ ప్రయాణం మొదలైంది. బీగెల్ చానెల్‌లో సాగుతుంది క్రూయిజ్ ప్రయాణం. డ్రేక్ ప్యాసేజ్ మీదుగా ఒకటిన్నర రోజు ప్రయాణించాలి. ఈ జర్నీలో అత్యంత క్లిష్టమైన ప్రదేశం ఇదే. అట్లాంటిక్, పసిఫిక్, సదరన్ ఓషన్ ఈ మూడు సముద్రాలు కలిసే ప్రదేశం ఇది. అలలు నాలుగు మీటర్ల నుంచి పదకొండు మీటర్ల ఎత్తు లేస్తుంటాయి. సీ సిక్‌నెస్ వచ్చేది ఇప్పుడే. తల తిరగడం, వాంతులతో ఇబ్బంది పడతారు. సిక్‌నెస్ తగ్గడానికి మందులు, సీ బ్యాండేజ్ ఇస్తారు. ఈ స్థితిలో నిద్ర సమయం కూడా పెరుగుతుంది. ఉష్ణోగ్రత మైనస్ రెండు ఉంటుంది. క్రూయిజ్ లోపల ఏసీ ఉంటుంది, కాబట్టి ఇబ్బంది ఉండదు. ఓపెన్ ప్లేస్‌లో నాలుగైదు నిమిషాలకంటే ఎక్కువసేపు ఉండలేం. అలలు పైకి లేచినప్పుడు అంత భారీ క్రూయిజ్ కూడా నీటి తాకిడికి కదిలిపోతుంటుంది. అలలు ఆరు మీటర్ల ఎత్తు వస్తున్నంత వరకు ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. అంతకు మించితే మాత్రం క్రూయిజ్ ఆగాల్సిందే. లంగరు వేసి వాతావరణం నెమ్మదించిన తర్వాత కదులుతుంది. మా జర్నీలో నాలుగు మీటర్లకు మించలేదు, కాబట్టి ఆగాల్సిన అవసరం రాలేదు.

నేలను పలకరిస్తూ నీటిలో ప్రయాణం

వెడెల్ సీలోకి ప్రవేశించామంటే అంటార్కిటికా ఖండంలోకి అడుగుపెట్టినట్లే. వెడెల్ సీ లో దాదాపు సగం రోజు సాగుతుంది ప్రయాణం. గ్లేసియర్‌లు, ఐస్ బెర్గ్‌లు, పర్వతాలు, పెంగ్విన్ కాలనీలు, వేల్స్, సీల్స్ కనిపిస్తుంటాయి. అంటార్కిటికా చేరిన తర్వాత ఆరు రోజుల పాటు రోజుకు రెండు దీవులు లేదా ద్వీపకల్పాల మీద ల్యాండ్ అవుతూ ఆరు రోజుల్లో పన్నెండింటిని కవర్ చేశాను. జనవరి రెండవ తేదీ తిరుగు ప్రయాణం. 'బ్యూనోస్ ఎయిరిజ్' నుంచి నేను లండన్‌కి వచ్చేశాను.

రోజంతా పగలే!

అంటార్కిటికాలో రోజంతా నింగికీ నేలకూ మధ్యనే గడిపినప్పటికీ ఆ వారం రోజులూ సూర్యాస్తమయాన్ని చూడలేకపోయాను. సూర్యుడు చండప్రచండంగా ఉదయించే ఉన్నాడు. ఇది అద్భుతమైన అనుభూతి. కాలుష్యం అంటే ఏమిటో తెలియని స్వచ్ఛమైన నీరు, లెక్కకు మించిన హిమనీనదాలు, గుంపుల కొద్దీ పెంగ్విన్‌లు, సహజమైన దారుల్లో ట్రెకింగ్ నాకు మరిచిపోలేని జ్ఞాపకాలు. నేను అడ్వెంచర్స్‌ని బాగా ఇష్టపడతాను, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లో కూడా ట్రెకింగ్ చేశాను. కానీ అంటార్కిటికా ట్రెకింగ్ సహజత్వం ఒడిలో సాగిన సాహసం అనిపించింది''.

మనిషి వల్లే హాని

అంటార్కిటికా గురించి ప్రయాణంలోనే ఎక్కువ తెలుసుకోగలిగాను. క్రూయిజ్‌లో మెరైన్ ఇంజనీర్‌లు, సైంటిస్టులు, నేచరిస్టులు కూడా ఉంటారు. ఒక ప్రదేశానికి వెళ్లడానికి ముందు ఆ ప్రదేశం వివరాలు, అక్కడ మెలగాల్సిన విధానం కూడా చెప్తారు. పెంగ్విన్‌లకు కనీసం ఐదు మీటర్ల దూరంగా ఉండాలని, మనుషుల నుంచి వాటికి ఇన్‌ఫెక్షన్ సోకితే ఏకంగా వేలకొద్దీ ఉన్న కాలనీలే తుడిచిపెట్టుకుపోతాయని తెలిసింది. మనిషి ఎంత హానికారకుడో, ప్రకృతికి ఎంత పెద్ద శత్రువో మొదటిసారి తెలిసింది. వాళ్లు పర్యాటకులను ఆహ్వానిస్తూనే మంచుఖండం పర్యావరణ సమతుల్యతను పరిరక్షించుకుంటున్నారు. ఇక్కడ పర్యటించడానికి డిసెంబర్ రెండవ వారం నుంచి జనవరి మొదటి వారం వరకు అనుకూలమైన సమయం.

– హసన్ అరుణ్,
సాహస యాత్రికుడు

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి

■ గేమింగ్ నేడే విడుదల



అతడి అడుగులో ప్రతి అంగుళం ఆయుధమే!

రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ 'ఆక్టోపాత్ ట్రావెలర్-2' నేడు విడుదల అవుతోంది. 2018లో వచ్చిన 'ఆక్టోపాత్ ట్రావెలర్'కు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ ఇది. ఈ ఆటలో ఎనిమిది క్యారెక్టర్లు ఉంటాయి. ప్రతి క్యారెక్టర్‌కు తనదైన ప్రత్యేకత ఉంటుంది. 'హికారి' ఒక యోధుడు...ఏ జర్నీ ఫర్ హోమ్ 'అగ్నేయ' ఒక డాన్సర్...ఏ జర్నీ ఫర్ స్టార్‌డమ్ 'పార్టిటియో' ఒక వ్యాపారి...ఏ జర్నీ ఫర్ ప్రాస్పెరిటీ 'బస్వాల్ట్' ఒక విద్యావేత్త....ఏ జర్నీ ఫర్ రివెంజ్ 'థ్రోన్' ఒక దొంగ...ఏ జర్నీ ఫర్ ఫ్రీడమ్ 'టిమోనస్' ఒక మతగురువు...ఏ జర్నీ ఫర్ ట్రూత్ 'వోచెట్' ఒక హంటర్...ఏ జర్నీ ఫర్ లెజెండ్స్ 'కస్టీ' ఒక మందుల వ్యాపారి...ఏ జర్నీ ఫర్ మెమోరీస్. ఈ టర్న్-బేస్డ్ బ్యాటిల్ గేమ్‌లో ప్రతి ఎనిమీకి కొన్ని బలహీనతలు ఉంటాయి. అయితే సులభంగా కనుక్కునేలా ఉండవు. అవి ఏమిటో తెలుసుకుంటే ఆటలో అడుగులు ముందుకుపడతాయి. ఈ గేమ్‌లో డే టైమ్, నైట్ టైమ్ అనే రెండు సెగ్మెంట్‌లు ఉంటాయి. డే టైమ్‌లో ఆడే విధానానికి, నైట్ టైమ్‌లో ఆడే విధానానికి తేడా ఉంటుంది. డే టైమ్‌లో ఆడాల్సి వస్తే కొత్త స్కిల్స్‌లో ప్రావీణ్యం సంపాదించాల్సి ఉంటుంది.

జానర్: రోల్ ప్లేయింగ్ **మోడ్స్:** సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్, ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, విండోస్

■ టెక్...టాక్

వివో వి27 ప్రో



సైజ్: 6.78 అంగుళాలు **బరువు:** 182 గ్రా.
మెమోరీ: 128 జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్ 256జీబి 12జీబి ర్యామ్
డిస్‌ప్లే: 1080×2400 పిక్సెల్స్
ఫీచర్స్: డ్యూయల్-ఎల్‌ఈడీ ఫ్లాష్ **వోఎస్:** ఆండ్రాయిడ్ 13, ఫన్‌టచ్ 13
కలర్స్: బ్లాక్, మింట్

రీయూజబుల్ నోట్‌బుక్



పేపర్ వృథా కాకుండా రూపొందించిన ఎకో-ఫ్రెండ్లీ రీయూజబుల్ నోట్‌బుక్ ఇది.
బ్రాండ్: రాకెట్ **సైజ్:** 8.5×9.5
పేజీలు: 82 ● పైలట్ ఫ్రిక్షియన్ పెన్

డెస్క్‌టాప్ వాక్యూమ్ క్లీనర్



బ్రాండ్: రెమ ఎక్స్‌ఎక్స్ **ఫిల్టర్ టైప్:** ఫోమ్
● **మల్టీపుల్:** డెస్క్‌టాప్, లాప్‌టాప్...మొదలైనవి.
● హైస్పీడ్ సెంట్రిఫిగల్ ఫ్యాన్ ● **ఫామ్ ఫ్యాక్టర్:** హ్యాండ్ హెల్డ్

■ బ్రెయిన్ జిమ్

ప్రశ్న స్థానంలో ఉండాల్సిన నంబర్ ఏమిటి?

70	91	120
14	13	24
5	7	?

ఫటాఫట్ ధనాధన్

జవాబు:

70/14=5 91/13=7 120/24=5

సినిమా

గుడ్ మార్నింగ్ అమెరికా!



● రామ్‌చరణ్

అమెరికాలోని ప్రముఖ టెలివిజన్ టాక్ షో 'గుడ్ మార్నింగ్ అమెరికా'లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు రామ్‌చరణ్. హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డుల వేడుకలో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన ఆయన ఈ షోలో సందడి చేశారు. ఇందులో భాగంగా 'ఆర్ఆర్ఆర్'తో పాటు వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు రామ్‌చరణ్. ''ఆర్ఆర్ఆర్' స్నేహం నేపథ్యంలో సాగుతుంది. మా దర్శకుడు రాజమౌళిని మేం ఇండియన్ స్పీల్‌బర్గ్ అని పిలుస్తాం. తన తర్వాతి చిత్రంతో ఆయన గ్లోబల్ సినిమాలోకి అడుగుపెడతారనుకుంటున్నాను. ఇక భారతీయ సినిమా చరిత్రలో తొలిసారి ఓ పాట ('ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు..') బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్‌కి నామినేట్ కావడం మాకెంతో గర్వంగా ఉంది'' అన్నారు చరణ్. కాగా 'గుడ్ మార్నింగ్ అమెరికా' షోలో పాల్గొన్న తొలి తెలుగు నటుడు రామ్‌చరణ్ కావడం విశేషం. 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ రేసులో ఉన్న నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాల్లో భాగంగా యూనిట్ అక్కడకు వెళుతోంది. చరణ్ కూడా అందుకే వెళ్లారని, ఎన్టీఆర్ కూడా వెళతారని టాక్.

200 థియేటర్స్‌లో రీ రిలీజ్.. ఆస్కార్ అవార్డ్స్ వేడుక మార్చి 12 (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13)న లాస్ ఏంజిల్స్‌లో జరగనుంది. అవార్డ్స్ వేడుకకు పది రోజుల ముందు (మార్చి 3న) అమెరికాలోని 200 థియేటర్లలో 'ఆర్ఆర్ఆర్'ని రీ రిలీజ్ చేయనున్నట్లు వేరియన్స్ ఫిలింస్ ప్రకటించింది. డిమాండ్‌ని బట్టి థియేటర్ల సంఖ్య పెంచుతామని కూడా ఆ సంస్థ తెలిపింది.

అమెరికాకు ఉపాసన.. ప్రముఖ అమెరికన్ గైనకాలజిస్ట్ జెన్నిఫర్ ఆస్టన్ 'గుడ్ మార్నింగ్ అమెరికా' షోలో కో హోస్ట్‌గా పాల్గొన్నారు. ఈ షోలో రామ్‌చరణ్‌ని 'త్వరలో తండ్రి కాబోతున్నారు.. ఆ అనుభూతి ఎలా ఉంది?' అని అడగ్గా.. 'ఇన్నేళ్ల పాటు ఉపాసనకు నేను అంతగా దొరికేవాణ్ణి కాదు.. ఇప్పుడు తప్పడం లేదు (నవ్వుతూ). జెన్నిఫర్ ఆస్టన్‌ను కలవడం హ్యాపీగా ఉంది. మీ ఫోన్ నంబర్ ఇవ్వండి. నా భార్య ఉపాసన త్వరలో అమెరికా వస్తుంది'' అన్నారు. 'మీతో జర్నీకి నేను రెడీ. మీ తొలి బేబీకి ప్రసవం చేయడం నాకు గౌరవమే'' అన్నారు జెన్నిఫర్ ఆస్టన్. దీంతో ఉపాసన డెలివరీ అమెరికాలోనే అనే వార్త వైరల్‌గా మారింది.

కనుల చాటు మేఘమా...



● నాగశౌర్య, మాళవిక


నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. శ్రీనివాస్ అవసరాల దర్శకత్వం వహించారు. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమా మార్చి 17న రిలీజ్ కానుంది. కళ్యాణీ మాలిక్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'కనుల చాటు మేఘమా..' అంటూ సాగే మొదటి పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు లక్ష్మీ భూపాల సాహిత్యం అందించగా ఆభాస్ జోషి పాడారు. రఘు మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. శ్రీనివాస్ అవసరాల మాట్లాడుతూ– ''ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' కథ అనుకున్నాక కళ్యాణీ మాలిక్‌గారితో 'ఒక లవ్ స్టోరీ చేస్తున్నాం.. దానికి మంచి పాట కావాలి' అన్నాను. ఆయన అద్భుతమైన మెలోడీని స్వరపరిచారు'' అన్నారు. ''కనుల చాటు మేఘమా..' పాట ఇచ్చిన తృప్తి నా 20 ఏళ్ల సినీ జీవితంలో ఏ పాటా ఇవ్వలేదు'' అన్నారు కళ్యాణీ మాలిక్.

నాన్నకు ప్రేమతో....

తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో ఇప్పటికే చాలా సినిమాలు వచ్చాయి.
ఎన్ని వచ్చినా ఈ 'అనుబంధం' ఎవర్ గ్రీన్.
అందుకే ఈ రిలేషన్ చుట్టూ కొత్త కథలు అల్లుకుని సినిమాలు తీస్తుంటారు.
'నాన్నకు ప్రేమతో' అంటూ ఈ అనుబంధం నేపథ్యంలో కొన్ని సినిమాలు రానున్నాయి.
ఆ విశేషాలు తెలుసుకుందాం.



● కియారా, రామ్‌చరణ్



● కమల్‌హాసన్



● ప్రభాస్



● రణ్‌బీర్ కపూర్



● సుధీర్‌బాబు

★ కమల్‌హాసన్ తండ్రీకొడుకుగా రెండు పాత్రలు చేసిన ఓ చిత్రం 'ఇండియన్' (భారతీయుడు). 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి, అతని తనయుడు, ప్రభుత్వ ఉద్యోగి చంద్రబోస్ సేనాపతి పాత్రల్లో కమల్‌హాసన్ ద్విపాత్రాభినయం చేశారు. దేశభక్తుడైన సేనాపతి లంచగొండి అయిన తన తనయుడు చంద్రబోస్‌ను హత్య చేయడం ఈ సినిమాకే ప్రధాన హైలైట్. భారీ ఎత్తున ప్రేక్షకాదరణ పొందిన ఈ 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా పాతికేళ్ల తర్వాత కమల్‌హాసన్, శంకర్ 'ఇండియన్ 2' చేస్తున్నారు. ఈ సినిమా కూడా ప్రధానంగా తండ్రీకొడుకుల నేపథ్యంలోనే సాగుతుందని తెలిసింది. ఇండియన్ సినిమాలో మాదిరిగానే 'ఇండియన్ 2'లో కూడా కమల్‌హాసన్ తండ్రీకొడుకుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారని కోలీవుడ్ టాక్. కథలోని కీలక సన్నివేశాలు 1920 నేపథ్యంలో ఉంటాయని తెలిసింది. అంటే కథ.. స్వాతంత్ర్యానికి పూర్వం సేనాపతి, అతని తండ్రికి ఉన్న అనుబంధం నేపథ్యంలో ఉంటుందన్నట్లుగా ఈ చిత్రరచయితల్లో ఒకరైన జయ మోహన్ ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలనుకుంటున్నారు.


★ ప్రభాస్ చేస్తున్న తాజా చిత్రాల్లో 'సలార్' ఒకటి. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే రెండు లుక్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రంలో ప్రభాస్ డ్యూయల్ రోల్ చేస్తున్నారని వినికిడి. అలాగే ఈ సినిమా కథకు తండ్రీకొడుకుల సెంటిమెంట్‌ను జోడించారట ప్రశాంత్ నీల్. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తండ్రి బాధ్యతను కొనసాగించి, సక్సెస్ అయ్యే కొడుకు పాత్రలో ప్రభాస్ కనిపిస్తారన్నది ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రం సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది.

★ దర్శకుడు శంకర్, హీరో రామ్‌చరణ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. కథాంశం తండ్రీతనయుల అనుబంధమేనట. ఈ రెండు పాత్రలనూ చరణే చేస్తున్నారు. ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం కోసం ఓ వ్యక్తి శ్రమిస్తాడు. కానీ కొందరు స్వార్థపరుల కారణంగా అతనికి అన్యాయం జరుగుతుంది. ఆ తర్వాతి కాలంలో ఆ వ్యక్తి తనయుడు ఐఏఎస్ ఆఫీసర్ అవుతాడు. తండ్రిని ఇబ్బంది పెట్టినవారిని శిక్షిస్తూనే, డబ్బు, స్వార్థం లేని రాజకీయాల కోసం ప్రజలు ఎలా చైతన్యవంతులై ఉండాలి? ఐఏఎస్ ఆఫీసర్లు ఏ విధంగా విధులు నిర్వర్తించాలి? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్. సినిమాను వచ్చే ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

★ సుధీర్‌బాబు ప్రస్తుతం 'మామా మశ్చీంద్ర' అనే సినిమా చేస్తున్నారు. హర్షవర్ధన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రధానంగా తండ్రీకొడుకుల ఎమోషన్ నేపథ్యంలో సాగుతుందని, ఇందులో మూడు డిఫరెంట్స్ లుక్స్‌లో సుధీర్‌బాబు కనిపిస్తారని టాక్.

★ తండ్రీకొడుకుల ఎమోషన్ నేపథ్యంలో సాగే చిత్రాలు బాలీవుడ్‌లోనూ కొన్ని ఉన్నాయి. ప్రధానంగా చెప్పుకోవాల్సిన చిత్రం 'యానిమల్'. 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తండ్రి కోసం గ్యాంగ్‌స్టర్‌గా మారే ఓ యువకుడి కథే 'యానిమల్' అని బాలీవుడ్ టాక్. ఇందులో రణ్‌బీర్ కపూర్ తండ్రిగా అనిల్ కపూర్ కనిపిస్తారని సమాచారం.

రెండు కాలాలతో...



● రెజీనా

రెజీనా ప్రధాన పాత్రలో కార్తీక్ రాజు దర్శకత్వంలో రాజశేఖర్ వర్మ నిర్మించిన చిత్రం 'నేనే నా'. ఈ చిత్రం ప్రపంచవ్యాప్త థియేట్రికల్, నాన్-థియేట్రికల్ రైట్స్‌ని ఎస్పీ సినిమాస్ దక్కించుకుంది. ''1920, ప్రస్తుతం.. ఇలా రెండు విభిన్న కాలాల నేపథ్యంలో రూపొందించిన ఫ్యాంటసీ అడ్వెంచరస్ థ్రిల్లర్ ఇది. ఇందులో రెజీనా పురావస్తు శాస్త్రవేత్త పాత్ర చేశారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ వేసవిలో సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్.


తల్లితండ్రులు.. పిల్లలకు సందేశం



● అమీర్తా, సాత్విక్, మంజీరా

సాత్విక్ వర్మ, జాక్ రాబిన్‌సన్, మంజీరా రెడ్డి, అమీర్తా హాల్దర్ హీరో హీరోయిన్లుగా ముత్తు యం. దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చిక్లెట్స్'. తెలుగు, తమిళ భాషల్లో శ్రీనివాసన్ గురు నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో రామ్ కార్తీక్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''చిక్లెట్స్' ట్రైలర్ చాలా బాగుంది. పిల్లలకు, పేరెంట్స్‌కి మంచి సందేశం ఇచ్చేలా తెరకెక్కిన ఈ సినిమా బిగ్ హిట్ అవ్వాలి'' అన్నారు. ముత్తు యం. మాట్లాడుతూ– ''1990 జనరేషన్‌కి చెందిన పేరెంట్స్‌కు, 20కె జనరేషన్ పిల్లలకు మధ్య జరుగుతున్నటువంటి సంఘర్షణని ఈ సినిమాలో చూపించాం. ఇందులో లవ్, ఎంటర్‌టైన్మెంట్, ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు. ''తల్లితండ్రులు, పిల్లలకు మధ్య ఉన్న అన్ని భావోద్వేగాలు మా సినిమాలో ఉన్నాయి'' అన్నారు శ్రీనివాసన్ గురు. లైన్ ప్రొడ్యూసర్ డానియల్, దర్శకుడు శివమ్ మాట్లాడారు.

గ్రాండ్ సాంగ్.. భారీ ఫైట్



● ప్రభాకర్

'బాహుబలి' ప్రభాకర్ ప్రధాన పాత్రలో పాలిక్ (పాలిక్ శ్రీనివాసా చారి) దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. రమేష్ రావుల నిర్మిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో 'బాహుబలి' ప్రభాకర్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నా పాత్ర కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం ఫైట్ సీన్ షూటింగ్ జరుగుతోంది'' అన్నారు. ''సస్పెన్స్ థ్రిల్లర్ మూవీగా రూపొందిస్తున్నాం. ప్రభాకర్‌పై ఓ పాటను గ్రాండ్‌గా చిత్రీకరించాం. ఇప్పుడు రవి మాస్టర్ సారథ్యంలో ప్రభాకర్‌పై భారీ ఫైట్ చిత్రీకరిస్తున్నాం. వింధ్యా రెడ్డి మంచి కథ అందించారు. జాన్ భూషణ్ మూడు అద్భుతమైన పాటలిచ్చారు'' అన్నారు పాలిక్. ''మార్చిలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు రమేష్ రావుల.

ప్రేమ.. వినోదం..



● కృష్ణ, అర్చన

''మిస్టర్ కళ్యాణ్' మూవీ ట్రైలర్ బాగుంది. మేకింగ్, లొకేషన్స్, డైలాగ్స్ అన్నీ బాగున్నాయి. ఈ సినిమా మంచి విజయం సాధించి దర్శకుడు పండు, నిర్మాత ఎన్వీ సుబ్బారెడ్డి మరిన్ని మంచి సినిమాలు చేయాలి'' అని డైరెక్టర్ నక్కిన త్రినాథరావు అన్నారు. మాన్యం కృష్ణ, అర్చన జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ కళ్యాణ్'. పండు దర్శకత్వంలో ఉషశ్రీ సమర్పణలో ఎన్వీ సుబ్బారెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ని నక్కిన త్రినాథరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా పండు, ఎన్వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ– ''ఫ్యామిలీ, లవ్, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'మిస్టర్ కళ్యాణ్'' అన్నారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
24-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	139	59,606
నిఫ్టీ ▽	43	17,511

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,461	▽ 46
డోజోన్స్	32,814	▽ 232
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,908	▽ 23
డాక్స్	15,476	△ 76
షాంఘై	3,287	▽ 4
నికాయ్ (బుధవారం ముగింపు)	27,104	▽ 369

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారట్)	56,080 ▽ 416
బంగారం (22 క్యారట్)	55,855 ▽ 415
వెండి (కిలో)	65,182 ▽ 804

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.03	83.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.30	101.64
€	యూరో	ఎస్‌బీఐ	86.49	89.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.52	62.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.53	57.89
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.94	62.92
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.01	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.63	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.87	12.94

క్రిప్టోల కట్టడికి అంతర్జాతీయ విధానం అవసరం




అమెరికా ఆర్థిక మంత్రి జేనెట్ యెలెన్‌తో నిర్మలా సీతారామన్ భేటీ

- ఆర్థిక మంత్రి సీతారామన్ వెల్లడి
- జీ20 మంత్రులతో చర్చలు

న్యూఢిల్లీ: క్రిప్టోకరెన్సీలను కట్టడి చేసేందుకు అంతర్జాతీయ విధానం అవసరమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అలాగే అంతర్జాతీయ రుణ సమస్యలను ఎదుర్కొనేందుకు, బహుళపక్ష అభివృద్ధి బ్యాంకులను పటిష్టం చేయడంపై దృష్టి పెట్టాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు. జీ20 మంత్రుల సమావేశానికి ముందు అమెరికా, జపాన్, స్పెయిన్ తదితర దేశాల ఆర్థిక మంత్రులతో ఆమె ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇందులో పలు అంశాలు చర్చించారు. శుక్రవారం నుంచి 2 రోజుల పాటు జరిగే జీ20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల (ఎఫ్ఎంసీబీజీ) సదస్సులో పాల్గొనేందుకు వివిధ దేశాల నేతలు భారత్ వచ్చారు. ఈ సందర్భంగా అమెరికా ఆర్థిక మంత్రి జేనెట్ యెలెన్, జపాన్ ఫైనాన్స్ మినిస్టర్ షునిచి సుజుకీ తదితరులతో సీతారామన్ భేటీ అయ్యారు. సార్వభౌమ రుణాల పునర్‌వ్యవస్థీకరణలో భారత్ కీలక పాత్ర పోషిస్తుండటంపై యెలెన్ అభినందించినట్లు అమెరికా ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కొత్త బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు చోటేది?

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు విమర్శ



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల మొదట్లో ప్రవేశపెట్టిన 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఉపాధి కల్పనకు 'తగినంత ప్రాధాన్యత' ఇవ్వలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు పేర్కొన్నారు. వృద్ధిరేటు ఉద్యోగాలను సృష్టిస్తుందనే విశ్వాసం అయితే ఉందికానీ, నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి ఈ విశ్వాసం ఒక్కటే దోహదపడబోదని ఆయన అభిప్రాయపడ్డారు. కోవిడ్‌కు ముందు కూడా నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ఆయన పేర్కొంటూ, మహమ్మారి ఫలితంగా ఇది మరింత ఆందోళనకరంగా మారిందని ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. దువ్వూరి అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

- ఉద్యోగాలపై (2023–24 బడ్జెట్‌లో) తగినంత ప్రాధాన్యత లేకపోవడంతో నేను నిరాశ చెందాను. కేవలం వృద్ధితోనే ఉపాధి కల్పనను సాధించలేము. మనకు ఉపాధి కల్పనే ధ్యేయంగా జరిగే వృద్ధి అవసరం.
- ప్రతి నెలా దాదాపు లక్ష మంది శ్రామిక శక్తిలో చేరుతున్నారు. అయితే వారిలో సగానికి కూడా భారత్ ఉద్యోగాలను కూడా సృష్టించలేకపోతోంది. ఫలితంగా నిరుద్యోగ సమస్య పెరగడమే కాకుండా సంక్షోభంగా మారుతోంది.
- భారీ సంఖ్యలో యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించగలిగినప్పుడే, దేశంలోని అధిక యువత ద్వారా ప్రయోజనం ఉంటుంది.
- ఎన్నికల కారణంగా 2023–24 బడ్జెట్ ప్రజాకర్షక చర్యలతో ఉంటుందని భావించారు. అయితే ఇందుకు భిన్నంగా వృద్ధి, ద్రవ్యలోటు కట్టడిపైనా బడ్జెట్ దృష్టి సారించడం కొంత హర్షణీయ అంశం.

ఉపాధికి బడ్జెట్ ప్రోత్సాహం: ఆర్థికశాఖ

కాగా, ఆర్థిక మంత్రిత్వశాఖ గురువారం నెలవారీ సమీక్షను విడుదల చేస్తూ, బడ్జెట్‌లో చేసిన ప్రకటనలు వృద్ధిని, ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని పేర్కొనడం గమనార్హం. మూలధన పెట్టుబడుల పెంపు, గ్రీన్ ఎకానమీకి ప్రోత్సాహం, ఫైనాన్షియల్ మార్కెట్ల పటిష్టానికి చొరవలు వంటి అంశాలు వృద్ధి, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడతాయని ఆర్థికశాఖ సమీక్ష పేర్కొంది.

ఐఐటీ మద్రాస్‌లో సింథటిక్ వజ్రాల ల్యాబ్

5 ఏళ్లలో రూ. 243 కోట్లు వెచ్చింపు



న్యూఢిల్లీ: దేశీయంగా సింథటిక్ వజ్రాల తయారీకి సంబంధించిన సెంటర్‌ను (ఇన్‌సెంట్–ఎల్‌జీడీ) ఐఐటీ–మద్రాస్‌లో ఏర్పాటు చేయనున్నట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. దీనికి 5 ఏళ్లలో సుమారు రూ. 243 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొంది. దేశీయంగా సింథటిక్ వజ్రాల తయారీ పరిశ్రమకు, వ్యాపారవేత్తలకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించేందుకు ఈ ప్రాజెక్టు తోడ్పడుతుందని వివరించింది. స్టార్టప్‌లకు చౌకగా టెక్నాలజీని అందించేందుకు, ఉపాధి అవకాశాలను .. ఎల్‌జీడీ ఎగుమతులను పెంచేందుకు ఇన్‌సెంట్–ఎల్‌జీడీలో పరిశోధనలు ఉపయోగపడగలవని వాణిజ్య శాఖ తెలిపింది. ల్యాబ్స్‌లో తయారయ్యే వజ్రాలను ఆభరణాల పరిశ్రమలోనే కాకుండా కంప్యూటర్ చిప్‌లు, ఉపగ్రహాలు, 5జీ నెట్‌వర్క్‌లు మొదలైన వాటిల్లోనూ ఉపయోగిస్తారు. అంతర్జాతీయంగా ఈ మార్కెట్ 2020లో బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. 2025 నాటికి సింథటిక్ డైమండ్ ఆభరణాల మార్కెట్ 5 బిలియన్ డాలర్లకు, 2035 నాటికి 15 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందన్న అంచనాలు ఉన్నాయి. 2021–22లో వీటికి సంబంధించి అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్‌కు 25.8% వాటా ఉంది. కెమికల్ వేపర్ డిపోజిషన్ (సీవీడీ) టెక్నాలజీతో వజ్రాలను తయారు చేసే టాప్ దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. అయితే, కీలక యంత్ర పరికరాలు, ముడి వనరు అయిన సీడ్స్ కోసం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది.

మార్కెట్‌కు వడ్డీరేట్ల పెంపు భయం

- అయిదోరోజూ అమ్మకాలే
- నాలుగు నెలల కనిష్టానికి నిఫ్టీ



ముంబై: వడ్డీరేట్ల పెంపు భయాలు వెంటాడటంతో స్టాక్ సూచీలు వరుసగా అయిదోరోజూ నష్టపోయాయి. ఆసియా మార్కెట్లలో బలహీనతలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. ఫిబ్రవరి నెలవారీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ నేపథ్యంలో తీవ్ర ఒడిదుడుకుల ట్రేడింగ్ చోటు చేసుకుంది. ముఖ్యంగా ద్రవ్యోల్బణ కట్టడికి కఠిన ద్రవ్య విధాన వైఖరిని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఫెడ్ రిజర్వ్, ఆర్‌బీఐ మినిట్స్‌లో వెల్లడి కావడం ఇన్వెస్టర్లను కలవరపెట్టింది. ఇంట్రాడేలో 554 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ 139 పాయింట్లు నష్టపోయి 59,606 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 59,406 కనిష్టాన్ని, 59,960 గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 43 పాయింట్లు తగ్గి 17,511 వద్ద నిలిచింది. ఈ ముగింపు నిఫ్టీకి నాలుగు కనిష్ట స్థాయి. రోజంతా 17,455–17,620 పాయింట్ల శ్రేణిలో ట్రేడైంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు మాత్రమే స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. రియల్టీ, ఇంధన, కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్ షేర్లు నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, బ్యాంకింగ్, ఇంధన షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.40 %, 0.10 శాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1586 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1417 కోట్ల షేర్లను కొన్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 15 పైసలు నష్టపోయి 82.73 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు ఇంట్రాడేలో 14% నష్టపోయి రూ.177 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. ఈ సంస్థపై దివాళా పరిష్కార చర్యలు చేపట్టేందుకు ఇండస్‌ఇండ్ బ్యాంక్‌కు ఎన్‌సీఎల్‌టీ అనుమతులు ఇవ్వడం షేరు పతనానికి కారణమైంది. చివరికి 3.5% నష్టంతో రూ.199 వద్ద నిలిచింది.
- అదానీ గ్రూప్‌లోని పదింటిలో ఎనిమిది కంపెనీల షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ 5 శాతం చొప్పున పతనమయ్యాయి. అదానీ విల్మార్ 3.41%, ఏసీసీ 0.81%, ఎన్డీటీవీ స్వల్పంగా నష్టపోయాయి. అయితే అదానీ పోర్ట్స్ 1.19%, అంబుజా సిమెంట్స్ 0.69% లాభపడ్డాయి.

ఒలెక్ట్రా హైడ్రోజన్ బస్

త్వరలో భారత్ రోడ్ల పైకి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్‌కు (ఎంఈఐఎల్) చెందిన ఎలక్ట్రిక్ వాహన రంగ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ హైడ్రోజన్‌తో నడిచే బస్‌ను తయారు చేసింది. రిలయన్స్ భాగస్వామ్యంతో ఈ వాహనాన్ని రూపొందించినట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. ఏడాదిలోగా వాణిజ్యపరంగా వీటి ఉత్పత్తి ప్రారంభించాలని ఒలెక్ట్రా లక్ష్యంగా చేసుకుంది.



పూర్తి ఇంధన సామర్థ్యంతో 400 కిలోమీటర్ల వరకు ప్రయాణించడం బస్ ప్రత్యేకత. బస్ పైభాగంలో టైప్–4 హైడ్రోజన్ సిలిండర్లను ఏర్పాటు చేశారు. 12 మీటర్ల పొడవు ఉన్న ఈ బస్సులో డ్రైవర్ సీటు కాకుండా ప్రయాణికులకోసం 32–49 సీట్లు ఏర్పాటు చేయవచ్చు. హైడ్రోజన్ నింపడానికి 15 నిమిషాలు పడుతుంది.

విదేశీ స్టాక్స్‌లో రికార్డు పెట్టుబడులు

- 2022లో 2.1 బిలియన్ డాలర్లు
- 12 నెలల కాలంలో గరిష్ట స్థాయి ఇది



న్యూఢిల్లీ: విదేశాల్లో భారతీయుల పెట్టుబడులు ఎప్పటికప్పుడు పెరుగుతూ పోతున్నాయి. 2022లో విదేశీ సెక్యూరిటీలు, ప్రాపర్టీ, డిపాజిట్లలో భారతీయులు చేసిన పెట్టుబడులు రికార్డు స్థాయిలో 2.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఒక 12 నెలల కాలంలో విదేశాల్లో భారతీయులు చేసిన అత్యధిక పెట్టుబడులు ఇవేనని ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. విభాగం వారీగా చూసుకున్నా కానీ గతేడాది పెట్టుబడులు అత్యధికంగా ఉన్నాయి. ఆర్‌బీఐ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద ఒక వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో 2,50,000 డాలర్లను విదేశాలకు పంపించుకోవచ్చు. విదేశీ యాత్రలు, విదేశీ విద్య, వైద్యం, పెట్టుబడులకు ఈ పరిమితి వర్తిస్తుంది. బహుమతులు, విరాళాలకూ ఇదే పరిమితి అమలవుతుంది. 2009కి ముందు 12 నెలల కాలంలో విదేశీ షేర్లు, ప్రాపర్టీలు, డిపాజిట్లలో భారతీయుల పెట్టుబడులు 350 మిలియన్ డాలర్లుగానే ఉండడం గమనించొచ్చు. 2022 డిసెంబర్‌తో అంతమైన 12 నెలల కాలంలో విదేశీ ఈక్విటీ లేదా డెట్‌లో పెట్టుబడులు రికార్డు స్థాయిలో 969.50 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. డిసెంబర్ నెల వరకే చూసుకున్నా ఇలా విదేశాలకు వెళ్లిన పెట్టుబడులు 120 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

స్టాక్స్ పట్ల ఎక్కువ ఆసక్తి

ముఖ్యంగా విదేశీ స్టాక్స్ పట్ల భారతీయులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో బ్రోకరేజీ సంస్థలు విదేశీ బ్రోకరేజీలతో ఒప్పందాలు చేసుకుని పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ తదితర షేర్లలో దేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెడుతున్నారు. మ్యూచువల్ ఫండ్స్ మార్గంలో ఈ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. 2022 డిసెంబర్ నాటికి మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు పోర్ట్‌ఫోలియోలో రూ.27,055 కోట్ల విలువైన విదేశీ స్టాక్స్‌ను కలిగి ఉన్నాయి. అది ఈ ఏడాది జనవరి చివరికి రూ.29,012 కోట్లకు వృద్ధి చెందింది. విదేశీ పెట్టుబడుల పరంగా మ్యూచువల్ ఫండ్స్‌కు కొన్ని నియంత్రణపరమైన పరిమితులు ఉన్నాయి. ఫండ్స్ విదేశీ పెట్టుబడుల విలువ అనుమతించిన గరిష్ట స్థాయికి చేరిపోవడంతో.. తాజా పెట్టుబడుల స్వీకరణను సెబీ నిలిపివేసింది. పైగా విదేశాలకు పంపించే మొత్తం రూ.7 లక్షలకు మించితే మొదట్లోనే 20 శాతాన్ని టీసీఎస్ కింద మినహాయించాలంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన విదేశీ పెట్టుబడులకు పెద్ద ప్రతిబంధకం అవుతుందన్నది నిపుణుల అభిప్రాయంగా ఉంది. సాధారణంగా ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లోనే విదేశాలకు పంపించే మొత్తం ఎక్కువగా ఉంటుంది.

సాక్షి స్పోర్ట్స్

ఫైనల్లో రోహన్ బోపన్న జోడీ

ఖతర్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. దోహాలో గురువారం జరిగిన సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–4, 6–3తో డేనియల్ ఇవాన్స్–జానీ ఒమారా (బ్రిటన్) జంటపై విజయం సాధించింది. 62 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ ఆరు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌లో మూడు బ్రేక్ పాయింట్లు సాధించారు.



షూటర్ అనీశ్‌కు కాంస్యం

కైరోలో జరిగిన ప్రపంచకప్ షూటింగ్ టోర్నీని భారత్ కాంస్య పతకంతో ముగించింది. చివరిరోజు గురువారం భారత్‌కు అనీశ్ భన్వాలా కాంస్య పతకం అందించాడు. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఫైనల్లో అనీశ్ 21 పాయింట్లు స్కోరు మూడో స్థానంలో నిలిచాడు.



విజయం దూరమైంది...

2017 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్... 2018 టి20 వరల్డ్‌కప్ సెమీఫైనల్... 2020 టి20 వరల్డ్‌కప్ ఫైనల్... 2022 కామన్వెల్త్ గేమ్స్ ఫైనల్... గత కొన్నేళ్లుగా భారత మహిళల క్రికెట్ జట్టుకు వేదన మిగుల్చుతున్న నాకౌట్ మ్యాచ్‌ల పరాజయాల జాబితాలో మరొకటి చేరింది. ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియాతో పోరులో చివరి వరకు పోరాడినా మన జట్టుకు ఓటమి తప్పలేదు. తాజా టి20 వరల్డ్‌కప్‌లో మన జట్టు ప్రస్థానం సెమీస్‌కే పరిమితమైంది. రెండు మెరుపు బ్యాటింగ్ ప్రదర్శనలు గెలుపు ఆశలు రేపినా... గెలుపు గీత దాటలేక జట్టు నిరాశగా నిష్క్రమించింది.

- మహిళల టి20 ప్రపంచకప్ సెమీస్‌లో భారత్ ఓటమి
- 5 పరుగులతో ఆస్ట్రేలియా విజయం
- హర్మన్, జెమీమా పోరాటం వృథా





హర్మన్ రనౌట్‌తో...

మ్యాచ్‌కు కొద్దిసేపు క్రితం వరకు కూడా జ్వరం కారణంగా ఆడలేని స్థితిలో ఉన్న కెప్టెన్ హర్మన్ పట్టుదలగా బరిలోకి దిగింది. మెరుపు బ్యాటింగ్‌తో విజయానికి చేరువగా తెచ్చింది. విజయం కోసం 33 బంతుల్లో 41 పరుగులు కావాలి. ఈ దశలో రెండో పరుగుకు ప్రయత్నిస్తూ క్రీజ్‌లో చేరే సమయంలో బ్యాట్ పిచ్‌లో ఇరుక్కుపోవడంతో హర్మన్ దురదృష్టవశాత్తూ రనౌట్‌గా వెనుదిరిగింది. దాంతో ఆట ఆసీస్ వైపు మొగ్గింది.





ఆ క్యాచ్‌లు పట్టి ఉంటే...

ఫీల్డింగ్‌లో వదిలేసిన రెండు క్యాచ్‌లు భారత్‌ను నష్టపరిచాయి. లానింగ్ 1 వద్ద ఇచ్చిన క్యాచ్‌ను కీపర్ రిచా, 32 వద్ద మూనీ క్యాచ్‌ను షఫాలీ వర్మ వదిలేశారు. వీటి నష్టం ఏకంగా 70 పరుగులు! వీటిని పట్టి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో.

కేప్‌టౌన్: మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఆట ముగిసింది. గత టోర్నీ రన్నరప్ అయిన భారత్ ఈసారి సెమీఫైనల్లో ఆసీస్‌కే తలవంచింది. గురువారం ఆసక్తికరంగా జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా 5 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. బెత్ మూనీ (37 బంతుల్లో 54; 7 ఫోర్లు, 1 సిక్స్), మెగ్ లానింగ్ (34 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లీ గార్డ్‌నర్ (18 బంతుల్లో 31; 5 ఫోర్లు) ఆసీస్ స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 167 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (34 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (24 బంతుల్లో 43; 6 ఫోర్లు) మినహా మిగతా వారంతా విఫలమయ్యారు. ఆసీస్‌కు ఇది ఏడో ఫైనల్ కాగా, నేడు ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో ఆదివారం తుది పోరులో ఆస్ట్రేలియా జట్టు తలపడుతుంది.

లానింగ్ జోరు...

ఆస్ట్రేలియాకు ఓపెనర్లు అలీసా హీలీ (26 బంతుల్లో 25; 3 ఫోర్లు), మూనీ శుభారంభం అందించారు. రేణుక వేసిన తొలి బంతినే హీలీ ఫోర్‌గా మలచడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ప్రారంభమైంది. తొలి వికెట్‌కు 52 పరుగులు (45 బంతుల్లో) జోడించిన అనంతరం రాధా యాదవ్ బౌలింగ్‌లో హీలీ స్టంపౌట్ అయింది. అనంతరం మూనీ, లానింగ్ కలిసి జట్టును నడిపించారు. భారత ఫీల్డర్లు వదిలేసిన రెండు క్యాచ్‌లు కూడా వీరికి కలిసొచ్చాయి. సగం ఇన్నింగ్స్ ముగిసేసరికి ఆసీస్ 69 పరుగులకు చేరింది. అయితే ఆ తర్వాత ఆస్ట్రేలియా జోరు పెంచింది. శిఖా ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన మూనీ అదే ఓవర్లో వెనుదిరిగినా... స్నేహ్ రాణా ఓవర్లో లానింగ్, రాధ ఓవర్లో గార్డ్‌నర్ రెండేసి ఫోర్లు కొట్టారు. చివర్లో ఐదు బంతుల వ్యవధిలో భారత్ 2 కీలక వికెట్లు తీసినా... రేణుక వేసిన ఆఖరి ఓవర్లో 2 సిక్స్‌లు, 1 ఫోర్‌తో 18 పరుగులు రాబట్టి లానింగ్ ఘనంగా ముగించింది. చివరి 10 ఓవర్లలో ఆస్ట్రేలియా 103 పరుగులు సాధించగా... ఇందులో ఆఖరి 5 ఓవర్లలో వచ్చిన 59 పరుగులు ఉన్నాయి.

కీలక భాగస్వామ్యం...

భారీ ఛేదనలో భారత్ ఆరంభంలోనే తడబడింది. 4 ఓవర్లు ముగిసేలోపే 28 పరుగులకు టాప్–3 బ్యాటర్లు షఫాలీ (9), స్మృతి మంధాన (2), యస్తిక భాటియా (4) పెవిలియన్ చేరారు. ఈ దశలో జెమీమా, హర్మన్ భాగస్వామ్యం గెలుపుపై ఆశలు రేపింది. వీరిద్దరు ఒకరితో మరొకరు పోటీ పడి ధాటిగా ఆడారు. వీరి దూకుడుకు ఆసీస్ బౌలర్లు కొద్దిసేపు అచేతనంగా మారిపోయారు. అయితే ఇదే జోరులో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి జెమీమా వెనుదిరిగింది. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 41 బంతుల్లోనే 69 పరుగులు జోడించారు. మరో వైపు హర్మన్ మాత్రం తగ్గకుండా చక్కటి షాట్లతో దూసుకుపోయింది. 36, 37 పరుగుల వద్ద కీపర్ హీలీ తన క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన హర్మన్ 32 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే కీలక దశలో హర్మన్ రనౌట్ కావడం భారత్ అవకాశాలను దెబ్బ తీసింది. చివర్లో రిచా (14), దీప్తి శర్మ (17 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు) పోరాడినా విజయానికి అది సరిపోలేదు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలీసా హీలీ (స్టంప్డ్) రిచా (బి) రాధ 25; మూనీ (సి) షఫాలీ (బి) శిఖా 54; లానింగ్ (నాటౌట్) 49; గార్డ్‌నర్ (బి) దీప్తి 31; హారిస్ (బి) శిఖా 7; ఎలీస్ పెర్రీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 172. వికెట్ల పతనం: 1–52, 2–88, 3–141, 4–148. బౌలింగ్: రేణుకా సింగ్ 4–0–41–0, దీప్తి శర్మ 4–0–30–1, శిఖా పాండే 4–0–32–2, రాధ యాదవ్ 4–0–35–1, స్నేహ్ రాణా 4–0–33–0.

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ (ఎల్బీ) (బి) షుట్ 9; స్మృతి (ఎల్బీ) (బి) గార్డ్‌నర్ 2; యస్తిక (రనౌట్) 4; జెమీమా (సి) హీలీ (బి) బ్రౌన్ 43; హర్మన్‌ప్రీత్ (రనౌట్) 52; రిచా (సి) తాలియా (బి) బ్రౌన్ 14; దీప్తి (నాటౌట్) 20; స్నేహ్ రాణా (బి) జొనాసెన్ 11; రాధ (సి) పెర్రీ (బి) గార్డ్‌నర్ 0; శిఖా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 167. వికెట్ల పతనం: 1–11, 2–15, 3–28, 4–97, 5–133, 6–135, 7–157, 8–162. బౌలింగ్: యాష్లీ గార్డ్‌నర్ 4–0–37–2, షుట్ 4–0–34–1, డార్సీ బ్రౌన్ 4–0–18–2, ఎలీస్ పెర్రీ 1–0–14–0, జొనాసెన్ 3–0–22–1, వేర్‌హామ్ 3–0–29–0, తాలియా మెక్‌గ్రాత్ 1–0–13–0.

ఫైనల్లో సీకామ్ డిగ్రీ కాలేజి

- వరుసగా రెండు విజయాలతో తుది పోరుకు అర్హత
- సాక్షి ప్రీమియర్ లీగ్ ఆంధ్రప్రదేశ్ రీజియన్ టోర్నీ



చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం క్రికెట్ టోర్నీలో శ్రీనివాస ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ (సీకామ్) డిగ్రీ కాలేజి (తిరుపతి) జట్టు రెండు వరుస విజయాలతో ఫైనల్లోకి దూసుకెళ్లింది. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో శ్రీనివాస ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ (సీకామ్) డిగ్రీ కాలేజి (తిరుపతి) 75 పరుగుల తేడాతో ఎంవీజీఆర్ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం) పై గెలిచింది. మొదట సీకామ్ కాలేజి నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. ధరణి కుమార్ (21 బంతుల్లో 55 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), శశాంక్ శ్రీవాస్ (23 బంతుల్లో 43 పరుగులు; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టారు. అనంతరం 149 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎంవీజీఆర్ కాలేజి 9 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసి ఓడిపోయింది. రవికిరణ్ (20; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. సీకామ్ బౌలర్లలో షాలు నవాజ్ 3 వికెట్లు, ఆశిష్, నవీన్‌లు చెరో రెండు వికెట్లతో ఆకట్టుకున్నారు. ధరణి కుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజి (ఏలూరు)తో జరిగిన రెండో మ్యాచ్‌లో సీకామ్ కాలేజి 'సూపర్ ఓవర్'లో గెలిచింది. తొలుత సీఆర్ రెడ్డి కాలేజి నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది. వై.కృష్ణ (27; 3 ఫోర్లు), నాగ వెంకట్ (19; 2 ఫోర్లు) రాణించారు. అనంతరం సీకామ్ కాలేజి కూడా నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి సరిగ్గా 76 పరుగులు చేయడంతో మ్యాచ్ 'టై' అయింది. చివరి బంతికి ఆయూబ్ ఫోర్‌తో స్కోరు సమమైంది. 'సూపర్ ఓవర్'లో సీకామ్ కాలేజి 21 పరుగులు చేయగా... సీఆర్ రెడ్డి కాలేజి ఐదు పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది.

ఎస్ఆర్ఐ ఆల్‌రౌండ్ షో

రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగం మొదటి మ్యాచ్‌లో ఎస్ఆర్ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ) కేవలం పరుగు తేడాతో సాయి గణపతి కాలేజి (విశాఖపట్నం)పై గెలిచింది. మొదట ఎస్ఆర్ఐ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లకు 60 పరుగులు చేసింది. రేవంత్ 18 (3 ఫోర్లు), ఎం.రూపేష్ 16 (2 ఫోర్లు) రాణించారు. అనంతరం సాయి గణపతి కాలేజి కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసి ఓడిపోయింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా మార్క్‌రమ్



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ఐపీఎల్ టి20 టోర్నమెంట్‌లో పాల్గొనే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఎయిడెన్ మార్క్‌రమ్‌ను నియమించారు. ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన ఎస్ఏ20 లీగ్‌లో మార్క్‌రమ్ నాయకత్వంలో సన్‌రైజర్స్ యాజమాన్యానికే చెందిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు విజేతగా నిలిచింది. ఈ లీగ్‌లో మార్క్‌రమ్ 366 పరుగులు చేయడంతోపాటు 11 వికెట్లు పడగొట్టాడు. గత ఐపీఎల్ సీజన్‌లలో మార్క్‌రమ్ 20 మ్యాచ్‌లు ఆడి 527 పరుగులు సాధించాడు. గత ఏడాది ఐపీఎల్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ సారథ్యంలో సన్‌రైజర్స్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ సీజన్‌కు సంబంధించిన వేలం సమయంలో సన్‌రైజర్స్ యాజమాన్యం విలియమ్సన్‌ను విడుదల చేసింది. వేలంలో గుజరాత్ టైటాన్స్ విలియమ్సన్‌ను కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీ మార్చి 31 నుంచి మే 28 వరకు జరుగుతుంది.

ఆఖరి నిమిషంలో హడావుడి!

- ప్రభుత్వ ఉద్యోగ అభ్యర్థుల్లో తాత్సార వైఖరి
- దరఖాస్తుల సమర్పణ, హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్‌లోనూ జాప్యమే
- టీఎస్‌పీఎస్సీ విశ్లేషణలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సర్కారు కొలువు సాధించాలనే తపనతో సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థుల్లో చాలామంది దరఖాస్తుల సమర్పణ, హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ విశ్లేషించింది. ఫలితంగా మెజారిటీ అభ్యర్థులు ఉద్యోగ యత్నం నుంచి ఆదిలోనే నిష్క్రమించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అభిప్రాయపడింది. గతేడాది కాలంగా విడుదల చేసిన ఉద్యోగ ప్రకటనలకు సంబంధించి అభ్యర్థుల దరఖాస్తు సమర్పణ, హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్ తీరుకు సంబంధించిన వివరాలను మీడియాకు విడుదల చేసింది.

26 ప్రకటనలు.. 17,134 కొలువులు

గతేడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 17,134 ఉద్యోగ ఖాళీలకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ 26 ఉద్యోగ ప్రకటనలు జారీచేసి దరఖాస్తులను స్వీకరించింది. అయితే దరఖాస్తుల సమర్పణకు అభ్యర్థులు సకాలంలో స్పందించడం లేదని కమిషన్ గుర్తించింది. దరఖాస్తు తొలినాళ్లలో పట్టించుకోకుండా గడువు తేదీ సమీపిస్తున్న తరుణంలో హడావుడి చేస్తున్నట్లు కనుగొంది. ఈ క్రమంలో సాంకేతిక కారణాలు, ఇతర ధ్రువపత్రాలు అందుబాటులో లేని కారణంగా తొలి ఘట్టమైన దరఖాస్తు సమర్పణ ప్రక్రియకే దూరమవుతున్నట్లు టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. ముఖ్యంగా గ్రూప్–1 ఉద్యోగ దరఖాస్తులను పరిశీలిస్తే తొలి రెండు రోజుల్లో కేవలం 3.79 శాతం మంది అప్లై చేసుకోగా చివరి రెండ్రోజుల్లో 22.37 శాతం మంది దరఖాస్తులు సమర్పించారు. గ్రూప్–2 కేటగిరీలో తొలి రెండ్రోజుల్లో 9.24 శాతం దరఖాస్తులు రాగా చివరి రెండ్రోజుల్లో 16.32 శాతం మేర దరఖాస్తులు వచ్చాయి. గ్రూప్–3లో తొలి రెండ్రోజులకు 7.22 శాతం, చివరి రెండ్రోజులకు 10.80 శాతం, గ్రూప్–4లో తొలి రెండ్రోజులు 3.45 శాతం, చివరి రెండ్రోజులు 10.69 శాతం మేర దరఖాస్తులు వచ్చినట్లు కమిషన్ వివరించింది.

హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లోనూ ఆలస్యమే ..

దరఖాస్తుదారుల్లో ఎక్కువ మంది హాల్‌టికెట్లను సైతం సకాలంలో డౌన్‌లోడ్ చేసుకోవడంలేదని టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. పరీక్ష తేదీకి వారం ముందుగానే టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతున్నా ఎక్కువ మంది అభ్యర్థులు వాటిని పరీక్ష తేదీకి ఒకట్రెండు రోజుల ముందే డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఫలితంగా పరీక్ష కేంద్రాన్ని సరిచూసుకోకపోవడంతోపాటు హాల్‌టికెట్లలో పొరపాట్లను సైతం పరిష్కరించుకోకుండానే చివరకు పరీక్షకు దూరమవుతున్నారని కమిషన్ వివరించింది.

దుబాయ్‌కు బీసీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: దుబాయ్‌లో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న దుబాయ్ కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొనేందుకు బీసీ ప్రతినిధి బృందం శుక్రవారం బయల్దేరి వెళ్లనున్నట్టు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు దాసు సురేష్ వెల్లడించారు. వారంపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలసపోయిన ప్రజలు, బీసీ సోదరులను పలకరించి వారి సమస్యలు, ప్రధాన డిమాండ్లను తెలుసుకుంటామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయంగా బీసీ కుల వృత్తిదారుల ఉత్పత్తులకున్న మార్కెట్ అవకాశాలపై తమ బృందం అధ్యయనం చేయనున్నట్టు పేర్కొన్నారు. దుబాయ్‌లో అంతర్జాతీయంగా స్థిరపడిన బీసీ పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులతో చర్చలు జరపనున్నామని వివరించారు.

తిరుపతి పుట్టినరోజు నేడు



నగర ప్రస్తుత స్వరూపమిదీ

విస్తీర్ణం:	27.44 చదరపు కి.మీ.
మొత్తం గృహాలు:	82 వేలు
కుటుంబాలు:	1.12 లక్షలు
జనాభా:	3.86 లక్షలు
స్టార్ హోటళ్లు: 15	ఇతర హోటళ్లు: 286
మాల్స్, ఫంక్షన్ హాల్స్:	24
స్కూళ్లు, కళాశాలలు:	222

తిరుమలను తలచుకుంటే.. గోవింద నామం మనసులో మార్మోగుతుంది. కలియుగ ప్రత్యక్ష దైవం మనో నేత్రం ఎదుట ప్రత్యక్షమవుతారు. ఏడు కొండలవాడు కొలువైన తిరుమల ఆలయంతోపాటు ఆయన పాదాల చెంత ఉన్న తిరుపతి నగరం ఆవిర్భావమూ ఆసక్తికరమే. కలియుగం (కలియుగం మొదలై ఫిబ్రవరి 13వ తేదీ నాటికి 5,125 ఏళ్లు పూర్తయింది)లో శ్రీనివాసుడు ఏడు కొండలపై శిలా రూపంలో కొలువుదీరగా.. ఆ స్వామిని కొలిచే భక్తుల ఆవాసాల కోసం ఏడు కొండల దిగువన తిరుపతి వెలసింది. పూర్వం తిరుమల చుట్టూ అడవులు, కొండల నడుమ అలరారే శ్రీవారి ఆలయం మాత్రమే ఉండేది. భక్తులు క్రూర జంతువుల భయంతో గుంపులుగా కాలినడకన తిరుమల యాత్ర చేసేవారు. పూర్వం శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణ, ధ్వజారోహణం మాత్రమే తిరుమల కొండపై నిర్వహించేవారు. వాహన సేవలన్నీ తిరుచానూరులోనే నిర్వహించేవారు. ప్రతిరోజూ తిరుచానూరు నుంచి తిరుమలకు వెళ్లి రావటం ఇబ్బందిగా ఉండటంతో అర్చకులు కపిల తీర్థం వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ప్రాంతం పేరు కొత్తూరు, కోటవూరుగా పిలిచేవారు. – (సాక్షి, ఏపీ నెట్‌వర్క్)

రామానుజాచార్యులచే శంకుస్థాపన

శ్రీనివాసుని పూజా కైంకర్యాలను వైఖానస సంప్రదాయంలో కొనసాగించాలని నిర్దేశించిన జగద్గురువు రామానుజాచార్యులు అర్చకుల నివాసాల కోసం తిరుచానూరు–తిరుమల మధ్య నేటి పార్థసారథి ఆలయ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. శ్రీరంగం నుంచి శ్రీరంగనాథస్వామి శిలావిగ్రహాన్ని తెప్పించి పార్థసారథి సన్నిధికి పక్కన ప్రతిష్ఠించేందుకు ఆలయాన్ని నిర్మించారు. ఆ విగ్రహాన్ని తరలించే సమయంలో స్వల్పంగా దెబ్బ తినటంతో దాన్ని పక్కన పెట్టి.. ఆ ఆలయంలో గోవిందరాజస్వామిని తిరుమలేశుని ప్రతిరూపంగా ప్రతిష్ఠించారు. పక్కనపెట్టిన రంగనాథస్వామి విగ్రహం ప్రస్తుతం మంచినీళ్ల కుంట ఒడ్డున దర్శనమిస్తోంది. ఆ తర్వాత 1130వ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీన గోవిందరాజస్వామి ఆలయం నాలుగు వైపులా మాడ వీధులు, అందులో అర్చకుల నివాసాలకు రామానుజాచార్యులు శంకుస్థాపన చేశారు. ఆ బ్రాహ్మణ అగ్రహారాన్నే తర్వాత గోవిందపట్నంగా.. రామానుజపురంగా పిలిచేవారు. ఆ తరువాత 1220–40 మధ్యకాలం నుంచి తిరుపతిగా పేరొందింది. అప్పటినుంచి తిరుపతిలో ఆవాసాలు, ఆలయాలు పెరుగుతూ వచ్చి ఆధ్యాత్మిక నగరంగా రూపుదిద్దుకుంది. 120 సంవత్సరాల సుదీర్ఘ జీవితాన్ని గడిపిన రామానుజాచార్యులు మూడుసార్లు తిరుమలకు వచ్చారని ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఆయన తన 112వ ఏట గోవిందరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ, మాడ వీధులకు శంకుస్థాపన చేశారు. దీని ప్రకారం తిరుపతి ఆవిర్భవించి ఈ నెల 24వ తేదీకి 893 సంవత్సరాలు అవుతోంది.


కపిలతీర్థం జలపాతం

వెలుగులోకి తెచ్చిన భూమన

వెలుగుచూసిన అంశాలపై తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సమగ్ర అధ్యయనం చేయించి 2022 ఫిబ్రవరి 24న తొలిసారిగా తిరుపతి 892వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ ఏడాది టీటీడీ, తిరుపతి నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 893వ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించనున్నట్టు భూమన ప్రకటించారు. ఆ వేడుకల్లో భాగంగా నగర వాసులందరూ భాగస్వాములయ్యే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు నాలుగు మాడవీధుల్లో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.


ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియం

పరమ పవిత్రం తిరుపతి



ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి పరమ పవిత్రమైనది. ముక్కోటి దేవతలు శ్రీగోవిందరాజస్వామిని కొలుస్తారు. ఇక్కడ స్థానికులతో పాటు అనేక మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారు ఉన్నారు. తిరుపతి ప్రాముఖ్యత గురించి తెలియజేయాలన్నదే నా తపన. ప్రతి ఒక్కరూ నగర ప్రాభవాన్ని కాపాడుకోవాలి. తిరుపతి వైభవాన్ని చాటిచెబుదాం. శ్రీవారి నిలయమైన తిరుపతి ఆవిర్భావ వేడుకలను కలిసిమెలిసి జరుపుకుందాం.

– భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

‘పోలీస్ లెక్కలు’ మరింత పక్కాగా!

- డీసీఆర్‌బీల్లో సాంకేతికత వినియోగం పెంపునకు ప్రణాళికలు
- ఆ విభాగం ఇన్‌స్పెక్టర్లకు మార్చి మొదటి వారంలో ప్రత్యేక శిక్షణ
- ఉత్తమ పనితీరు కనబరిచే ఇన్‌స్పెక్టర్లకు రివార్డులు: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: నేరాల నియంత్రణ, నేరస్తుల కట్టడి వ్యూహాల రూపకల్పనలో నేర గణాంకాలు అత్యంత కీలకం. ప్రతి జిల్లా, పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీసీఆర్‌బీ (డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్ బ్యూరో)లు వారి పరిధిలోని నేరాల నమోదు, కేసుల దర్యాప్తు సమాచారం, ఇతర వివరాల గణాంకాలను సేకరించడంతోపాటు విశ్లేషిస్తుంటాయి. ఇకపై డీసీఆర్‌బీల సమాచారం మరింత ఉపయోగపడేలా, పక్కాగా గణాంకాల నమోదు, సమాచారాన్ని వీలైనంత వేగంగా విశ్లేషణకు పూర్తి స్థాయిలో సాంకేతికతను వినియోగించుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందుకోసం అన్ని జిల్లాల డీసీఆర్‌బీల ఇన్‌స్పెక్టర్లకు రాష్ట్ర స్థాయిలో మార్చి మొదటి వారంలో ఒక్క రోజు శిక్షణ అందించనున్నారు. స్టేట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎస్‌సీఆర్‌బీ) ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. డీసీఆర్‌బీ సమాచారం క్షేత్ర స్థాయిలో పనిచేసే ఇన్వెస్టిగేషన్ అధికారులతోపాటు, లా అండ్ ఆర్డర్ సిబ్బందికి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచే డీసీఆర్‌బీల ఇన్‌స్పెక్టర్లకు రివార్డులు అందజేయనున్నట్టు డీజీపీ వెల్లడించారు.

ప్రజలకు ఆనందబాష్పాలు.. ప్రతిపక్షాలకు కన్నీటిబాష్పాలు

25 రోజుల్లో 50 లక్షల మందికి కంటి పరీక్షలు: హరీశ్‌రావు



సాక్షి, సిద్దిపేట: కంటి వెలుగు కార్యక్రమంతో ప్రజలకు ఆనంద బాష్పాలు.. ప్రతిపక్షాలకు కన్నీటి బాష్పాలు వస్తున్నాయని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటిదాకా 50 లక్షల మందికి కంటి పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంధత్వరహిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. 25 పని దినాల్లో 50 లక్షల మందికి కంటి పరీక్షలు చేశామన్నారు. గతంలో 827 బృందాలు పనిచేస్తే, ఈసారి 1500కు పెంచామని హరీశ్‌రావు తెలిపారు. 50 లక్షల మందికి పరీక్షలు చేస్తే 16 లక్షల మందికి దృష్టి లోపం ఉన్నట్టు తేలిందన్నారు. ఇప్పటివరకు 1,68,062 మందికి కంటి పరీక్షలు నిర్వహించి రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో ఉందని కొనియాడారు. దక్షిణ భారత దేశ ధాన్యాగారంగా తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారని హరీశ్‌రావు చెప్పారు. దేశంలో వ్యవసాయం వృద్ధి రేటు 4% శాతం ఉంటే, రాష్ట్రంలో 7.8% శాతం ఉందన్నారు.

కుక్కల దాడిలో 12 మందికి గాయాలు

- రంగారెడ్డి జిల్లా యాచారంలో 10 మందిపై దాడి.. నలుగురికి సీరియస్
- మరో రెండు ఘటనల్లో బాలుడు, వృద్ధురాలికి గాయాలు

యాచారం/ బోనకల్/ అడ్డగూడూరు/ నేలకొండపల్లి: రాష్ట్రంలో గురువారం కూడా కుక్క కాటు ఘటనలు నమోదయ్యాయి. మూడు వేర్వేరు చోట్ల కుక్కల దాడిలో 12 మందికి గాయాలుకాగా.. అందులో నలుగురి ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

ఒకరి వెనుక మరొకరిని కరుస్తూ..

గురువారం ఉదయం రంగారెడ్డి జిల్లా యాచారంలోని ఎల్లమ్మ దేవాలయం సమీప కాలనీలోకి వచ్చిన ఓ వీధి కుక్క.. వరుసగా ఒకరివెనుక ఒకరిని కరవడం మొదలుపెట్టింది. కుక్క దాడిలో గ్రామానికి చెందిన గడల నందీశ్వర్, కొత్త రాములమ్మ, బెల్లి కొమురయ్య, రేణుక, ఇబ్రహీంపట్నంకు చెందిన కొప్పు సాయమ్మ, మల్కీజ్‌గూడకు చెందిన బోడ వెంకటమ్మ, బూర వెంకటమ్మ, బోడుప్పల్‌కు చెందిన మహేశ్, నందివనపర్తికి చెందిన సుధాకర్, మొండిగౌరెల్లికి చెందిన శ్యాంసుందర్ గాయపడ్డారు. వారికి యాచారం పీహెచ్‌సీలో చికిత్స చేశారు. పరిస్థితి సీరియస్‌గా ఉన్న నందీశ్వర్, కొత్త రాములమ్మ, కొమరయ్య, బోడ వెంకటమ్మలను 108లో హైదరాబాద్ నారాయణగూడలోని ఓ ఆస్పత్రికి తరలించారు.


యాచారంలో పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వృద్ధురాలు

- ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతలకు చెందిన తాళ్లూరి శ్రీకాంత్ కుమారుడు వరుణ్ సందేశ్ చిరునోములోని ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుండి ఇంటికి వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేయడంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి.
- యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని కోటమర్తికి చెందిన చిత్తలూరు పూలమ్మ గురువారం ఉదయం వీధిలో వెళ్తుండగా సుమారు పది కుక్కలు దాడి చేశాయి. ఆమె రెండు కాళ్లకు తీవ్రంగా గాయాలవడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.
- ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మోటాపురంలోని ప్రభుత్వ పాఠశాల వద్దకు గురువారం పెద్దసంఖ్యలో వీధికుక్కలు చేరుకున్నాయి. అదే సమయంలో నాలుగు కొండముచ్చులు అక్కడికి రావడంతో వాటిపై కుక్కలు దాడి చేశాయి. విద్యార్థులంతా తీవ్రంగా భయాందోళనకు లోనయ్యారు.

కాణిపాకంలో నూతన ఆర్జిత సేవలు

యాదమరి(చిత్తూరు జిల్లా): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో మార్చి 4వ తేదీన నూతనంగా సహస్ర నామార్చన ఆర్జిత సేవను ప్రారంభించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు వెల్లడించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ సేవ ఉదయం 6 గంటల నుంచి 6.45 వరకు జరుగుతుందన్నారు.

వీధి కుక్కలన్నింటికీ ‘స్టెరిలైజేషన్’

▶ మొదటి పేజీ తరువాయి

129 మున్సిపాలిటీలు, జీహెచ్‌ఎంసీ సహా 13 కార్పొరేషన్లలో చేపట్టాల్సిన చర్యలపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. ఈ కార్యాచరణకు తగినట్టుగా చర్యలు చేపట్టాలని రాష్ట్రంలోని అన్ని పురపాలికల కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది.

మార్గదర్శకాలు ఇవీ..

- అన్ని పట్టణాలు, నగరాల్లో 100 శాతం వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు (స్టెరిలైజేషన్) చేయాలి.
- వీధికుక్కలకు సంబంధించిన ఫిర్యాదులకు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా స్పందించాలి.
- కుక్కలను పట్టుకునే బృందాలను, వాహనాల సంఖ్యను పెంచాలి.
- వీధికుక్కలు అధికంగా ఉన్న ప్రాంతాలు, కుక్కకాటు ఘటనలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి స్థానిక కాలనీలు, బస్తీ సంఘాల సహకారంతో చర్యలు చేపట్టాలి.
- మాంసాహార దుకాణాలు, ఫంక్షన్‌హాల్స్, హాస్టళ్లు ఉన్న చోట మాంసపు వ్యర్థాలను, మిగిలిన ఆహారాన్ని వీధికుక్కలు తిరిగే చోట్ల పడేయకుండా చర్యలు చేపట్టాలి.
- వీధికుక్కల నియంత్రణకు స్వయం సహాయక బృందాలు, పారిశుధ్య సిబ్బంది, మెప్మా సిబ్బంది సేవలను వినియోగించుకోవాలి.
- వీధికుక్కల విషయంలో ఎలా ప్రవర్తించాలనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. దీనిపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కరపత్రాలను పంపిణీ చేయాలి.
- పట్టణాలు, నగరాల్లో ప్రజలను చైతన్యపరచాలి.
- వేసవి కాలంలో వీధికుక్కల ఆగడాలను తగ్గించేందుకు తగిన సంఖ్యలో నీటి తొట్లను ఏర్పాటు చేయాలి.

ఎన్నికల వరకు ‘పట్టణ మాస్టర్‌ప్లాన్లు’ వద్దు

- ప్రజావ్యతిరేకత నేపథ్యంలో అధికారులకు సర్కారు మౌఖిక ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పురపాలక సంఘాలు, సంస్థల్లో కొత్తగా బృహత్తర ప్రణాళికలు (మాస్టర్‌ప్లాన్లు) ఏవీ రూపొందించవద్దని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు బృహత్తర ప్రణాళిక ముసాయిదా కార్యక్రమాల జోలికి వెళ్లవద్దని అధికార యంత్రాంగానికి ప్రభుత్వం మౌఖికంగా ఆదేశించింది. బృహత్తర ప్రణాళికలపై ప్రజల నుంచి ముఖ్యంగా రైతుల నుంచి ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తమైన సంగతి తెలిసిందే. కామారెడ్డి మునిసిపాలిటీ మాస్టర్ ప్లాన్ ముసాయిదాలో రైతుల భూములను పారిశ్రామిక ప్రాంతానికి కేటాయించడంతో రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడం, అన్ని రాజకీయ పార్టీలు అన్నదాతలకు అండగా నిలవడం, ధర్నాలు, బంద్‌లతో దాదాపు వారంపాటు కామారెడ్డి మునిసిపాలిటీ ప్రాంతం అట్టుడికింది. కామారెడ్డి మునిసిపాలిటీ మాస్టర్ ప్లాన్ అమలు చేయొద్దంటూ పలువురు హైకోర్టుకు సైతం వెళ్లారు. అదే సమయంలో జగిత్యాల, నిర్మల్ మునిసిపాలిటీల మాస్టర్‌ప్లాన్‌లపైనా ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. దీంతో వాటిని అమలు చేయబోమని స్థానిక సంస్థలు, అధికార పార్టీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే మాస్టర్‌ప్లాన్ ముసాయిదాల రూపకల్పనను తాత్కాలికంగా నిలిపివేయాలని డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) వర్గాలను ప్రభుత్వం ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి మార్చి నెలాఖరులోగా మొత్తం 68 మునిసిపాలిటీల్లో ఈ బృహత్తర ప్రణాళికల ముసాయిదాలు రూపొందించి ప్రజాభిప్రాయ సేకరణ, పురపాలక సంఘాల ఆమోదంతో వాటిని నోటిఫై చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారమే ముసాయిదాల రూపకల్పనకు ఆదేశించింది.

కొత్తగా 72 పురపాలికలు

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 72 మునిసిపాలిటీలు, కొత్తగా 8 కార్పొరేషన్లు ఏర్పాటయ్యాయి. కొత్త మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల ఏర్పాటు సమయంలో పలు గ్రామాలను వాటిలో విలీనం చేశారు. ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందడానికి వీలుగా అన్నింటికీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి మాస్టర్‌ప్లాన్‌లో పారిశ్రామిక, రిక్రియేషన్, వాణిజ్య, నివాస జోన్లు, చెరువులు, కుంటలు ఉన్నచోట బఫర్ జోన్ల ఏర్పాటు, గ్రీన్‌బెల్ట్, రహదారులు, బైపాస్ రోడ్లు, మౌలిక సదుపాయలతోపాటు వచ్చే 20–30 ఏళ్ల వరకు ఆయా ప్రాంతాల్లో భూవినియోగ మార్పిడి అవసరం లేకుండా పకడ్బందీగా మాస్టర్ ప్లాన్‌లకు రూపకల్పన ప్రారంభించింది. జియో ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆధారంగా రెవెన్యూ, నీటిపారుదల శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఈ మాస్టర్‌ప్లాన్‌లను రూపొందిస్తోంది. ఇదివరకున్న మాస్టర్‌ప్లాన్లలో మార్పుచేర్పులు చేయడానికి కూడా కసరత్తు ప్రారంభించాలని భావించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.